ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం



వార్త

శనివారం 31, మే 2025 16 పేజీలు




2వ పేజీలో...

## రాష్ట్ర అవతరణ వేడుకలు అట్టహాసంగా నిర్వహించేలా ఘనంగా ఏర్పాట్లు

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఎండ తీవ్రతను తట్టుకునేలా ప్రతి గ్యాలరీలో కూలర్లు ఏర్పాటు

పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో జరుగనున్న రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



## కెనడా వెళ్లొచ్చేలోగా ప్లాట్లు హాంఫట్

ఖమ్మం రూరల్‌లో కళ్ళు చెదిరే అక్రమం

2 లో..

అక్రమ రిజిస్ట్రేషన్లకు మరో తార్కాణం

వెంచర్ నిర్వాహకుడి మృతితో అక్రమార్కుల దుస్సాహసం

భార్య కెనడా నుంచి వచ్చేసరికే ఇళ్ల నిర్మాణం

ప్లాట్ల విక్రయంతో అసలు విషయం వెలుగులోకి..

ఇదేమిటని ప్రశ్నించగా భాధితురాలిపై దౌర్జన్యం

దిక్కున్నకాడ చెప్పుకోమని జులుం

మృతుడి భార్య, కుమారులకే ఆస్తి హక్కు: సబ్ రిజిస్ట్రార్

ఖమ్మం రూరల్, ప్రభాతవార్త

ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీలో కళ్ళు చెదిరిపోయే అక్రమం వెలుగు చూసింది. వెంచర్ నిర్వాహకుడి మృతి చెందడంతో దర్జాగా ప్లాట్ లను కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టిన ఉదంతం ఇది. భర్త చనిపోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న భార్య కెనడాలో తన కుమారుల వద్దకు వెళ్లి వచ్చేసరికే అడ్డగోలుగా అక్రమ రిజిస్ట్రేషన్లకు ఒడిగట్టారు. సదరు మృతుడి భార్య తన భర్త పేరుపై భద్రంగా దాచుకున్న మ్యాప్, ల్యాండ్ ఒరిజినల్ డాక్యుమెంట్లు, ఈసీ, లింక్ డాక్యుమెంట్లను కూసుమంచి, ఖమ్మం రూరల్ సబ్ రిజిస్టార్ కార్యాలయంలో పరిశీలన చేయగా అవి వారి ఆస్తి అని నిర్ధారణ అయింది. ఈ నేపథ్యంలో భార్య,



16వ పేజీలో...

## పులిగుండాలలో ఎకో టూరిజంకు.. రూ. 500 కోట్లు

పులిగుండాల ప్రాజెక్టును సందర్శించిన మంత్రి,ఎమ్మెల్యే, కలెక్టరు, సి సి ఎఫ్,...

అభివృద్ధి పనులకు 2 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం...

పోడు పేరుతో అడవులు నరికితే అధికారులను సర్వీస్ నుంచి రిమూవ్ చేయండి...

సి సి ఎఫ్ ను ఆదేశించిన మంత్రి తుమ్మల

**సత్తుపల్లి మే 30 ప్రభాతవార్త**

సత్తుపల్లి ఫారెస్ట్ డివిజన్ పరిధిలోని పెనుబల్లి కల్లూరు మండలాల మధ్య దట్టమైన అడవుల్లో ఉన్న పులిగుండాల ప్రాజెక్టును ఎకో టూరిజం కింద దేశంలోనే రోల్ మోడల్ గా పర్యాటకులు ఆకర్షించే విధంగా తయారు చేయాలని జిల్లా కలెక్టర్ ముజుముల్ ఖాన్ భద్రాద్రి ఫారెస్ట్ జోన్ సిసిఎఫ్ బీమా నాయక్ లను రాష్ట్ర వ్యవసాయ సహకార

## అవినీతికి.. రాజబాట

గోదారి తీరంలో వందల కోట్ల ఇసుక దోపిడీ

ఎన్‌జిటి ఆదేశాల యథేచ్ఛగా ధిక్కరణ

పర్యావరణ అనుమతులు లేకున్నా తవ్వకాలు

టిఎసి అప్రూవల్స్‌కి తప్పుడు భాష్యం

"డిసిల్ట్" పేరుతో కలెక్టర్ ఉత్తర్వులు

అధిక రిఫరెన్స్‌లు ఇరిగేషన్ వారివే

ఐనా తమకేం సంబంధం లేదంటూ వాదన

**చర్ల-ప్రభాతవార్త :** నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ స్టే ఉత్తర్వులను యదేచ్ఛగా ధిక్కరిస్తూ గోదారి గర్భం నుంచి వందల కోట్ల విలువైన ఇసుకను తవ్వేసి పట్టుకుపోతున్నారు. "డిసిల్ట్" పేరుతో ఓ వంకని వెదుక్కుని సాక్షాత్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరే ప్రొసీడింగ్ ఇచ్చేయడంతో వ్యవహారం రసవత్తరంగా మారింది. " సీతమ్మసాగర్ బహుళార్థక సాధక బ్యారేజ్ లో మునిగిపోయే ప్రాంతం (సబ్‌మెర్జెన్స్) ఏదైతే ఉందో అక్కడ పేరుకుపోయిన సిల్ట్(పూడిక) ని తొలగించడానికి " అంటూ ఆ ఉత్తర్వుల్లో పేర్కొంటూ.,ఇందులోనే ఆసక్తికరమైన "ఇసుక" అంశాన్ని ప్రధానంగా చెప్పడంతో పూడిక తొలగింపు అనేది "కేవలం ఇసుక కోసమే" అనేది తేటతెల్లమైంది. ఆ ప్రొసీడింగ్‌లో ఏమీ దాపరికం లేకుండానే శ్యాండ్ తవ్వకాలని చెప్పేసి ఏకంగా చర్ల-మణుగూరు మండలాల పరిధిలో పనిలో పనిగా 12 ఇసుక రీచ్‌లు మంజూరు ఇచ్చేశారు. మొత్తం 7లక్షల73వేల667 క్యూబిక్‌మీటర్ల ఇసుకని నిలువునా తోడేసుకొమ్మని ఆర్డరేసేసీ..కోర్టు కేసువల్ల అన్నారాన్ని వదిలేశారు.

33లక్షల45వేల975 చదరపు మీటర్ల పరిధిలోని నదీ తీరాన్ని తవ్విపారేయవచ్చని అందులో వీలుకల్పించారు. జిల్లాకలెక్టర్ ప్రొసీడింగ్ నెంబర్: 4124/శ్యాండ్/2012-1 తేది: 16.04.2025 ద్వారా ఇచ్చిన ఇసుక క్లియరెన్స్ ఆదేశంలో మొత్తం 12 రిఫరెన్స్‌లను కోడ్ చేయగా,



2వ పేజీలో...

# అవినీతికి రాజబాట



(మొదటి పేజీ తరువాయి..)

అందులో 9 రిఫరెన్స్‌లు సాక్షాత్తూ "ఇరిగేషన్ వారివే" కావడం విశేషం. ఈ అంశాన్ని ఇక్కడ ప్రధానంగా ప్రస్తావించడానికి ఓ విశేషముంది. ఎందుకంటే నదీ తీరంలో అందునా ఇంకా నిర్మాణానికి అష్టకష్టాలు పడుతున్న సీతమ్మ సాగర్ బ్యారేజ్ ముంపులో ఇలాటి తవ్వకాలకు వారే పచ్చజెండా ఊపేశారని ఈ 9 రిఫరెన్స్‌లు చెబుతున్నాయి. ఓఎ నెంబర్: 27/2023 లో జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ చెన్నయ్‌బెంచ్ 24.03.2023 తేదీన ఇచ్చిన "స్టే ఉత్తర్వులు" నేరుగా ఇరిగేషన్ వారిమీద ఉంటాయి. ఎందుకంటే ఇందులో వీరు కూడా పార్టీ కాబట్టి ఆ స్టే ఆర్డర్ వీళ్ళమీద బెండింగ్ ఉంటుంది. జిల్లా కలెక్టర వారికి సాంకేతికంగా ఇక్కడ బైండింగ్ ఉండదనేది ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. కాబట్టి ఎన్‌జిటి స్టే ఆర్డర్ అనేది "ఇసి క్లియరెన్స్ పెండింగ్" వల్ల జారీ అయింది. 2025-మే నెల వెళ్ళిపోతున్నా ఆ సాంకేతిక అభ్యంతరం క్లియర్ అయిందా అంటే అవ్వలేదనే తెలుస్తున్నది. కాబట్టి ఎన్విరాన్‌మెంటల్ క్లియరెన్స్(ఇసి) లేనందువల్ల "సీతమ్మసాగర్ బ్యారేజ్" పరిసరాల్లో ఎలాంటి తవ్వకాలు లేదా ఇతరత్రా అభివృద్ధి పనులు చేయబోమని ఆ ఓఎ 27/2023 లో రాష్ట్ర ప్రభుత్వం రిటర్న్‌స్టేట్‌మెంట్ వేసింది కూడా. ఈ పరిస్థితుల్లో తాజా కలెక్టర్ వారి ఇసుక ర్యాంపుల ప్రొసీడింగ్‌లో 9 సార్లు ఇరిగేషన్ వారు ఇసుక తవ్వకాలకు ఆమోదం ఎలా తెలుపుతారో అర్ధంకాని విషయం.

### "ఇసి" క్లియరెన్స్ తీసుకున్నారా ?

ఎన్విరాన్‌మెంటల్ క్లియరెన్స్ లేనందువల్ల సీతమ్మసాగర్ బ్యారేజ్ పనులను ఆపేయమని ఎన్‌జిటి 2023లో స్టే ఇచ్చింది. 24.03.2023 తేదీన ఈ ఆర్డర్ వచ్చింది. అంటే రెండేళ్ళు దాటింది. మరి ఈ మధ్యలో ఇసి అనుమతులు వచ్చాయా లేదా అనేది స్పష్టంగా చెప్పడంలేదు. ఒకవేళ వచ్చిఉంటే ఎక్కడా సంబంధిత నీటిపారు దల విభాగం ఆ విషయాన్ని ఇప్పటిదాకా ప్రకటించలేదు. పైగా 24.04.2025 తేదీన టెక్నికల్ అప్రైజల్ కమిటీ సమావేశం జరిగింది. ఇందులో కేంద్రజల్‌శక్తి మంత్రిత్వ కార్యదర్శి దేబ్‌శ్రీముఖర్జి, సిడబ్ల్యుసి ఛైర్మెన్ ముఖేష్‌కుమార్ ముఖర్జిల నేతృత్వంలో "సీతమ్మసాగర్" కి "టిఎసి" అప్రూవల్ మాత్రమే ఇచ్చినట్లు తెలుస్తున్నది. టిఎసి అప్రూవల్ వేరు..,ఇసి క్లియరెన్స్ వేరు. టిఎసి అనేది ఇసి అనుమతి పొందేందుకు చేసే ప్రయత్నంలో ఒక భాగం మాత్రమేనని "కార్ప్‌బిజ్" స్పష్టం చేసింది. కాబట్టి 24.04.2025 తేదీన వచ్చింది కేవలం టిఎసి మాత్రమే. ఈ వార్త రాసే సమయానికీ.,టిఎసి అప్రూవల్ వచ్చిన దానికీ మధ్య కేవలం 34 రోజుల వ్యవధి మాత్రమే ఉన్నది. మరి ఈ మధ్యలో మళ్ళీ కొత్తగా (24.04.2025 తేదీ తర్వాత) ఇసి అనుమతి ఖచ్చితంగా వచ్చి ఉండదు. మరి అలాంటప్పుడు ఇసి అనుమతులు లేనప్పుడు సీతమ్మసాగర్ బ్యారేజ్ ముంపులో ఏవిధంగా ఇసుక తవ్వకాలు జరుపుతారో.,దానికి ప్రత్యేకంగా కలెక్టరంతటి వారు నేరుగా ప్రొసీడింగ్ ఎలా ఇస్తారో అంతా అయోమయంగా ఉన్నది. అంతేకాదు ఒకవేళ ఎన్‌జిటి సాంకేతిక అవరోధాలు లేకున్నా కూడా.,ఇంత పెద్ద మొత్తంలో నదీ గర్భంలో ఇసుక తవ్వకాలు జరపాలంటే విధిగా కేంద్ర పర్యావరణ అనుమ తులు కావాల్సిందే. స్టేట్‌లెవెల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ ఎసెస్‌మెంట్ కమిటి(ఎస్‌ఈఎసి) నివేదికల ఆధారంగా దానికో తంతు పూర్తి కావాలి. అంతే గానీ ఇలా ఇరిగేషన్ వారి రిఫరెన్స్‌లు కోడ్ చేసేసి అమూల్యమైన ఇసుకని తోడేసుకునేందుకు ప్రొసీడింగ్‌లు ఇస్తే దానికెంత హేతుబద్ధత ఉంటుందో ప్రభుత్వ పెద్దలే చెప్పాలి. ఇక్కడ ఇంకో ట్విస్ట్ ఏమంటే ఓ కింది స్థాయి ఇరిగేషన్ ఇంజనీర్ వద్ద ఈ విషయాన్ని ఆఫ్‌దిరికార్డ్‌గా ప్రస్తావించగా ఆయన చేతులెత్తేశారు. ఇసి అనుమతి ఉందా లేదా అనేది మాకు సంబంధం లేదని, ఇసకే తోడుకుంటారా లేక మట్టే పట్టుకుపోతారో అది వాళ్ళ ఇష్టమని, మేమైతే ఈ విషయంలో ఎలాంటి వేళ్ళూ పెట్టలేదని తప్పించుకునే ప్రయత్నం చేశారు. కానీ కలెక్టర్ వారి ప్రొసీడింగ్‌లో 9 రిఫరెన్స్‌లు ఇరిగేషన్ వారివేననే విషయాన్ని వీళ్ళు మరచిపోతున్నారు.

# కెనడా వెళ్లి వచ్చేలోగా ప్లాట్లు హాంఫట్

(మొదటి పేజీ తరువాయి..)

కుమారులు ఆ ఫ్లాట్ లను ప్రభుత్వ నిబంధనల మేరకు చలానా కట్టి ఇతరులకు విక్రయించారు. ఆ ఫ్లాట్ కొనుగోలు చేసుకున్న వారు తమకు ప్లాట్ విక్రయించిన బాధితురాలితో కలిసి తమ కొనుగోలు చేసుకున్న ఫ్లాట్ ల వద్దకు వెళ్ళగా ఆ ప్లాట్లలో ఇళ్ల నిర్మాణం చేసుకొని ఉండటంతో కంగుతిన్నారు. అక్రమ నిర్మాణాలపై భాదితురాలు సదరు వ్యక్తులను నిలదీయగా నీకు దిక్కున్నకాడ చెప్పుకోమని దౌర్జన్యానికి దిగడంతో ఆమె తనకు జరిగిన అన్యాయాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పోలీసు కమీషనర్ దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నంలో వున్నారు. ఈ విషయమై మంత్రి విచారణకు ఆదేశిస్తే అక్రమార్కులతో పాటు వారికి సహకరించిన అధికారుల పాపం కూడా పండే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

### వెంచర్ ఏర్పాటు ఇలా...

ఖమ్మం నగరానికి చెందిన గుర్రం గోపాలకృష్ణ 2005లో సత్యనారాయణపురం గ్రామానికి చెందిన తోట చిన్న వెంకటరెడ్డి అనే వ్యక్తికి చెందిన 120/ వూ సర్వే నెంబర్లో పది ఎకరాలను కొనుగోలు చేసుకున్నాడు. ఆ భూమికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం కన్వర్షన్, గ్రామపంచాయతీ లేఅవుట్ తీసుకొని 31 ఫ్లాట్లుగా చేసి వెంచర్ వేశాడు. అందులో నుంచి 29 ప్లాట్లను ఇతరులకు విక్రయించాడు. కానీ 21, 22 ప్లాట్లను ఎవరికి విక్రయించకుండా ఉంచుకున్నాడు. ఈ క్రమంలో 2015లో గుండెపోటుతో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో ఆ వెంచర్ నిర్వాహకుడి మరణానంతరం ఫ్లాట్లు కబ్జాకు గురయ్యాయి.

### 21,22 నెంబర్ ప్లాట్ల విక్రయం...

కాగా తన భర్త మరణం తరువాత ఆమె కెనడాలోని తన కుమారుల వద్దకు వెళ్లి ఏడాది తర్వాత ఖమ్మంకు వచ్చారు. తమ అవసరాల నిమిత్తం తమ ప్లాట్లను ఇద్దరు వ్యక్తులకు విక్రయించారు. తమ వద్ద ప్లాట్లు కొనుగోలు చేసిన వ్యక్తులకు స్థలాలు అప్పగించే పనిలో భాగంగా ఆమె తమ ప్లాట్ల వద్దకు వెళ్ళగా సదరు 480 గజాల స్థలంలో రెండు ఇళ్ళు ఉండటంతో ఆమె కంగుతున్నారు. ఇదేమిటని ప్రశ్నించగా నిర్మాణదారులు ఆమెపై బెదిరింపులకు పాల్పడ్డారు. ఇవి తమ ప్లాట్లు కదా మీకు ఎవరు విక్రయించారు మీ డాక్యుమెంట్ చూపించండని అడిగితే నీకు దిక్కున్నచోట చెప్పుకోమని దురుసుగా వ్యవహరించారు.

### అమ్మో రూరల్...

ఖమ్మం రూరల్ సబ్ రిజిస్ట్రార్ పరిధిలో ఇప్పటికే ఎన్నో భూ అక్రమాలు జరిగి ఉండటంతో రూరల్ ప్రాంతంలో స్థలాల కొనుగోలుకు ప్రజలు జంకుతున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రముఖ రియల్టర్ గుర్రం గోపాలకృష్ణ భార్యకు జరిగిన అన్యాయం జరిగిన అంశం సర్వత్రా చర్చానీయాంశంగా మారడంతో రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సైతం మాయని మచ్చగా మారింది. అక్రమార్కులకు అడ్డుకట్ట వేయడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైనట్లు కనిపిస్తోంది. కాగా ఈ వ్యవహారం ఇప్పటికే మంత్రులు, ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో ఆక్రమణ దారులు కటకటాల పాలవ్వడంతో పాటు సదరు ప్లాట్లలో అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన అధికారుల మెడకు ఉచ్చు బిగుసుకునే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

### ఎవరి పేరు మీద అయితే ఒరిజినల్ రిజిస్ట్రేషన్ డాకుమెంట్స్ ఉంటాయో వారే నిజమైన హక్కు దారుడు : ఖమ్మం రూరల్ సబ్ రిజిస్ట్రేషన్ ఇంచార్జ్ రిజిస్టార్

ఈ విషయం పై ఖమ్మం రూరల్ సబ్ రిజిస్టేషన్ ఇంచార్జ్ రిజిస్టార్ ను వివరణ కోరగా ఎవరి పేరు మీద అయితే ఒరిజినల్ రిజిస్ట్రేషన్ డాకుమెంట్స్ ఉంటాయో వారే నిజమైన హక్కు దారుడు అవుతారు అన్నారు. తప్పుడు డాకుమెంట్స్ తో రిజిస్టేషన్ చేయించు కున్న వారు పై క్రిమినల్ కేసు పెట్టవచ్చు అన్నారు.

## ఐఈడి పేలి ముగ్గురు గ్రామస్తులకు గాయాలు



**చర్ల, మే30,( ప్రభాతవార్త )**

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో ఐఈడి పేలి ముగ్గురు గ్రామస్తులు గాయపడ్డారు. మద్దేడు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎర్రగుఫా దంపయా గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు బండేపారా కు పనుల కోసం వెళ్తున్న క్రమంలో భద్రతా బలగాలను లక్షంగా చేసుకొని మావోయిస్టులు మార్చిన ఐఈడి పేలడంతో ముగ్గురుకి తీవ్రగాయలయ్యాయి. గాయపడిన వారిలో గొటే జోగా వివేక్ ధోరి బద్దె సునీల్ ఉన్నారు. వీరందరికీ తీవ్రగాయాలైయ్యాయి. గాయపడిన వారిని హుటాహుటిన అంబులెన్స్ సహాయంతో బీజపూర్ జిల్లా వైద్యశాలకు తరలించి చికిత్సలు అందిస్తున్నారు. ప్రస్తుతం వీరి ఆరోగ్య పరిస్థితి కొంత ఆందోళన కరంగా ఉంది.

## రాష్ట్ర అవతరణ వేడుకలు అట్టహాసంగా నిర్వహించేలా ఘనంగా ఏర్పాట్లు

**జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**

**ఎండ తీవ్రతను తట్టుకునేలా ప్రతి గ్యాలరీ లో కూలర్లు ఏర్పాటు**

**పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో జరుగనున్న రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్**

**ఖమ్మం, మే 30, ప్రభాతవార్త :**



జూన్ 2న జరుగనున్న రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను అట్టహాసంగా నిర్వహించేలా ఘనంగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్, పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో జూన్ 2న నిర్వహించనున్న రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల సందర్భంగా చేయవలసిన ఏర్పాట్లను పరిశీలించారు. వాతావరణ పరిస్థితులను బట్టి తగిన సౌకర్యాలు కల్పించాలని అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు వేదికను పకడ్బందీగా ఏర్పాటు చేయాలని, ఆకర్షణీయంగా ఉండాలని తెలిపారు. వేడుకలకు సౌండ్ సిస్టం ఏర్పాటు, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండాలని, విఐపి, ప్రజలకు, విద్యార్థులకు గ్యాలరీలు ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని, ప్రోటోకాల్ ప్రకారం ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా ఆహ్వానం అందాలని అన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు సంబంధించి మినట్ టు మినట్ ప్రోగ్రాం షెడ్యూల్ తయారు చేసుకోవాలని అన్నారు. ముఖ్య అతిథి గౌరవ వందనం స్వీకరణ, జాతీయ పతాకావిష్కరణ, తెలంగాణ గీతం ఆలాపన, ముఖ్య అతిథి సందేశం, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కార్యక్రమాలపై శకటాల ప్రదర్శన, పిల్లలచే సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, స్టాల్స్ సందర్శన పక్కాగా ప్లాన్ చేసుకోవాలని అన్నారు. అవతరణ వేడుకలకు వచ్చే ప్రజలకు, పిల్లలకు ఎండ తగలకుండా పూర్తి స్థాయిలో టెంట్ వేయాలని, ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని అన్ని గ్యాలరీ లలో వేడిని తట్టుకునేలా కూలర్లు ఏర్పాటు చేయాలని అన్నారు. వర్షాభావ పరిస్థితులు ఉంటే అందుకు తగ్గ ముందస్తు చర్యలు తీసుకోవాలని వివరించారు. వి.ఐ.పి లకు ప్రత్యేకంగా రిఫ్రెష్మెంట్, స్నాక్స్ ఏర్పాటు చేయాలని, వేడుకలకు వచ్చే ప్రజలకు కూడా రిఫ్రెష్మెంట్ ఏర్పాటు చేయాలని, సీటింగ్ ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని, ప్రోటోకాల్ ప్రకారం సీటింగ్ ఏర్పాట్లు, ప్రెస్ గ్యాలరీ, త్రాగునీరు, పండ్లు ఏర్పాట్లు చేయాలని, దీనిని అప్రమత్తంగా నిర్వహించాలని అన్నారు. జిల్లాలో ప్రభుత్వ శాఖల ద్వారా ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలను వివరిస్తూ స్టాల్స్ ఏర్పాటు చేయాలని, ప్రతి శాఖకు చెందిన అధికారులు, సిబ్బంది వేడుకలకు తప్పని సరిగా హాజరు కావాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో పద్మశ్రీ, పోలీస్ అడ్మిన్ ఆర్ఐ కామరాజు, అర్బన్ తహసిల్దార్ సైదులు, ఆర్ఐ వహీద్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘోర రోడ్డ ప్రమాదం

**- ఎటువంటి ప్రాణ నష్టం లేదు**

**వైరా,మే30,ప్రభాతవార్త:**

వైరా మండలం స్టేజిపినపాక సమీపంలోని వైరా నది బ్రిడ్జి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఖమ్మం నుండి సత్తుపల్లి వైపు వెళుతున్న ఇనుప సువ్వల లారీ రాజమండ్రి నుండి హైదరాబాద్ వెళుతున్న కొబ్బరి బోండాల వ్యాన్ ఢీకొట్టి వ్యాన్ వెనుక వస్తున్న మరో కారును ఢీకొని బ్రిడ్జిపై నుంచి క్రిందపడిన సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే ఖమ్మం వైపు నుండి వెళుతున్న లారీ డిసిఎం వ్యాన్ కారును ఢీకొనడంతో ప్రమాదం చోటు చేసుకుంది. బ్రిడ్జిపై నుండి లారీ కారు క్రిందపడిపోగా కొబ్బరికాయల వ్యాన్ పూర్తిగా క్రిందపడింది. ఈ ప్రమాదంలో రెబ్బవరం గ్రామానికి చెందిన ఒక కుటుంబం ప్రాణాలతో బయటపడింది. స్వల్ప గాయాలతో ఇద్దరిని హాస్పిటల్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే రెబ్బవరం గ్రామానికి చెందిన మొగిలిశెట్టి రాజశేఖర్, కోటేశ్వరరావు, గీత వారిద్దరి పిల్లలు తేజశ్రీ, జ్యోతి, తిరువూరు వెళ్లి తిరిగి వైరా వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది.



బ్రిడ్జిపై నుండి కారు పడిపోవడంతో నుజ్జుఅయింది. కాని ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణహాని జరగకపోవడంతో వారి కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదం జరిగిన సంఘటన చూస్తే ఎలా బయటపడ్డారు అని ఆశ్చర్యాన్ని గురిచేసింది. ఎందుకంటే ఈ ప్రమాదం తీరు ఈ విధంగా కనిపిస్తుంది. విషయం తెలుసుకున్న వైరా ఎస్సై రామారావు పోలీస్ సిబ్బందితో అక్కడికి వెళ్లి కారులో చిక్కుకున్న వారిని బయటకు తీసి 108లో చికిత్సకు తరలించారు. రోడ్డుపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న ప్రజలు పెద్ద ఎత్తున వైరా బ్రిడ్జి వద్దకు చేరుకున్నారు.





# వనమా కాలనీలో చోరీ

**- 15 గ్రాముల బంగారం, 250 గ్రాముల వెండి,**


**రూ.50 వేలు నగదు తస్కరణ**

**పాల్వంచ క్రైం, మే 30 – ప్రభాతవార్త:**

తాళం వేసిన ఇళ్లనే టార్గెట్‌గా చేసుకొని దొంగలు పాల్వంచ పట్టణం, మండలంలో హల్చల్ చేస్తున్నారు. గతంలో ఉద్యోగుల కాలనీలను టార్గెట్ చేసిన వారు ఇప్పుడు తాళం వేసి ఉన్న ఇళ్లలోకి చొరబడి అందిన కాడికి దోచుకుంటున్నారు. బాధితులు వచ్చి చూసి లబోదిబో మంటు రోధిస్తున్నారు. పాల్వంచ వనమా కాలనీలోని ఓ ఇంటిలో కిటికీ చువ్వలు కోసి బీరువాలో ఉంచిన 15 గ్రాముల బంగారం,250 గ్రాముల వెండి ఆభరణాలు, 50 వేల నగదు అపహరించిన సంఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇంటి యజమాని గణపతి ఐదు రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి ఊరికి వెళ్లారు. తన పనులు ముగించుకొని తిరిగి కుటుంబ సభ్యులతో ఇంటికి వచ్చి చూడగా కిటికీ చువ్వలు విరగ్గొట్టి ఉండటాన్ని చూసి కంగారుగా ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా పగలగొట్టి ఉండటాన్ని గమనించారు. వెంటనే మొత్తం చెక్ చేయగా బంగారు, వెండి ఆభరణాలు, నగదు చోరీకి గురైనట్లు నిర్ధారించుకొని పాల్వంచ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాల్వంచ పట్టణ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.







## పొలంలో అమర్చిన మోటర్ల చోరీ

**-.కేసు నమోదు చేసి విచారిస్తున్న పోలీసులు**

**పినపాక ప్రభాతవార్త, మే 30:**

రైతులు చేలో అమర్చిన విద్యుత్ మోటార్లో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేసిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఇ బయ్యారం ఎస్ఐ రాజకుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని తోగ్గూడం గ్రామనికి చెందిన వల్లెపు కృష్ణ అనే రైతు,పక్కనున్న మరో రైతులు తమ పొలలలో అమర్చిన విద్యుత్ మోటారుల అమర్చగా,శుక్రవారం పొలానికి వెళ్ళి చూడగా గుర్తుతెలియని వ్యక్తులు విద్యుత్ మోటార్ లు దొంగలించారని తెలుసుకొని స్థానిక ఇ బయ్యారంలో పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్టు ఎస్సై రాజ్ కుమార్ తెలిపారు. అపహరణకు గురైన మోటర్ల విలువ విలువ 46,000 రూపాయలు ఉంటుందని బాధిత రైతులు తెలిపారు.

# పదోన్నతిపై వెళ్తున్న కళ్యాణ్‌రామ్‌కు ఘనసన్మానం

**మణుగూరు, ప్రభాతవార్త, మే30 :**

సింగరేణి సంస్థ మణుగూరు ఏరియా పీకేఓసీలో అడిషనల్ మేనేజర్‌గా పనిచేస్తూ సూపరింటెండెంట్ ఆఫ్ మైన్స్‌గా పదోన్నతిపొంది జేవీఆర్ ఓసీ–2 మేనేజర్‌గా సత్తుపల్లి వెళుతున్న గుణగంటి కళ్యాణ్‌రామ్‌ను శుక్రవారం పీకేఓసీ అధికారులు, సూపర్వైజర్లు, కార్మికులు, కార్మికసంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. అనతంరం వారు మాట్లాడుతూ.. మణుగూరు ఏరియా అభివృద్ధికి, బొగ్గు ఉత్పత్తికి ఆయన చేసిన సేవలను ప్రశంసించారు.



# నేరాలు-దారుణాలు

## గుండెపోటుతో యువ రైతు మృతి

**కారేపల్లి మే 30 ప్రభాతవార్త :**





మృతుడి ఫైల్ ఫోటో

సింగరేణి మండలం మంగళ్ తండా గ్రామపంచాయతీలో శుక్రవారం గ్రామానికి చెందిన యువరైతు పిల్లలమర్రి వెంకటేష్ ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారంమంగళితండా గ్రామానికి చెందిన పిల్లలమర్రి వెంకటేష్ ఉదయం నిద్ర లేచి కుటుంబ సభ్యులతో మాట్లాడాడు. అయితే తనకు నిద్ర వస్తుందని చాతిలో కొద్దిగా నొప్పి ఉందని తెలిపాడు. కుటుంబ సభ్యులు వైద్యుని సంప్రదించేలోపే గుండెపోటుకు గురై మృతి చెందాడు. భార్య ఉమా తో పాటు ఇద్దరు కుమార్తెలు కీర్తన అనధిత కుమారుడు నిశాంత్ ఉన్నారు. తనకున్న రెండు ఎకరాల భూమిలో వ్యవసాయం సాగు చేస్తే కుటుంబ జీవనం కొనసాగిస్తున్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

**కొత్తగూడెం క్రైం, మే 30 – ప్రభాతవార్త:**



ఒక గుర్తు తెలియని పురుషుడు, వయసు 35- 40 సంవత్సరాలు ఉంటుంది. తడకలపూడి చీమల పహాడ్ రైల్వే స్టేషన్ మధ్యన 35/89 వద్ద రైలు బండి 17033 సింగరేణి మేము ఎక్స్‌ప్రెస్ వెనుక నుండి అతి వేగంగా ఢీ కొట్టడం తో తీవ్ర గాయాలయి అక్కడికక్కడే మృతి చెందినాడు, మృతుడి ఒంటిపై తెలుపు రంగు ఫుల్ షర్టు, బ్రౌన్ కలర్ పాయింట్, రైల్వే ట్రాక్ పై చెత్త వేరుకునే బస్తాలు, అందులో పనికి రాని చెత్త కలదు, మృతుడు చూచుటకు యాచకుని వలె ఉన్నాడు. ఇతర ఎలాంటి గుర్తింపు ఆధారాలు లేవు. తడికలపూడి రైల్వే స్టేషన్ స్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు జి ఆర్ పి ఎస్ఐ జే.సురేష్ కేసు నమోదుచేసి పంచనామా నిర్వహించి దర్యాప్తు చేస్తున్నారు, అతని వెంట రైల్వే పోలీస్ సిబ్బంది అశోక్ , మధుకర్ ఉన్నారు. ఎస్ఐ ఆదేశం మేరకు మృతదేహమును భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలించి మార్చ్యూరీ లో భద్రపరచండైనది. మృతుని ఆచూకీ తెలిసినవారు 99890 25481, 87126 58600,970137 1472 నంబర్లకు సమాచారం ఇవ్వగలరు.

## వివాహిత అదృశ్యం

**పాల్వంచ క్రైం, మే 30 – ప్రభాతవార్త:**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం రూరల్ పరిధిలోని జగన్నాధపురం గ్రామ నివాసి అయిన ధర్మసోత్ సుజాత అనే మహిళ ఈ నెల 29వ తేదీ గురువారం నుంచి అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గురువారం మధ్యాహ్నం సుమారు ఒంటి గంట సమయంలో కుటుంబ తగాదాలతో ఇంటి నుండి బయటకు వెళ్లిపోవడం జరిగింది. ఆమె ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు గాలించారు. ఎక్కడ సమాచారం రాకపోవడంతో పాల్వంచ రూరల్ ఎస్సై సురేష్‌కు ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు సెల్ 87126 82053 కు ఆచూకీ తెలపగలరని పోలీసులు చెప్పారు.

# ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

-రూ.2.7కోట్లతో ఆధునాతన భవనం

-వైద్యశాల నిర్మాణానికి భూమి పూజకు శ్రీకారం

-ఆరు నెలలలో నిర్మాణం పూర్తి చేయాలి

-ఎమ్మెల్యే పాయం





**బూర్గంపహాడ్, మే31, ప్రభాతవార్త:**

ప్రజల సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని అందుకు విస్తృతంగా వైద్య సేవలను అందించడమే ప్రభుత్వ ధ్యేయమని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నందు సుమారు 2.70కోట్ల అంచనా వ్యయంతో అత్యాధునిక హంగులతో నూతనం నిర్మించబోతున్న సామాజిక ఆరోగ్య కేంద్ర ఆవరణలో ఆయన భూమి పూజ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్పిటల్ నిర్మాణ పనులు ప్రారంభించి ఆరు నెలల్లో పూర్తి చేసి ప్రారంభం చేసుకోవాలని, అందుకు సంబంధించిన అధికారులు నిర్మాణ పనుల విషయంలో నాణ్యత లోపించకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించి పనులు వేగవంతం చేయాలన్నారు. మండల కేంద్రంలో ఉన్నటువంటి ప్రభుత్వ ఆసుపత్రికి ఎంత గొప్ప చరిత్ర ఉందో అలాంటి చరిత్ర ఉన్న ఆసుపత్రికి తిరిగి పూర్వ వైభవం వచ్చే విధంగా వైద్యులు నడుచుకోవాలని సూచించారు. సమయపాలన లేకుండా రాత్రి వేళలో వైద్యం విషయంలో అలసత్వంవ హించిన సహించేది లేదన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి వైద్య సేవలను పెంచే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. అనంతరం డాక్టర్ల సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ వైద్య సేవల కోసం అవసరమైన కొన్ని మౌళిక వసతులు వివరాలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత హాస్పిటల్ సూపర్టెంట్ నుండి దరఖాస్తు రూపంలో మౌళిక వసతులకు సంబంధించిన వివరాలను త్వరితగతిన తెలిపాలన్నారు. అనంతరం ఆసుపత్రి వైద్యులు సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిని దేవాలయంగా భావించి ప్రతి ఒక్కరూ వైద్య సేవలు అందించాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తనకు నేరుగా సమాచారం అందించాలని వైద్యశాల విషయంలో అలసత్వం వహిస్తే సహించేది లేదని తెలిపారు. అనంతరం ఆసుపత్రి వైద్యులు సిబ్బంది ఘనంగా శాలువా కప్పి సన్మానించారు. కొందరు స్థానికులు ఎంఎల్ పాయం దృష్టికి గోదావరి లోతట్టు ప్రాంత ప్రజలు మెట్ట ప్రాంతంలో స్థలం ఇచ్చి ఇల్లు నిర్మాణం చేపడతారా అని అడిగిన ప్రశ్నకు ఆయన జవాబుగా గోదావరి ముంపుకు గురయ్యే ప్రాంతాల ప్రజలకు మెట్ట ప్రాంతాల్లో స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు కట్టియ్యటానికి తాను ముందుకు ఉంటానని తెలిపారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో కొంత ప్రాంతం గోదావరి ముంపునకు గురవుతుందని, ముంపుకు ముందుగా ఎక్కువ శాతం గురి అయ్యే బూర్గంపహాడ్ మండలం తర్వాత అశ్వాపురం, మణుగూరు, పినపాక మండలాలు ఉన్నాయన్నారు. ముంపుకు గురై మండలాలకు సంబంధించి అధికారులతో రివ్యూ మీటింగ్ ద్వారా ఉన్నతాధికారుల సమావేశం నిర్వహించి అవసరం మేరకు ఎవరైతే మెట్ట ప్రాంతాలకు తరలి వస్తారో వారి వివరాలు సేకరించి ఇందిరమ్మ ఇల్లు నిర్మించడానికి ప్రభుత్వం తరపున తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు.

సంక్షేమ పథకాల అమలులో సామాన్యుడికి సరిగ్గా అందటం లేదు అని గత ప్రభుత్వంలో దళిత బందు విషయంలో ఆరోపణలు వచ్చాయని ప్రభాతవార్త ... ప్రశ్నించగా ఎమ్మెల్యే పాయం స్పందిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అన్ని వర్గాల ప్రజలకు నేరుగా చేరుతున్నాయని అన్నారు. ఇందిరమ్మ ఇల్లు కేవలం నిరుపేదలకే మాత్రమే ఇస్తున్నామని నిష్పక్షపాతంగా ఇస్తున్నామని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల విషయంలో ఎవరైనా దళారులు డబ్బులు అడిగిన ఇవ్వద్దని నేరుగా తనను కలవాలని సూచించారు. గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలకు కమిషన్ తీసుకున్నారని ఆరోపణలు వచ్చాయని మా ప్రభుత్వంలో అటువంటి వాటికి ప్రోత్స హించ నని అటువంటి వారిపై కఠినంగా వ్యవహరిస్తానని పత్రికా ముఖంగా మీ దృష్టికి వచ్చిన తన దృష్టికి తేవాలని కోరారు .అనవసరంగా ప్రభుత్వంపై ప్రతిపక్షం సోషల్ మీడియా వేదికగా ఆరోపణ చేయెద్దని సంక్షేమ పథకాల విషయంలో ఛాలెంజ్ చేస్తున్నాను అర్హులైన నిరుపేదలకే అందజేస్తున్నామని దీనిపై చర్చ కైనా సిద్ధమని అన్నారు.ప్రభుత్వం అందించే పథకాలకు అర్హత కలిగి పేదవాడికి ఎలాంటి లంచాలు లేకుండా అందుతాయని తెలిపారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ శిరీష, మండల అభివృద్ధి అధికారి జములారెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి ఆర్ శంకర్, ప్రభుత్వ ఆసుపత్రి సూపర్టెంట్ ముక్కంటేశ్వరరావు, మాజీ ఎంపీపీ కైపు రోశిరెడ్డి, మాజీ సొసైటీ ఛైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ భజన సతీష్ ,పీసీసీ కార్యవర్గ సభ్యులు తాళ్లూరి చక్రవర్తి, మాజీ ఉపసర్పంచులు శనగ సాయిప్రత్యూష, కైపు లక్ష్మీ నారాయణ రెడ్డి పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, బూర్గం పహాడ్ టౌన్ అధ్యక్షులు మందా నాగరాజు, నాయకులు బెల్లంకొండ వాసుదేవరావు, జీ.ప్రవీణ్ కుమార్, భజన ప్రసాద్, కైపు శ్రీనివాస్ రెడ్డి, ఇంగువ రమేష్, చల్ల వెంకట్నరాయణ, బెల్లంకొండ రామారావు, సుధాకర్ రెడ్డి, కోమటిరెడ్డి మోహన్రెడ్డి, బీసీ సంఘం మండల అధ్యక్షులు దాసరి సాంబ, చిప్పారాజు, సుధాకర్రెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ నిమ్మల హరీష్ యాదవ్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు, యువజన నాయకులు, నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ దునుకు రాము, మండల కో ఆర్డినేటర్ సింప్లీ సాయి , సంతోష్ తదితరులు పాల్గొన్నారు.




## దుమ్ముగూడెం ఎస్సై వెంకటప్పయ్యకు సీఐగా పదోన్నతి

**దుమ్ముగూడెం, ప్రభాతవార్త :**



దుమ్ముగూడెం పోలీసు స్టేషన్‌లో సబ్ ఇన్స్ పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న టీ.వెంకటప్పయ్యకు సీఐగా ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. 2014 ఎస్సై క్యాడర్‌కు చెందిన వెంకటప్పయ్య వరంగల్, ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లో వివిధ పోలీసు స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వర్తించారు. ఇదిలా ఉండగా దుమ్ముగూడెం పోలీసు స్టేషన్‌కు 2024 జూలై నెల నుంచి ఎస్సైగా విధులు నిర్వర్తిస్తుండగా తాజాగా ప్రభుత్వం వెంకటప్పయ్యకు సీఐగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పలువురు తోటి సిబ్బంది వెంకటప్పయ్యను అభినందించారు.

## రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

-సీఐ నాగరాజు

**భద్రాచలంటౌన్, ప్రభాతవార్త :**



రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని భద్రాచలం పట్టణ సీఐ నాగరాజు అన్నారు. శుక్రవారం పట్టణ పోలీసు స్టేషన్‌లో మండల వ్యవసాయధికారి సమక్షంలో ఫెర్టిలైజర్స్ వ్యాపారులతో సమావేశంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ... అమాయక గిరిజన రైతులే ధ్యేయంగా కొందరు ఫెర్టిలైజర్స్ వ్యాపారులు నకిలీ విత్తనాలను అమ్ముతుండడంతో సరైన దిగుబడి రాక రైతులు నష్టపోతున్నారని, అటువంటి ఫైర్టిలైజర్స్ వ్యాపారులపై జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ ఆదేశాల మేరకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. దుకాణదారులు లైసెన్స్‌లు లేకుండా దుకాణాలు నడిపినా, రికార్డులను సరైన పద్ధతిలో మెయింటైన్ చేయకపోయినా కఠిన చర్యలు తప్పవన్నారు. ఇన్వాయిస్ స్టాక్ రిజిష్టర్‌లను సక్రమంగా నిర్వహించాలని, ధరల పట్టిక తెలిసేలా షాపుల వద్ద అమర్చాలని అన్నారు.ముఖ్యంగా మిర్చి, పత్తి రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలని, వారికి విధిగా బిల్లు ఇవ్వాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నకిలీ విత్తనాలను అరికట్టడానికి వ్యవసాయ, పోలీసు శాఖల సంయుక్తంగా టాస్క్‌ఫోర్స్‌లను ఏర్పాటు చేసి ఉక్కుపాదంతో అణచి వేయాలని ఆదేశాలు జారీ చేసిందని, ఇందులో భాగంగా విత్తన షాపులను, గోడౌన్‌లను ఆకస్మికంగా తనిఖీ చేయడం జరుగుతుందని తెలిపారు. రైతులను మోసం చేయడానికి పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. రైతులు కూడా అనుమతులు ఉన్న డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు.

# మృతుని కుటుంబానికి ఆర్ధిక సాయం, ఒకరికి ఉద్యోగం

-భద్రాచలం ఎమ్మెల్యే డా.తెల్లం చొరవతో ప్రకటించిన ఐటీసీ యాజమాన్యం

**భద్రాచలంటౌన్/సారపాక, ప్రభాతవార్త :**



దుమ్మగూడెం మండలం పెద్ద కమలాపురం గ్రామానికి చెందిన వర్షిక హరీష్(24) తండ్రి చిట్టిబాబు( లేటు) సారపాక ఐటీసీ కర్మాగారంలో ఓ కాంట్రాక్టర్ వద్ద కార్మికుడిగా పనిచేస్తూ ప్రమాదవశాత్తు గురువారం మృతిచెందగా, మృతదేహంతో భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వద్ద కుటుంబ సభ్యులు నిరసన ధర్నా నిర్వహించడంతో ఘటనపై బాధిత కుటుంబానికి అండగా భద్రాచలం ఆదివాసి సమితి నాయకులు అడ్వకేట్ పాయం రవివర్మ, పూనెం కృష్ణ దొర, మానే రామకృష్ణ, ఐటిసి టిఎన్టియుసి నాయకులు కనకమేడల హరిప్రసాద్, రామకోటి రెడ్డి ఐఎన్టీయూసీ నాయకులు గోనె రామారావు, యారం పిచ్చిరెడ్డి, బాధిత కుటుంబానికి భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న భద్రాచలం ఎమ్మెల్యే డా.తెల్లం వెంకట్రావు ఏరియా ఆసుపత్రి వద్దకు చేరుకుని ఐటీసీ యాజమాన్యంతో చర్చించారు. బాధిత కుటుంబానికి అండగా నిలుస్తామని తెలియజేసి మృతిచెందిన కార్మికుని కుటుంబానికి ఐటీసీ సారపాక కర్మాగారం ద్వారా 14 లక్షల 50 వేలు నష్టపరిహారం చెల్లిస్తామని, కార్మికుని కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఐటీసీ నందు ఉద్యోగ అవకాశం కల్పిస్తామని, అదేవిధంగా మృతి చెందిన కార్మికుని తల్లికి ప్రతి నెల రూ.9వేలు పెన్షన్ ద్వారా ఇస్తామని తెలియజేశారు. పని చేయించుకుంటున్న కాంట్రాక్టర్ ద్వారా బాధిత కుటుంబానికి నాలుగు లక్షల రూపాయలు నష్టపరిహారంగా ప్రకటించడం జరిగింది.

## నిర్ధేశించిన లక్ష్యాలను చేరుకోవాలి

-డీపీవో చంద్రమౌళి

**దుమ్ముగూడెం, ప్రభాతవార్త :**


గ్రామపంచాయతీల పరిధిలో ఉన్న సిబ్బంది ఉన్నతాధికారులు నిర్ధేశించిన లక్ష్యాలను చేరుకోవాలని ప్రతి పంచాయతీలో ఇంకుడు గుంతలు నిర్మాణ పనులు రెండు రోజుల్లో పూర్తి చేయాలని భద్రాద్రికొత్తగూడెం జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి సిబ్బందిని ఆదేశించారు. దుమ్ముగూడెం మండలంలోని దుమ్ముగూడెం గ్రామపంచాయతీని శుక్రవారం ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టిన ఇంకుడు గుంత నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్షాకాలం రానున్న సమయంలో గ్రామాల్లో శానిటేషన్ పనులు ముమ్మరంగా చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఎంపీడీవో రామకృష్ణ, పలువురు గ్రామపంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ స్థంబాలకు అడ్డదిడ్డంగా కట్టిన వైర్లను సరిచేయాలి

-కేబుల్, ఇంటర్‌నెట్ కేబుల్ ఆపరేటర్స్ సమావేశంలో విద్యుత్ శాఖ ఎస్ఈ మహేందర్

**భద్రాచలంటౌన్, ప్రభాతవార్త :**





విద్యుత్ స్థంభాలకు కేబుల్, ఇంటర్‌నెట్ కేబుల్ ఆపరేటర్స్ అడ్డదిడ్డంగా వైర్లు కట్టడం వలన విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు విద్యుత్ శాఖ సిబ్బంది ఆ స్థంభాన్ని ఎక్కాలంటే పడరాని పాట్లు పడుతూ విద్యుత్ సరఫరా పునఃరుద్దరణకు ఆలస్యం అవుతుందని విద్యుత్ శాఖ ఎస్ఈ మహేందర్ అన్నారు. శుక్రవారం భద్రాచలం సబ్ డివిజనల్ ఇంజనీర్ కార్యాలయంలో డీఈ జీవన్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కేబుల్, ఇంటెర్‌నెట్ ఓనర్స్, ఆపరేటర్‌ల సమావేశంలో ఎస్ఈ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ... జూన్ మొదటి వారంలోపు విద్యుత్ శాఖ సిబ్బంది సమన్వయంతో స్థంబాలకు ఉన్న వైర్లను సరి చేసుకోవాలని, ఫోల్ చార్జెస్, కౌంట్‌లో లేని పోల్ అద్దెలను జాయింట్ ఇన్స్పెక్షన్ చేసి అకౌంట్ ఫర్ చేయాలని ఆదేశించారు. లేదంటే వారం రోజుల్లో తొలగిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏడీఈలు వేణు, ప్రభాకర్, ఏఈలు ఉపేందర్, రోహిణి, రాజారావు, ఏఈవో, జేఏవోలు తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలకు చదువుతో పాటు క్రీడలు కూడా అవసరమే...

## - సమ్మర్ కోచింగ్ క్యాంప్ ముగింపులో ఏజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్

**కొత్తగూడెం, మే 30 – ప్రభాతవార్త:**

సింగరేణి కార్పొరేట్ ఏరియా వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఆధ్వర్యంలో సింగరేణి ఉద్యోగుల పిల్లలకు, పరిసర ప్రాంత 18 సంవత్సరాలలోపు బాల బాలికలకు అథ్లెటిక్స్, బాస్కెట్ బాల్,బాక్సింగ్, ఫుట్ బాల్, వాలీబాల్, ఉషు/కరాటే, డ్రాయింగ్ మొదలగు వివిధ క్రీడా విభాగాలలో గత నెల 26వ తేదీ నుంచి నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణ శిబిరం ముగిసింది. ఈ కార్యక్రమానికి ఏజిఎం(పర్సనల్) వెల్ఫేర్ జి.రాజేంద్ర ప్రసాద్ ముఖ్య అతిధిగా పాల్గొని పిల్లలకు చదువుతో పాటు మానసిక ఉల్లాసానికి, సృజనాత్మకు, శారీరక ధృడత్వానికి క్రీడలు కూడా ఎంతో అవసరమని ఇందుకై సింగరేణి సంస్థ ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించి ప్రోత్సహిస్తుందని అన్నారు. ఇక్కడ నేర్చుకున్న ఈ క్రీడలను ఎప్పుడు ఆడుతూ చదువుతో పాటు క్రీడలలో కూడా రాణించాలని తెలిపారు. అనంతరం సమ్మర్ కోచింగ్ క్యాంప్ లో పాల్గొన్న పిల్లలకు సర్టిఫికెట్లతో పాటు స్పోర్ట్స్ ఏకరూప దుస్తులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏజిఎం(పర్సనల్) వెల్ఫేర్ జి.రాజేంద్ర ప్రసాద్, గుర్తింపు సంఘం (ఏఐటియూసి) బ్రాంచ్ సెక్రటరీ ఎస్.వి. రమణ మూర్తి, ప్రాతినిధ్య సంఘం (ఐఎన్‌టియూసి) బ్రాంచ్ సెక్రటరీ ఎస్.పితాంబర రావు, సీనియర్ పిఓ స్పోర్ట్స్ మేనేజర్ టి.శ్రీనివాస రావు, స్పోర్ట్స్ సూపర్ వైజర్ ఎంసి.పోస్ నెట్, శిక్షకులు, బాల బాలికలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.







# పీవీకే 5 గని సమస్యలపై వినతి పత్రం అందజేసిన ఐ ఎన్ టీ యు సి నాయకులు

**కొత్తగూడెం, మే 30 – ప్రభాతవార్త:**

పీవీకే 5 గని లో కార్మికులు ఎదురుకుంటున్న సమస్యలను తెలుసుకునేందుకు వైస్ ప్రెసిడెంట్ రజాక్ ఆధ్వర్యంలోఐ ఎన్ టీ యు సి పిట్ కమిటీ నాయకులు గనిలోకి దిగి కార్మికులను కలసి వారి సమస్యలను అడిగి తెలుకోవడం జరిగినది. కార్మికులు యూనియన్ నాయకులతో పలు సమస్యలను ప్రస్తావించడం జరిగినది. రెక్సిన్ క్యాప్సుల్స్ తో వేసే బోల్ట్స్ ను డ్రిల్లింగ్ మెషిన్ తో కాకుండా బోల్టర్ మెషిన్ తో వేయించాలని, ఒకవేళ డ్రిల్లింగ్ మెషిన్ తో వేయించి నట్లు ఐతే కార్మికులకు పనిభారాన్ని తగ్గించాలని, సీఎం డిస్ట్రిక్ట్ లో పని చేసే కార్మికులకు అందుబాటులో డ్రింకింగ్ వాటర్ పాయింట్‌ను ఏర్పాటు చేయాలని, మ్యాన్ రైడింగ్ కు సంబందించి వీల్స్ కు వాడే లైనర్స్ ను సరిపడ తెప్పించాలన్నారు. మ్యాన్ రైడింగ్ సిబ్బందికి ప్లే డే సౌకర్యం కల్పించాలని, 10డిప్ 112లెవెల్ లో వున్న స్విచ్ లపై వాటర్ పడకుండా తగిన ఏర్పాటు చేయాలని, తదితర డిమాండ్లపై గని మేనేజర్ శ్యామ్ ప్రసాద్ కు వినతి పత్రం ఇచ్చి ఆ సమస్యలపై చర్చించడం జరిగినది. దీనిపై మేనేజర్ వెంటనే స్పందించి వెంటనే పరిష్కారం చేస్తానని హామీ ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఎండీ రజాక్ వైస్ ప్రెసిడెంట్,సకినాల సమ్మయ్య, చిలక. రాజయ్య,వల్లాల సంబమూర్తి, కొమ్ము సాంబయ్య, బాలు, సంపత్, శ్రీనివాస్, కుమ్మరి రాజేష్, బాలాజీ, శంకర్, శేషగిరి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# పీసీ అండ్ పీఎన్‌డీటీ చట్టంపై జిల్లాస్థాయి సలహా కమిటీ సమావేశం

**కొత్తగూడెం, మే 30 – ప్రభాతవార్త:**

పీసీ అండ్ పీఎన్‌డీటీ చట్టంపై జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశం శుక్రవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో జరిగింది. గర్భధారణకు ముందు, ప్రసవానికి ముందు రోగనిర్ధారణ పద్ధతులు (పీసీ అండ్ పీఎన్‌డీటీ) చట్టంపై జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశంలో కొత్తగూడెం డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జయలక్ష్మి అవగాహన కల్పించారు. జిల్లా అంతటా ఈ చట్టాన్ని కఠినంగా అమలు చేయడం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. గర్భిణీ స్త్రీల అల్ట్రాసౌండ్ స్కానింగ్ సమయంలో అవసరమైన తప్పనిసరి డాక్యుమెంటేషన్‌ను ఆమె హైలైట్ చేసింది. ప్రత్యేకంగా, చట్టంలోని నిబంధనల ప్రకారం మహిళ యొక్క సంసిద్ధత, రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్ నుండి రిఫెరల్ మరియు ఆమె ఆధార్ కార్డ్ కాపీని ఫారం నీ తో జతచేయాలని ఆమె పేర్కొంది. చట్టవిరుద్ధమైన పద్ధతులను అరికట్టడానికి మరియు సమ్మతిని నిర్ధారించడానికి ఈ చట్టం యొక్క ఏవైనా ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకోవాలని కమిటీ ఏకగ్రీవంగా నిర్ణయించింది. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు డాక్టర్ అనుష, డాక్టర్ కోరాశ్రీ యాదవ్, ఎండీ అస్గర్ హుస్సేన్, ఎం. సునీత, రాజమణి (ప్రోగ్రామ్ ఆఫీసర్), డాక్టర్ స్పందన, మరియు మహ్మద్ ఫైజ్మోహియుద్దీన్ (డిప్యూటీ డెమో) పాల్గొన్నారు.




# వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా జిల్లా కన్వీనర్ గా లక్ష్మణ్

## - జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా కోకన్వీనర్ గా కొట్టి నవీన్ నియామకం




**కొత్తగూడెం టౌన్, మే 30 – ప్రభాతవార్త:**

వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా (డబ్ల్యుజెఐ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అడహక్ కమిటీ కన్వీనర్ గా లక్ష్మణ్‌ను, యూనియన్ రాష్ట్ర కార్యదర్శి నారా సుబ్రమణ్యేశ్వరరావు (ఎన్ఎస్.రావు) శుక్రవారం నియమించారు. స్థానిక కొత్తగూడెం క్లబ్లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విలువలతో కూడిన పాత్రికేయులకు పెద్దపీట వేస్తూ వారి సంక్షేమానికి కృషి చేసేందుకు ఈ సంఘం ఉద్భవించిందని వివరించారు. సంఖ్యాబలం పెంచుకోవడం కోసం విలేకరులుగా మారుస్తూ వారిని బలిపశువుగా మారుస్తున్న స్వార్థపూరిత యూనియన్లకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. డబ్ల్యుజెఐ యూనియన్ జాతీయస్థాయిలో ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో పాత్రికేయుల ఆదరణ పొందిందని, యూనియన్ లో చేరేందుకు పెద్ద సంఖ్యలో జర్నలిస్ట్ మిత్రులు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని వివరించారు. అర్హత కలిగిన ప్రతీ ఒక్క జర్నలిస్ట్ కి అక్రిడేషన్ కార్డు, హెల్త్ కార్డు ఇప్పించడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి హక్కుగా రావాల్సిన అన్ని పథకాలు అందేలా పోరాటాలు చేస్తున్నామన్నారు. అదే విధంగా ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అడహక్ కో కన్వీనర్ గా రాజ్ న్యూస్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ కొట్టి నవీన్ ను కూడా ప్రకటించారు. సమావేశం అనంతరం విలేకరులందరూ కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు..నూతనగా ఎన్నికైన కమిటీ ని రాష్ట్ర ఉపాధ్యకుడు అనిల్ దేశాయ్, తాడూరి కరుణాకర్ లు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు అయోధ్య రాములు తో పాటు పెద్దసంఖ్యలో పాత్రికేయులు పాల్గొన్నారు.




**చుంచుపల్లి, జూలూరుపాడు, సుజాతనగర్**

# పెన్షన్ పొందే మాజీ కార్మికులు లైవ్ సర్టిఫికెట్లు అందజేయాలి

## - జీఎం పర్సనల్ కిరణ్‌కుమార్

**కొత్తగూడెం, మే 30 – ప్రభాతవార్త:**



సిఎంపిఎఫ్ పెన్షన్ పొందే సింగరేణి మాజీ ఉద్యోగులందరూ ప్రతీ సంవత్సరం నవంబర్ నెలలో జీవన్ ప్రమాన్( లైవ్ సర్టిఫికెట్) సిఎంపిఎఫ్ వారికి అందజేయవలసి ఉంటుందని జీఎం పర్సనల్ కిరణ్‌కుమార్ తెలిపారు. లేనిచో మాజీ ఉద్యోగుల సిఎంపిఎఫ్ పెన్షన్ జనవరి నెల నుండి నిలిపి వేయబడుతుందని, ఇది ప్రతీ సంవత్సరం జరిగే విధానమన్నారు. ఇటీవల సిఎంపిఎఫ్ వారు పెన్షన్ పంపిణీ భాద్యతని ఎస్‌బీఐ ధన్బాద్ శాఖకు అప్పగించారని, దేశ వ్యాప్తముగా సిఎంపిఎఫ్ పెన్షనర్స్ అందరికీ పెన్షన్ పంపిణీ చేసే భాద్యతను 2023 సంవత్సరం నుండి ఎస్‌బీఐ ధన్బాద్ వారు చేపట్టారన్నారు. ఇటీవల చాలా మంది సింగరేణి మాజీ ఉద్యోగులు జీవన్ ప్రమాన్( లైవ్ సర్టిఫికెట్) అందజేయక పోవటం వలన కానీ లేదా సరిగా అందజేయక పోవటం వలన వారి నెలవారి పెన్షన్ లు ఆగిపోయాయన్నారు. కావున ఎవరైతే జీవన్ ప్రమాన్( లైవ్ సర్టిఫికెట్) అందచేయని వారు వెంటనే వారి జీవన్ ప్రమాన్(లైవ్ సర్టిఫికెట్)ను దగ్గరలోని మీసేవా సెంటర్ లో ఆన్లైన్ ద్వారా అందజేసి, అదే జీవన్ ప్రమాన్ ప్రతిని దగ్గరలోని ఎస్‌బిఐ బ్యాంక్ లోగానీ లేదా జీవన్ ప్రమాణ్ కాపీ వారి బ్యాంక్ ఖాతా (మొదటి పేజీ)ని మెయిల్ ద్వారా పంపగలరన్నారు.

# పదవీ విరమణ సన్మానం...

**కొత్తగూడెం, మే 30 – ప్రభాతవార్త:**



కొత్తగూడెం ఏరియా జిఎం కార్యలయంలో కాన్ఫరెన్స్ హాల్ శుక్రవారం జిఎం కార్యలయంలో ఫైనాన్స్ డిపార్ట్మెంట్‌లో జనరల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించి పదవి విరమణ పొందిన వి. రాజేందర్ దంపతులను ఏరియా జిఎం ఎం. షాలేం రాజు పుష్పగుచ్ఛాన్నిచ్చి శాలువా మరియు జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం ఏరియా జిఎం మాట్లాడుతూ... వి. రాజేందర్ కంపెనీ లో దాదాపు 32 సంవత్సరాల సుధీర్గ సర్వీసు పూర్తి చేసుకొని మంచి నడవడికతో, అంకిత భావంతో పని చేసి తేదీ 31.05.2025 పదవీ విరమణ పొందుచున్నారని వారి శేష జీవితం సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా జిఎంతో పాటు ఎస్ఓటు జిఎం జి.వి. కోటి రెడ్డి, ఏజిఎం (ఫైనాన్స్) కే. హన సుమలత, డిజిఎం (పర్సనల్) బి. శివ కేశవరావు, డిజిఎం (ఐఈడి) ఎన్. యోహాన్, జిఎం ఆఫీసు ఏఐటియూసి ఫిట్ సెక్రెటరీ కే. సౌజన్య, ఐఎన్‌టియూసి ఫిట్ సెక్రెటరీ సిహెచ్. సాగర్, ఇంచార్జీ పర్చేస్ బి. మాధవ్, ఇంచార్జి క్వాలిటి మాదన్ మోహన్, ఐటి మేనేజర్ కే. శేష శ్రీ, సీనియర్ పిఓ మజ్జి మురళీ, ఏరియా ఎస్టేట్ ఆఫీసర్ బి. తౌర్య, అధికారులు సుబ్రహ్మణ్యం, సిహెచ్.మోనిక, శ్రీనివాస్ మరియు జిఎం కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# జూన్ 2న రాజీవ్ యువ వికాసం రుణాలు చెక్కులు అందజేయనున్న ఎమ్మెల్యే జారే

**- మొదట విడతగా ఉమ్మడి మండలంలో 156 మంది లబ్ధిదారులను ఎంపిక చేసిన అధికారులు**



**చంద్రుగొండ/అన్నపురెడ్డిపల్లి ప్రభాతవార్త :**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా రుణాల చెక్కులు అందజేసే అందుకు రాష్ట్ర ప్రభుత్వం జూన్ రెండవ తారీఖున ప్రారంభించుతున్నట్లు స్థానిక ఎంపీడీవో బి అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు . చంద్రుగొండ మండలంలో మొత్తం 1865 మంది రాజీవ్ యువ వికాసం ద్వారా రుణాలు పొందే అందుకు దరఖాస్తులు చేసుకొనగా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 351 మంది . ఎస్టీ కార్పొరేషన్ ద్వారా 529 తో పాటు 26 తెగల వివిధ కులాల కార్పొరేషన్ ద్వారా మొత్తం 1865 మంది లో మొదట విడతగా 50 వేల నుండి లక్ష రూపాయల లోపు రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల లో అర్హులుగా.... 50,000 రూపాయల రుణాలు 22 మందికి అదే విధంగా లక్ష రూపాయలు రుణాలు 42 మందికి, అదేవిధంగా అన్నపురెడ్డిపల్లి మండలం లో మొత్తం 1315 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకొనగా అందులో 20 మందికి 50 వేల రూపాయలు లక్ష రూపాయలు 72 మందికి లబ్ధిదారులను అధికారులు ఎంపిక చేసి వారికి జూన్ 2న అశ్వరావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ చేతుల మీదుగా రుణాలు అందజేయనున్నట్లు తెలిపారు . మిగిలిన రుణాలను రాష్ట్ర ప్రభుత్వం విడతలవారీగా రుణాలు ప్రకటించిన విధంగా జూన్ నెలలో 50000 నుండి లక్ష రూపాయలు, జులై లో లక్ష రూపాయల నుండి రెండు లక్షలు. ఆగస్టు నెలలో రెండు లక్షల నుండి నాలుగు లక్షలు రుణాలు అందజేసి సెప్టెంబర్ నెలలో రుణాల ప్రక్రియ ముగియనున్నట్లు అధికారులు తెలిపారు

# అంగరంగ వైభవంగా రాష్ట్ర అవతరణ వేడుకలు

**- ముఖ్య అతిథిగా పాల్గొననున్న సీఎండీ**

**- సినీ, టీవీ కళాకారులతో ప్రత్యేక కార్యక్రమాలు**




**కొత్తగూడెం, మే 30 - ప్రభాతవార్త:**

సింగరేణి కాలరీస్ కార్పొరేట్ ఏరియా ఆధ్వర్యంలో కొత్తగూడెం ప్రకాశం స్టేడియం గ్రౌండ్ లో జూన్ 2 వ తేదీన అత్యంత ఘనంగా జరిగే 11వ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల వివరాలు, సంబురాలలో పాల్గొనే ప్రముఖ సినీ, టీవీ కళాకారుల ప్రదర్శనల గురించి తెలిపే గోడపత్రికను శుక్రవారము డైరెక్టర్ (పా) అండ్ (పి పి) కే.వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భముగా డైరెక్టర్ డైరెక్టర్ (పా) అండ్ (పి పి) కే.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... 136 సంవత్సరాల ఘన చరిత్ర గల సింగరేణి సంస్థ జూన్ 2 వ తేదీన 11వ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అత్యంత ప్రతిష్టాత్మకముగా కోల్ బెల్ట్ లోని అన్ని ఏరియాలలో నిర్వస్తున్నామని అందులో భాగముగా కార్పొరేట్ ఏరియా ఆధ్వర్యం లో కొత్తగూడెం ప్రకాశం స్టేడియం నందు వైభవముగానిర్వహించటానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. ఈ వేడుకలకు సింగరేణి సంస్థ సి ఎండి ఎన్.బలరామ్ముఖ్య అతిథిగా పాల్గొంటారని, ఈ వేడుకలలో ముందుగా ఉదయం 8.00 గంటలకు సింగరేణి ప్రధాన కార్యాలయము నందు జాతీయ జెండా ఆవిష్కరించటం జరుగుతుంది అని, అనంతరం తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేస్తారనార్వరు. అనంతరం ప్రకాశం స్టేడియం నుండి కొత్తగూడెం బస్ స్టాండ్ సెంటర్ వద్ద గల తెలంగాణ అమరవీరుల స్థూపం వరకు తెలంగాణ రన్ నిర్వహించి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం లో అమరులైన తెలంగాణ వీరులకు నివాళులు అర్పించటం జరుగుతుంది అన్నారు. ఉదయం 9.15 గంటలకు ప్రకాశం స్టేడియంలో సీఎండీ బలరాం పతాక ఆవిష్కరణ చేయడం జరుగుతుందని, తదుపరి ఎస్ పిసి, స్కౌట్స్ అండ్ గైడ్స్ సమర్పించే గౌరవ వందనం స్వీకరించి వారి అమూల్యమైన సందేశం ఇస్తారన్నారు. అనంతరం సాంస్క ృతిక కార్యక్రమాలు ఉంటాయని అన్నారు. సాయంత్రం 6 గంటలకు ప్రకాశమ్ స్టేడియం నుండి కొత్తగూడెం బస్ స్టాండ్ సెంటర్ వద్ద గల తెలంగాణ అమరవీరుల స్థూపం వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం లో అమరులైన తెలంగాణ వీరులకు నివాళులు అర్పించటం జరుగుతుంది అన్నారు. అదే విధముగా సాయంత్రం 7 గంటల నుండి ప్రకాశం స్టేడియం నందు సాంస్క ృతిక కార్యక్రమాలు ఉంటాయని, ఈ కార్యక్రమంలో ప్రముఖ శాస్త్రీయ నృత్యకళాకారిణి సీతాప్రసాద్ బృందంచే క్లాసికల్ డాన్స్, ప్రముఖ సినీ గాయనీ గాయకులు అనుదీప్, మమన్ , సాహితి చాగంటి టీంచే గొప్ప సినీ మ్యూజికల్ నైట్, ఈటీవీ జబర్దస్త్ ఫేమ్ కెవ్వు కార్తీక్ నెల్లూరు బ్రదర్స్ హరిబాబు టీమ్ చే అద్భుతమైన కామెడీ, ప్రముఖ మిమిక్రీ ఆర్టిస్ట్ రాజు మిమిక్రీ ప్రదర్శన, ఈటివి డీ టీం డాన్స్ గోవిందా బృందం చే డాన్స్ ప్రదర్శన, ఫుట్ బాల్ ప్రదీప్ చెన్నై గారిచే ప్రత్యేక ప్రదర్శన ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమాలలో ప్రముఖ యాంకర్ స్వరూప పాల్గొంటారని. ఈ కార్యక్రమాన్ని సింగరేణీయులు కొత్తగూడెం పట్టణ మరియు పరిసరప్రాంత ప్రజలు తిలకించి విజయవంతం చేయగలరని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జీఎం(పర్సనల్) ఐఆర్ పిఎం కవిత నాయుడు, జీఎం(పర్సనల్) వెల్ఫేర్ సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్, ఏజిఎం(పర్సనల్) జి.రాజేంద్ర ప్రసాద్, డిజిఎం(పర్సనల్) ముకుంద సత్యనారాయణ, డివై.పిఎం జికే.కిరణ్ కుమార్, సీనియర్ పిఓ టి.శ్రీనివాస రావు, మేనేజ్మెంట్ ట్రైనీ(పర్సనల్) కే.ఉదయ్ కుమార్, వెల్ఫేర్ పిఓ కె.వరప్రసాద రావు, స్పోర్ట్స్ సూపర్ వైజర్లు ఎంపి.పోస్ నెట్,సేవా కో ఆర్డినేటర్ ఇజాజ్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ కారుణ్య గుణాన్ని పెంపొందించుకోవాలి

**- ఉమ్మడి జిల్లా ఆర్ సీఎం బిషప్ డాక్టర్ సగిలి ప్రకాష్**



**ఖమ్మం కల్చరల్ మే30 ప్రభాతవార్త:**

ప్రతి ఒక్కరూ కారుణ్య గుణాన్ని పెంపొందించుకోవాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆర్ సీఎం బిషప్ డాక్టర్ సగిలి ప్రకాష్ తెలియజేశారు. పాలేరు అద్భుతాల మేరీ మాత పుణ్యక్షేత్రంలో శుక్రవారం పాలేరు విచారణ గురువు ఫాదర్ కొమ్ము ఆంటోనీ పర్యవేక్షణలో జరిగిన పుణ్యక్షేత్రం ప్రథమ వార్షికోత్సవ సంబురాల్లో బిషప్ డాక్టర్ సగిలి ప్రకాష్ దైవ సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా బిషప్ డాక్టర్ సగిలి ప్రకాష్ మాట్లాడుతూ దేవమాత మేరీమాత గర్భఫలం ద్వారా ఉదయించిన కరుణామయుడైన ఏసుప్రభువు బోధనలు సమాజంలోని ప్రతి ఒక్కరికి మార్గదర్శకంగా నిలిచి జీవితాలను ఉత్తమ మార్గంలో ప్రభావితం చేశాయి అన్నారు. దేవ మాత మేరీ మాత దీవెనలు ప్రతి ఒక్కరి జీవితంలో అద్భుత మార్పులను అందించడం ద్వారా పాలేరు పుణ్యక్షేత్రం పునీతమైనదని తెలిపారు. కరుణామయుడు అందించిన శాంతి ,సమాధానం, కరుణ, ఆప్యాయతలను ప్రతి ఒక్కరూ తమ హృదయాలలో పదిల పరుచుకొని ఇతరుల పట్ల, తోటి జీవుల పట్ల ఆప్యాయత అనురాగాలతో మెలగాలని కోరారు. పాలేరు పుణ్యక్షేత్రంలో 76 అడుగుల అద్భుతాల మేరీ మాత స్వరూపాన్ని ఆవిష్కరించడం ద్వారా ఆసియా ఖండంలోనే పాలేరు ఖ్యాతి ఇనుమడించిందని తెలిపారు.గత సంవత్సర కాలంలో పాలేరు పుణ్యక్షేత్రంలో ఎన్నెన్నో అద్భుత కార్యాలు భక్తులకు సాక్ష్యంగా నిలిచాయన్నారు. పాలేరు విచారణ గురువు ఫాదర్ కొమ్ము ఆంటోనీ మాట్లాడుతూ పాలేరు పుణ్యక్షేత్రంలో భక్తులు అనుకున్న కోరికలు వెంటనే సఫలీకృతం అవుతున్నాయని, ఈ పుణ్యక్షేత్రంలో జరిగిన అద్భుతాలు భక్తుల జీవితాల్లో భాగ్యాలను ఉత్తమ మార్పులను అందించాయని పేర్కొన్నారు. తొలుత స్థానిక చెక్పోస్ట్ నుంచి కోదాడ బృందాలు, మేళతాళాల బృందాలు నిర్వహించిన ప్రదర్శన నేతృత్వంగా పుణ్యక్షేత్రం వరకు కొనసాగింది. విశ్వాసులు మేరీ మాత స్వరూపం వద్ద 3000 మంది కొవ్వొత్తులతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వార్షికోత్సవ సంబురాల్లో ఖమ్మం జిల్లా , భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కృష్ణాజిల్లా , పశ్చిమగోదావరి జిల్లా, వరంగల్ జిల్లాల నుండి దాదాపు పదివేల మంది విశ్వాసులు పాల్గొన్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన మత గురువులు, మఠకన్యలు, బ్రదర్స్, సిస్టర్స్ ఈ వేడుకల్లో భాగస్వాములయ్యారు. ఉదయం జరిగిన ప్రత్యేక ప్రార్థనలను ఫాదర్ కొమ్ము ఆంటోనీ , ఫాదర్ ఫ్రాన్సిస్, ఫాదర్ కొమ్ము నవీన్, నిర్వహించారు. ఫాదర్ బి. జయరాజు, కొమ్ము ప్రసాద్ ఆధ్వర్యంలో గాయక బృందం ఆలపించిన ఆధ్యాత్మిక గీతాలు అందరినీ హుషారెత్తించాయి. గుమ్మడి జీవన్ కుమార్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన లాజరు ధనవంతుడు నాటక ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. అద్భుతాల మేరీ మాత పుణ్యక్షేత్రం వార్షికోత్సవ సంబురాలను పాలేరు విచారణ గురువు ఫాదర్ కొమ్ము ఆంటోనీ పర్యవేక్షించారు.




# జిల్లా స్థాయి ఉపాధ్యాయ శిక్షణ,...

**- పాత పాల్వంచ లో జీవశాస్త్ర వృత్యంతర శిక్షణ...**

**పాల్వంచ టౌన్, మే 30 - ప్రభాతవార్త:**



ప్రయోగ పూర్వక బోధనకై మెలుకువల కోసం జిల్లా స్థాయి ఉపాధ్యాయ శిక్షణ తరగతులను శుక్రవారం పాత పాల్వంచలో జీవశాస్త్ర వృత్యంతర శిక్షణను నిర్వహించారు. ప్రయోగ పూర్వక బోధనకై మెలుకువల కోసం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా స్థాయి ఉపాధ్యాయ వృత్యంతర శిక్షణ రెండు దఫాలుగా 20నుండి 24ఫస్ట్ స్పెల్, 26నుండి 30తేదీ కు రెండో స్పెల్గా అన్నీ స్థాయిలో ఉన్నా ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు, అందులో భాగంగా పాత పాల్వంచ పాఠశాలకేంద్రంలో జీవశాస్త్ర ఉపాధ్యాయులు, పిల్లలకు ఆధునిక పద్ధతిలో ఎలా భోదించాలి,తరగతి గది ఆహ్లాదంగా ఎలా ఉంచుకోవాలి, ప్రయోగాలు, రికార్డ్ నిర్వహణ, చైల్డ్ సెంటర్ విద్య, ప్రస్తుత సమాజం లో వస్తున్నా మార్పులు, పిల్లల రక్షణ చట్టాలపై అవగాహనా కల్పించారు.

**- ప్రయోగాలతో బోధన.....**

కేపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్ ఫర్ బయాలజికల్ టీచర్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ లో భాగంగా పాత పాల్వంచ ట్రైనింగ్ సెంటర్ లో జిల్లా స్థాయి లో ములకలపల్లి, పాల్వంచ, కొత్తగూడెం, టేకులపల్లి, ఇల్లందు, పినపాక, జూలూరుపాడు, కరకగూడెం, మణుగూరు, లక్ష్మీ దేవిపల్లి, సుజాత నగర్ తదితర మండలాల జీవ శాస్త్ర ఉపాధ్యాయులకు డిజిటల్ తరగతి నిర్వహణ, ఆధునిక బోధన పద్ధతులు, ఐసీటీ టూల్ వినియోగించు విధానం, అలాగే గుండె,శ్వాస అవయవాలు, కణ విభజన తదితర అంశాలు కోర్స్ఆఫీ కలం పరమయ్య, జయబాబు,కమలాకర్, కోర్స్ డైరెక్టర్ పద్మాలత, ఉపాధ్యాయులు రత్న రాజు, ప్రభాకర్, రమేష్ రాథోడ్. దీప. మాధవి. ఇందిరా, శంకర్ అజ్మీరా తదితరులు పాల్గొన్నారు.



# నేడు రైతులకు శాస్త్ర వేత్తలతో అవగాహన సదస్సు



**ములకలపల్లి మే 30 ప్రభాతవార్త :**

నేడు ములకలపల్లి రైతు వేదికలో వ్యవసాయ సాగు పద్దతుల పై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు వానకాల సాగుకు రైతులను సమాయత్తం చేసేందుకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అవగాహన సదస్సు నిర్వహించడం జరుగుతుందని వ్యవసాయ అధికారి అరుణ్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ఎదురుకుంటున్న సవాళ్లను అధిగమించేందుకు అవసరమైన సలహాలు సూచనలు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.కావున రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని తెలిపారు.

# అశాస్త్రీయ సర్దుబాటు ఉత్తర్వులను సవరించాలి

## - ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేసే విధంగా సర్దుబాటు ఉత్తర్వులు : టియస్ యుటిఎఫ్

**బోనకల్, ప్రభాతవార్త:**



ప్రభుత్వం రాబోయే విద్యా సంవత్సరానికి ఉపాధ్యాయులను సర్దుబాటు చేయుటకు విడుదల చేసిన ఉత్తర్వులు అశాస్త్రీయంగా ఉన్నాయని వీటిని ఉపసంహరించి సవరణ ఉత్తర్వులు జారీ చేసి సర్దుబాటు ప్రక్రియ చేపట్టాలని టిఎస్ యుటిఎఫ్ ఖమ్మం జిల్లా కార్యదర్శి గుగులోత్ రామకృష్ణ, జిల్లా నాయకులు సద్దాబాబుడిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలలను ఈ సర్దుబాటు ప్రక్రియ తీవ్రంగా దెబ్బతీస్తుందని, టీచర్లు లేక పిల్లల్లో విద్యా ప్రమాణాలు పడిపోతాయని తెలిపారు. 11 మంది విద్యార్థులకు ఇద్దరు టీచర్లు 60 మందికి కూడా ఇద్దరు టీచర్లతోనే బోధన ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. వర్కుబుక్స్ ఉన్న నేపథ్యంలో 15 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు తప్పనిసరిగా ఉండాలని వారు తెలియజేశారు. రేషనలైజేషన్ నిబంధనల జీవో 25ను సవరించాలని కోరారు. నమోదు పెంచి, విద్యాప్రమాణాలు పెంచాలని ఒకవైపు శిక్షణలు ఇస్తున్న ప్రభుత్వం, ఇలాంటి అశాస్త్రీయ సర్దుబాటు ఉత్తర్వులు ఇచ్చి విద్యారంగాన్ని ఏం చేయదలచుకున్నదని ప్రశ్నించారు. సంఘాలతో చర్చించి ఆమోదయోగ్యమైన సర్దుబాటు ఉత్తర్వులు వెలువరించాలని కోరారు. ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తిని సవరించాలని, 50 మంది విద్యార్థులు ఉన్న చోట తరగతికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయించాలని, నర్సరీ,కేజీ తరగతులు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు అదేవిధంగా బడిబాట పూర్తి అయిన తదుపరి విద్యార్థులు నమోదు పరిగణలోకి తీసుకోవాలని అన్నారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు ప్రాథమిక పాఠశాలకు ప్రధానోపాధ్యాయులు పోస్టును కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ మండల అధ్యక్షులు చిన్న రంగారావు మండల ఉపాధ్యక్షులు పి గోపాలరావు ఉపాధ్యక్షురాలు బి. సౌభాగ్య లక్ష్మి,పి. నరసింహారావు, కోశాధికారి జల్లా కోటయ్య, కే సురేష్, ఎన్ వెంకటేశ్వర్లు, ఉయ్యాల రామారావు, కె. నిర్మల అల్వాల నాగేందర్, నరేంద్ర సింహ, యు గంగాభవాని, తదితరులు ఉన్నారు.

# విత్తన దుకాణాలను తనిఖీ చేసిన మధిర ఏడిఏ, టాస్క్ ఫోర్స్ బృందం

**బోనకల్, ప్రభాతవార్త :**



టాస్క్ ఫోర్స్ అధికారులతో కలిసి తనిఖీలో మధిర ఏడీఏ స్వర్ణ విజయ చంద్ర , మండల వ్యవసాయ అధికారి పసునూరి వినయ్ కుమార్. బోనకల్ శీ. పొదిలి వెంకన్న. శుక్రవారం విత్తన దుకాణదారుల లైసెన్సులు మరియు విత్తనాల స్టాకును, స్టాక్ రిజిస్టర్ ను పరిశీలించారు.బిల్స్, ఇన్వాయిస్, సోర్స్ సర్టిఫికెట్, గాట్ అండ్ ఫారంసి లను పరిశీలించారు. ఎవరైనా నకిలీ విత్తనాలను అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటానని హేచ్చరించారు. నకిలీ విత్తనాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. వర్షాకాలం సమీపిస్తున తరుణంలో రైతులు నాణ్యమైన విత్తనాల ఎంపిక లో జాగ్రత్త వహించాలి. వ్యవసాయ శాఖ ద్వారా అనుమతి పొందిన అధికారిక డీలర్ల వద్ద నుంచి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి. కొనుగోలు సమయంలో బిల్లును తప్పనిసరిగా తీసుకోండి, బిల్లుపై డీలర్ మరియు రైతు సంతకాలు ఉండాలి. బిల్లును పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపరచుకోండి, అవసరం అయినప్పుడు ఇది ఆధారంగా ఉపయోగపడుతుంది. స్థానిక పరిస్థితులకు అనుకూలమైన, మంచి దిగుబడి ఇచ్చే, మార్కెట్లో పేరు పొందిన కంపెనీల విత్తనాలను మాత్రమే ఎంచుకోండి. లైసెన్స్ లేని వ్యాపారుల వద్ద నుంచి కొనుగోలు చేయవద్దు, గ్రామాల్లో తిరుగుతూ విత్తనాలు విక్రయించే, బిల్లులు ఇవ్వని వ్యాపారులను చూసిన వెంటనే వ్యవసాయ అధికారులకు సమాచారం ఇవ్వండి. గడ్డి మందు తట్టుకునే రకాలు అంటూ బీ.టీ.III విత్తనాలు అమ్ముతున్న వారిని గుర్తించినప్పుడు వెంటనే సమాచారం ఇవ్వండి. ఇవి భారత ప్రభుత్వం నుంచి అనుమతి లేని విత్తనాలు తయారీ, విక్రయమే కాకుండా కొనుగోలు చేసిన రైతు కూడా చట్ట పరంగా బాధ్యత వహించాల్సివుంటుంది. ఎవరైనా డబ్బు అడ్వాన్సుగా తీసుకుంటూ విత్తనాలు విక్రయిస్తే వ్యవసాయ శాఖ అధికారులకు తెలియపరచవలసిందిగా కోరారు.

# నకిలీ విత్తనాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి

## - విత్తన విక్రయ దుకాణాలను తనిఖీ చేసిన టాస్కోఫర్స్ అధికారులు

**మధిర మే 30 ప్రభాతవార్త :**



నకిలీ విత్తనాల పట్ల రైతులు పూర్తి అప్రమత్తంగా ఉండాలని ఇటువంటి విత్తనాల విక్రయము కు సంబంధించిన సమాచారం తెలిస్తే తప్పనిసరిగా సమాచారం అందించాలని మండల టాస్క్ ఫోర్స్ అధికారులు రైతులను కోరారు. శుక్రవారం మధిర పట్టణంలో, మండల పరిధిలో విత్తన విక్రయ దుకాణాలను మధిర పట్టణ సీఐ దోమల రమేష్, రూరల్ ఎస్సై లక్ష్మీ భార్గవి, వ్యవసాయ అధికారి సాయి దీక్షిత్ తనిఖీలు నిర్వహించారు. విత్తన దుకానుదారుల లైసెన్సులు, విత్తనాల స్టాకును పరిశీలించారు. వర్షాకాలం సమీపిస్తున తరుణంలో రైతులు నాణ్యమైన విత్తనాల ఎంపిక లో జాగ్రత్త వహించాలనీ అన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా అనుమతి పొందిన అధికారిక డీలర్ల వద్ద నుంచి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు.స్థానిక పరిస్థితులకు అనుకూలమైన, మంచి దిగుబడి ఇచ్చే, మార్కెట్లో పేరు పొందిన కంపెనీల విత్తనాలను మాత్రమే ఎంచుకోవాలనీ సూచించారు. నకిలీ విత్తనాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కొనుగోలు సమయంలో బిల్లును తప్పనిసరిగా తీసుకోవాలని, బిల్లుపై డీలర్ రైతు సంతకాలు ఉండాలని, ఈబిల్లును పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపరచుకోవాలని సూచించారు. పంట నష్టం జరిగిన సందర్భంలో ఈ బిల్లులు ఆధారంగా ఉపయోగపడరాయన్నారు. లైసెన్స్ లేని వ్యాపారుల వద్ద నుంచి కొనుగోలు చేయవద్దని, గ్రామాల్లో తిరుగుతూ విత్తనాలు విక్రయించే, బిల్లులు ఇవ్వని వ్యాపారులను చూసిన వెంటనే వ్యవసాయ అధికారులకు పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు కోరారు.

# పశుగ్రాసం కొరత లేకుండా చూసుకోండి

## - ఇందిరా డైరీ లబ్ధిదారులతో అధికారులు

**మధిర మే 30 ప్రభాతవార్త :**



పశువుల ఎంపిక పశుగ్రాసం కొరత లేకుండా చూసుకోవడం తో పాటు అధిక పాల ఉత్పత్తికి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా లక్ష్యం మేరకు పాల ఉత్పత్తిని సాధించవచ్చునని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా.బి. శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మధిర మండల పరిధిలోని సిరిపురం, వంగవీడు గ్రామాలలో ఇందిరా డైరీ లబ్ధిదారులతో సమావేశమయ్యారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుగ్రాసల ఆవశ్యకత, గేదెల ఎంపిక, అధిక పాల ఉత్పత్తికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు పశుగ్రాసాల కొరత లేకుండా పెంపకం చేపట్టినట్లయితే ప్రభుత్వ పాల కేంద్రాలకు పాలు పంపిణీ చేయ వచ్చునని అన్నారు. లబ్ధిదారులు ఈ సందర్భంగా అడిగిన పలు సందేహాలను నివృత్తి చేసి తగు సూచనలు చేశారు. మండల పశు వైద్యాధికారి డా.ఉమా కుమారి, గ్రామ దీపికలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.




# భద్రమ్మ సేవలు మరువలేనివి

## - సాయుధ పోరాటంలో భాగస్వామ్యంతో ఉద్యమించారు

## - సిపిఐ మండల కార్యదర్శి యంగల

**బోనకల్, ప్రభాతవార్త :**



తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో భాగస్వామ్యంతో తమ్మారపు భద్రమ్మ ఉద్యమించారని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గోవిందాపురం ఎల్ గ్రామంలో సిపిఐ సీనియర్ నాయకుడు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు తమ్మారపు భద్రయ్య సతీమణి తమ్మారపు భద్రమ్మ ఏడో వర్ధంతినీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె స్థూపానికి మండల కార్యదర్శి యంగల ఆనందరావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నైజాం నవాబు ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారత కమ్యూనిస్టు పార్టీ పిలుపుతో సాయుధ పోరాట యోధులైన కుటుంబ సభ్యులకు ఎంతో సహకరించారన్నారు. కుటుంబ సభ్యులు అడుగుజాడల్లో నడుస్తూ కమ్యూనిస్టు పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేశారన్నారు. నెహ్రూ సైన్యాలు కమ్యూనిస్టులు నిషేధం చేయడంతో రహస్యంగా భర్తను ఉంచి ధైర్య సాహసాలతో కుటుంబాన్ని పోషించి ఉద్యమానికి మరింతగా సహకరించారన్నారు. ఈ కార్యక్రమంలో ఏ ఐ కె ఎస్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి జక్కుల రామారావు, కుటుంబ సభ్యులు తమ్మారపు వేంకటేశ్వర్లు, తమ్మారపు బ్రహ్మాం, జక్కుల బిక్షాలు, తమ్మారపు భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

## - ఏవో వాణి, ఎస్సై నాగరాజు

**కూసుమంచి, మే 30 (ప్రభాతవార్త) :**



నకిలీ విత్తనాలు విక్రయించే షాపు యజమానులపై, సరఫరా చేసే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని కూసుమంచి మండల వ్యవసాయాధికారిణి రామడుగు వాణి, ఎస్సై నాగరాజు అన్నారు. శుక్రవారం కూసుమంచి మండలకేంద్రంలోని విత్తనాల షాపులను టాస్క్ ఫోర్స్ ఆధ్వర్యంలో అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీలర్లు విత్తన చట్టానికి లోబడి వ్యాపారం చేయాలని, నిషేధిత విత్తనాలను విక్రయించినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. బిల్లుపై తప్పనిసరిగా రైతు సంతకం తీసుకోవాలని సూచించారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించిన బిల్లును, ఆ ప్యాకెట్లను పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపరచుకోవాలని తెలియజేశారు. గ్రామాలలో ఎక్కడైనా బీటీ 3 విత్తనాలను సరఫరా చేస్తున్నట్లుగాని, విక్రయించినట్టుగానే సమాచారం అందితే వెంటనే వ్యవసాయ శాఖ లేదా పోలీసువారికి సమాచారం అందించాలని కోరారు.

# రెండు నెలలు శ్రమించి ప్రాణదానం చేసిన వైద్యబృందం

**-అభినందించిన ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, ఐటిడిఏ పీవో, డీసీహెచ్ఎస్ డాక్టర్**





**భద్రాచలం, ప్రభాతవార్త :** రెండు నెలల పాటు భద్రాచలం ఇంటెన్సివ్ కేర్ యూనిట్లో చికిత్స అందించి పురుగుల మందు ను సేవించిన ఒక మహిళ కు భద్రాచలం ఆసుపత్రి సిబ్బంది ప్రాణం పోశారు. వివరాల్లోకెళ్తే.. చర్ల మండలం లక్ష్మీకాలనీకి చెందిన 22 ఏళ్ల మడకం శిరీష అనే మహిళ మోనోక్రోటోఫోస్ అనే పురుగుల మందును రెండు నెలల క్రితం ఏప్రిల్ ఒకటవ తేదీన త్రాగి, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ చర్లకు వెళ్లారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేసి, కడుపులో ఉన్న పురుగుల మందును కొంత బయటకు తీశారు. ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం భద్రాచలం ఆసుపత్రికి తరలించారు. విషపూరితమైన మోనోక్రోటోఫోస్ పురుగుల మందు అప్పటికే ఊపిరితిత్తులపై కొంత ప్రభావం చూపించగా కోన ఊపిరి తో ఉన్న ఆమెను ఊపిరితిత్తుల వైద్యులు డాక్టర్ జగదీష్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది రెండు నెలల పాటు వెంటిలేటర్ పై చికిత్స అందించి ఆ యువతి ప్రాణాన్ని నిలబెట్టారు. ఆమెను డిస్చార్జ్ చేసే క్రమంలో భద్రాచలం శాసనసభ్యులు డా.తెల్లం వెంకట్రావు ఆసుపత్రిని సందర్శించి ఆమెకు చికిత్స చేసిన డాక్టర్ జగదీష్ మరియు ఇతర వైద్య సిబ్బందిని అభినందించారు. ఆసుపత్రిలో అందుతున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేస్తూ భద్రాచలం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణను అభినందించారు. రెండు నెలలు కష్టపడి వెంటిలేటర్పై ఉన్న మహిళకు ఊపిరి పోసినందుకు భద్రాచలం వైద్య సిబ్బందిని,వెంటనే స్పందించి ప్రాథమిక చికిత్స చేసినందుకు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ చర్ల వైద్య సిబ్బందిని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్,ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్, జిల్లా ఆసుపత్రుల ప్రధాన పర్యవేక్షణ అధికారి డాక్టర్ రవిబాబు అభినందించారు. ఇదే స్ఫూర్తితో రోగుల పట్ల అంకిత భావంతో సేవలందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

**-ఆనందభాష్పాలతో కృతజ్ఞతలు తెలిపిన కుటుంబ సభ్యులు**

రెండు నెలలు రేయింబవళ్లు ఎంతో ఓపికతో చికిత్స చేసి తన బిడ్డను కంటికి రెప్పలా కాపాడిన భద్రాచలం వైద్య సిబ్బందికి శిరీష తండ్రి రమేష్ ధన్యవాదాలు తెలియజేశారు. నా కూతురికి పునర్జన్మ ప్రసాదించిన భద్రాచలం, చర్ల వైద్యులకు, వైద్య సిబ్బందికి ఏమిచ్చిన రుణం తీర్చుకోలేనూ అని ఆనందభాష్పాలతో తన సంతోషాన్ని వ్యక్తం చేశాడు.

# తప్పుడు రిపోర్టులు ఇస్తున్న ఆల్ఫా స్కానింగ్ సెంటర్...

**6 నెలల గర్భిణీకి 9 నెలల రిపోర్ట్ ఇచ్చిన నిర్వాహకులు....**
**స్కానింగ్ సెంటర్ పై ఆగ్రహం వ్యక్తం చేసిన గర్భిణీ బంధువులు....**




**సత్తుపల్లి మే 30 ప్రభాతవార్త**

రోగుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని స్కానింగ్ సెంటర్ తప్పుడు రిపోర్ట్లు ఇచ్చి డబ్బులు దండుకోవటంలో దిట్టగా ఓ స్కానింగ్ సెంటర్ వెలుగు చూసింది. ఇటీవల కాలంలో కొందరు వచ్చేరాని వైద్యం చేయటంతో ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోయిన సంఘటనలు ఉండగా, తప్పుడు స్కానింగ్ రిపోర్టర్లతో మరికొందరు ప్రాణాలు గాల్లో కలిసిపోయిన సంఘటనలు సత్తుపల్లి పట్టణంలో గతంలో జరిగాయి. వచ్చీరాని వైద్యంతో కొందరు తప్పుడు రిపోర్టులు ఇచ్చే స్కానింగ్ సెంటర్ల పట్ల ఆరోగ్యఉన్నతాధికారులు పట్టించుకోకుండా తప్పుడు పత్రాలు ఇచ్చే వారితో మిలాకత్తు అవటం వల్లే వారు ఈ విధంగా రెచ్చిపోతున్నారని ప్రజాస్వామ్య వాదులు ఆ శాఖ తీరుపై ఆరోపిస్తున్నారు. తాజాగా సత్తుపల్లిలో శుక్రవారం జరిగిన సంఘటన గురించి బాధితులు తెలుపు వివరాలు ఈ వి ధ ం గా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేటకు చెందిన ఆరు నెలల గర్భిణీ పందూరి అనూష ఈనెల 19న సత్తుపల్లి లోని లలిత కుమారి వైద్యశాలకు పరీక్ష నిమిత్తం వెళ్లగా స్థానిక ఆల్ఫా స్కానింగ్ సెంటర్ కువైద్యురాలు గర్భిణీని రిఫర్ చేశారు. నిర్వాహకులు ఆరు నెలల గర్భిణీ ని స్కానింగ్ తీసి జ్యోతి అనే పేరు మీద తొమ్మిది నెలల గర్భిణీ గా రిపోర్ట్ ఇవ్వటం జరిగింది. ఈ రిపోర్టును స్థానిక వైద్యురాలికి చూపించడంతో రిపోర్టు ఆధారంగా మందులు ఇవ్వటంతో అనూష ఈ మందులు వాడటంతో కడుపులో తీవ్రమైన నొప్పి రావడంజరిగిందని భర్త పందూరి కిరణ్ బంధువులు విలేకరులకు తెలిపారు. వారం అనంతరం స్కానింగ్ నిర్వాహకులు మా రిపోర్టు మీ దగ్గర ఉందని ఫోన్ చేయటంతో అనూష బంధువులు రిపోర్టు పరిశీలించగా జ్యోతి అని పేరుతో ఉండటంతో అవాక్కయిపోయి ఆల్ఫా సెంటర్ నిర్వాహకులు రాకేష్ దృష్టికి తీసుకెళ్లగా ఇది చిన్న విషయం మరల స్కానింగ్ చేస్తానని ప్రతి చెప్పటంతో బంధువులు ఆగ్రహంతో ఆయనపై ధ్వజమెత్తారు. కడుపులో ఉన్న బిడ్డకు తప్పుడు స్కానింగ్ వల్ల ఏమైనా ప్రమాదం జరిగితే ఆల్ఫా స్కానింగ్ నిర్వాహకులు పై చర్యలు తీసుకునే అంతవరకు సంబంధిత ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రామ నరసింహం జిల్లా ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్తానవిడిచిపెట్టే ప్రసక్తే లేదని భర్త పందూరి కిరణ్ పత్రికలకు తెలిపారు.

బాధితులకు తప్పుడు రిపోర్టులు ఇచ్చారు ఏమిటి అని ఆల్ఫా స్కానింగ్ నిర్వాహకులు రాకేష్ ను ప్రభాతవార్త శుక్రవారం అడగగా మీకు చెప్పే అంత టైం నాకు లేదు ఎంతమందికి సమాధానం చెప్పాలి రాసుకుంటే రాసుకోండి నాకు ఉన్నతాధికారులు సపోర్ట్ ఉంది ఏమి కాదు అని వివరణ ఇచ్చారు.

**డి ఎం అండ్ హెచ్ ఓ వివరణ...**

సత్తుపల్లి ఆల్ఫా స్కానింగ్ సెంటర్ తప్పుడు రిపోర్టులు ఇస్తూ రోగాలను ఇబ్బంది పెడుతున్నారని ఖమ్మం డిఎం అండ్ హెచ్ ఓ కళావతి బాయ్ దృష్టికి శుక్రవారం ప్రభాతవార్త తీసుకెళ్లగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఆమె అన్నారు.







గర్భిణీకి ఇచ్చిన తప్పుడు రిపోర్టులు

# చెరువు బజార్ రోడ్డు వెడల్పులు మార్కింగ్ ఇచ్చిన టౌన్ ప్లానింగ్

**ఖమ్మం కార్పొరేషన్ మే 30 ప్రభాతవార్త**

ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలోని చెరువు బజార్ రోడ్డును 60 అడుగుల వెడల్పుతో విస్తరించేందుకు చర్యలు ప్రారంభమయ్యాయి. నగరంలోని వాహనాల రద్దీ రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో, నగరపాలక సంస్థ నగరంలో ట్రాఫిక్ సమస్యలను తక్కువ చేసే దిశగా ఈ నిర్ణయాన్ని తీసుకుంది. ఈ మేరకు టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు శుక్రవారం చెరువు బజార్ రోడ్డులో విస్తరణ పనులకు సంబంధించి మార్కింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ రోడ్ విస్తరణ పనుల ద్వారా వాహనదారులకు రాకపోకలు మరింత సులభతరం కానుండగా, ట్రాఫిక్ సమస్యలు భారీగా తగ్గే అవకాశం ఉంది. .నగర అభివృద్ధి దిశగా తీసుకుంటున్న ఈ చర్యలతో ఖమ్మం ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి వసుంధర సంతోష్ తదితరులు పాల్గొన్నారు



# వేసవి కార్యాచరణ ప్రణాళికా అమలు విజయవంతం

**- కొత్తగూడెం ఎస్ఈ మహేందర్**

**కొత్తగూడెం, మే 30 - ప్రభాతవార్త:**

వేసవి కార్యాచరణ ప్రణాళికా విజయవంతంగా అమలు చేశామని భద్రాద్రి కొత్తగూడెం సర్కిల్ సూపెరింటెండింగ్ ఇంజనీర్ జి.మహేందర్ స్పష్టం చేశారు. గత సంవత్సరం నవంబర్ నెల నుండి వేసవి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకొని, అందుకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవడం వలన విద్యుత్ వినియోగదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించామని తెలిపారు. ఇందులో భాగంగా లోడ్ పెరిగే అవకాశం ఉన్న చోట్ల మామకన్ను(గుండాల మండలం), గుండాల(గుండాల మండలం), ఆళ్ళపల్లి(ఆళ్ళపల్లి మండలం), సత్యనారాయణపురం(చర్లపల్లి మండలం) ప్రాంతాలలో కొత్తవి 33/11 కెవి సబ్ స్టేషన్ల ప్రాంతాలలో కొత్తవి 4 పవర్ ట్రాన్స్ఫార్మర్లను నెలకొల్పామని, పాల్వంచ(పాల్వంచ మండలం), మల్కారం(దమ్మపేట మండలం), అంకంపాలెం(దమ్మపేట మండలం), లింగాలపల్లి(దమ్మపేట మండలం), నారంవారిగూడెం (అశ్వారావుపేట మండలం) ప్రాంతాలలో 5 (3.15 నుండి 5.0, 5.0 నుండి 8.0 ఎంవిఏ) పవర్ ట్రాన్స్ఫార్మర్ల సామర్థ్యం కూడా పెంచడం జరిగిందని వివరించారు. ఈ ప్రాంతాలలో మామకన్ను(గుండాల మండలం), గుండాల(గుండాల మండలం), ఆళ్ళపల్లి(ఆళ్ళపల్లి మండలం), సత్యనారాయణపురం(చర్లపల్లి మండలం) పవర్ ట్రాన్స్ఫార్మర్లను కొత్తవి, సామర్థ్యం పెంచడం వలన విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా నివారించగలిగాం అని తెలిపారు. అలాగే ఇప్పటివరకు 309 కొత్త ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేశామని, 58 ట్రాన్స్ఫార్మర్ల సామర్థ్యం కూడా పెంచామని చెప్పారు. ఇలా కొత్త ట్రాన్స్ఫార్మర్లు, ట్రాన్స్ఫార్మర్ల సామర్థ్యం పెంచడం వలన ఓవర్ లోడ్ ఇబ్బంది లేకుండా చేయగలిగామని అన్నారు. ఈ ప్రాంతాలలో కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లందు, భద్రాచలం, బూర్గంపాడు, సారపాక, మణుగూరు, అశ్వారావుపేట, దమ్మపేట, మంచుపల్లి, సుజాతనగర్, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, టేకులపల్లి, బొమ్మనపల్లి, లక్ష్మీదేవిపల్లి, జూలూరుపాడు; ఓవర్ లోడ్ తగ్గించగలిగామని, గత నవంబర్ నెల నుండి నిరంతరంగా మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసుకుంటూ వేసవి కాల ముందస్తుగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకుని వెళ్లడం వలనే వియవంతం అయ్యిందని చెప్పారు. ఇదివరకు 33/11కేవీ సబ్ స్టేషన్లలో ఒకే జుదీతీ పై 2 లేదా అంతకంటే ఎక్కువ సంఖ్యలో గల 11 కేవీ ఫీడర్లు ఉండేవి. ఇలా కలిసి ఉన్న ఫీడర్ల లో అంతరాయాలు ఏర్పడినప్పుడు ఒక ఫీడర్లో అంతరాయం ఏర్పడితే, అంతరాయం ఉన్న ఫీడరుతో పాటు మిగతావాటికీ కూడా అంతరాయం ఏర్పడేది, తద్వారా కొత్తగూడెం, మంచుపల్లి, బొమ్మనపల్లి, జూలూరుపాడు, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, గుండాల, సారపాక, దుమ్ముగూడెం ప్రాంతాలకు అంతరాయాలు తగ్గించగలిగామన్నారు. 33కేవీ ఇంటర్ లింక్ లైన్ వ్యవస్థ అనేది ఒక 33/11కేవీ సబ్ స్టేషన్ నుండి మరొక 33/11కేవీ సబ్ స్టేషన్ కు, అలాగే ఒక 33/11కేవీ సబ్ స్టేషన్ నుండి మరొక 132/33కేవీ సబ్ స్టేషన్ కు, ఇదే విధంగా 33కేవీ లైన్ నుండి మరొక 33కేవీ లైన్కు మధ్య అనుసంధానంగా ఏర్పాటు చేసి ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా అందచేయడం సులువుగా ఉంటుంది. ప్రకృతి వైపరీత్యాల వలన లేదా సాంకేతికంగా సమస్యలు ఏర్పడినప్పుడు లేదా సబ్ స్టేషనల నిర్వహణ చేపడుతున్నప్పుడు అంతరాయం ఏర్పడకుండా ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా అందచేయడానికి ఇంటర్ లింకింగ్ వ్యవస్థ ఎంతగానో దోహద పడుతుందని వివరించారు. 12.305 కిలోమీటర్ల మేర లింగాలపల్లి(దమ్మపేట మండలం), పడమటి నర్సాపురం(జూలూరుపాడు మండలం), మల్లారం(దమ్మపేట మండలం), నాయుడుపేట(దమ్మపేట మండలం), సారపాక(బూర్గంపాడు మండలం) సబ్ స్టేషన్ల కు ఇంటర్ లింకింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. లింగాలపల్లి, పడమటి నర్సాపురం, మల్లారం, నాయుడుపేట, సారపాక పరిధిలోని ప్రాంతాలకు ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా అందించేందుకు ఇంటర్ లింకింగ్ వ్యవస్థ ఉందని అన్నారు. కొని చోట్లా పనులు పురోగతిలో ఉన్నవని వివరించారు. ఎక్కడైతే వోల్టేజ్ కు అనుగుణంగా హెచ్చు తగ్గులు లేకుండా ఉండటానికి లైన్ లలో 45 600 రేజుతిలి కెపాసిటర్ బ్యాంకులు క్షేత్ర స్థాయిలో పెట్టడం జరిగిందని, అలాగే 33/11 కేవీ సబ్ స్టేషన్లో 8 1 ఎంవీఏఆర్ /2 ఎంవీఏఆర్ కెపాసిటర్ బ్యాంకులు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. వీటి వలన విద్యుత్ సరఫరా వ్యవస్థలో రియాక్టివ్ పవర్ కాంపన్సేషన్ ద్వారా ఘనణీయంగా మెరుగు పరచడానికి దోహదపడుతుందని, వీటి వలన విద్యుత్ సరఫరాలో లైన్లు ఓవర్ లోడ్ కాకుండా నియంత్రిస్తున్నదన్నారు . టెక్నికల్ నష్టాలు ఘనణీయంగా తగ్గుతాయాని, పరికరాల మన్నిక కూడా చాలా కాలం పెరుగుతుందని అన్నారు. ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేసుకొని పూర్తిగా వేసవికి సమాయత్తం అయినం కాబట్టే, ఎటువంటి అంతరాయాలు లేకుండా మెరుగైన విద్యుత్ విద్యుత్ సరఫరా అందించడానికి ప్రతి ఒక్క ఉద్యోగి నిబద్ధత్తో పనిచేయడం వలనే సాధ్యమైందని తెలిపారు.

# విపత్తు సమయంలో ప్రణాళిక ప్రకారం పని చేయాలి

**- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**



**ఖమ్మం, మే 30, ప్రభాతవార్త :**

విపత్తు సమయంలో ప్రణాళిక ప్రకారం పని చేస్తే ప్రజల ప్రాణ, విలువైన, ముఖ్యమైన పత్రాలు నష్టపోకుండా నివారించవచ్చని, ఎప్పుడూ కూడా ఆలోచనతో ముందుకు పోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, ఆపద మిత్రలకు విపత్తుల నిర్వహణపై ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ గత సంవత్సరం ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ మొదటి తారీఖు వరకు వచ్చిన వరదల కారణంగా నగరం ఆపదలో చిక్కుకుందని, జిల్లా అధికారులు, స్వచ్ఛంద సంస్థలు అద్భుతంగా పని చేయడంతో అతి తక్కువ ప్రాణ నష్టంతో బయటపడి, 15 రోజుల వ్యవధిలో సాధారణ పరిస్థితులను పున:రుద్ధరించగలిగామని తెలిపారు. మహబూబాబాద్, వరంగల్ జిల్లాలలో కురిసే వర్షం వివరాలను కూడా ప్రస్తుతం ట్రాక్ చేస్తున్నామని, వరదల సమయంలో గ్రామం నుంచి జిల్లా వరకు వివిధ స్థాయిలలో వాట్సాప్ గ్రూపుల ద్వారా సమాచారం అందిస్తామని అన్నారు. రాబోయే బుధవారం మండల స్థాయిలో ఆపదమిత్రల పరిచయ కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ప్రమాదాల సమాచారం కలెక్టరేట్ లోని కంట్రోల్ రూమ్ నెంబర్ 1077 కు అందిన వెంటనే కంట్రోల్ రూమ్ నుంచి విపత్కర పరిస్థితులపై సంబంధిత ప్రాంతాలకు సమాచారం అందుతుందని, అక్కడ రెస్క్యూ బృందాలతో పాటు ఆపద మిత్ర శిక్షణ పొందిన వాలంటీర్లు వెళ్లి విపత్తు నిర్వహణలో విధులు నిర్వహిస్తారని కలెక్టర్ తెలిపారు. ఆపద మిత్ర శిక్షణ పొందిన వాలంటీర్లు ముందుగా వారి పరిధిలోని వల్నరబుల్ ప్రాంతాలు, శిథిలావస్థకు ఉన్న ఇండ్లు, ఒంటరి మహిళలు, వృద్ధులు, వివిధ బలహీన వర్గాల ప్రజలు ఉన్న లోతట్టు ప్రాంతాలను గుర్తించాలని కలెక్టర్ తెలిపారు. ప్రమాదాల పట్ల ప్రజలలో ఉన్న నిర్లక్ష్యవైఖరి తగ్గించేందుకు కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. గతంలో అధికారులు హెచ్చరించి నప్పటికీ ఇండ్లు ఖాళీ చేయకుండా ఉండటం వల్ల కొంత మేర ఇబ్బందులు ఏర్పడ్డాయని, రాబోయే రోజులలో ఇటువంటి ప్రమాదాలు, ఇబ్బందులు కాకుండా చూడాలని అన్నారు. ఆపద మిత్రలు ప్రజలతో భాగస్వామ్యం కావాలని అన్నారు. విపత్తు వచ్చే ప్రాంతాల్లోని ఇండ్లకు జిప్ లాక్ బ్యాగులు ముందస్తుగానే పంపిణీ చేయాలని, ముఖ్యమైన పత్రాలు, ఆభరణాలు వాటిలో పెట్టి ప్రజలు రెడీగా ఉండాలని, ప్రభుత్వం నుంచి అలర్ట్ రాగానే ఖాళీ చేసేలా సిద్ధం చేయాలని అన్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామంలో ఆపద సమయంలో ఏర్పాటు చేయాల్సిన రిలీఫ్ సెంటర్ ను ముందస్తుగానే గుర్తిస్తున్నా మని, రిలీఫ్ సెంటర్ లలో బాత్రూం మరమ్మత్తులు, ఇతర సౌకర్యాల కల్పనకు చర్యలు చేపట్టామని, ప్రతి గ్రామంలో రిలీఫ్ సెంటర్ ఎక్కడ ఉంటుందో ఆపద మిత్రలకు అవగాహన ఉండాలని అన్నారు. ప్రమాదం వచ్చినప్పుడు సైనికులు ధైర్యంగా ముందుకు వచ్చి ప్రజలను కాపాడ్తారని, అదే విధంగా ధైర్యంగా ప్రజలను రక్షించేందుకు ముందుకు వచ్చిన ఆపద మిత్రలను ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆపద మిత్రలకు అవసరమైన సేఫ్టీ జాకెట్, ఇతర సామాగ్రి అందుబాటులో పెడతామని తెలిపారు. విపత్తు సమయంలో ఇతరులను కాపాడే ప్రయత్నం ప్రణాళిక బద్ధంగా చేయాలని, విపత్తు సమయంలో ప్రజలలో గాబరా తగ్గించాలని, ముందుగా వారితో పరిచయం ఉంటేనే ఇది సాధ్యమవు తుందని కలెక్టర్ తెలిపారు. ఆపద మిత్రలు వారి మండలం పరిధిలోని తహసిల్దార్, ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శులు, విద్యుత్, ఇతర మండల అధికారుల ఫోన్ నెంబర్లు అందుబాటులో పెట్టుకోవాలని అన్నారు. పంచాయతీ కార్యదర్శులు, మండల అధికారులు హెడ్ క్వార్టర్ లో ఉండేలా ఆదేశాలు జారీ చేశామని, నీటి వనరులు, పెద్ద చెరువుల సమీపంలో ఉన్న గ్రామాల్లో ముందుగా బోట్ లు, తెప్పలు అందుబాటులో పెట్టాలని అన్నారు. ఆపద మిత్రలకు శిక్షణ అందించిన ట్రైయినర్స్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లాలో డిఆర్డిఏ ఆధ్వర్యంలో 3 బ్యాచ్ లలో 12 రోజుల పాటు 300 మంది వాలంటీర్లకు ఆపద మిత్ర శిక్షణ అందించామని, వీరికి ఇన్సూరెన్స్ కూడా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఆపద మిత్ర శిక్షణ క్రింద వాలంటీర్లకు అగ్ని మాపక శాఖ, సింగరేణి, నీటిపారుదల, వివిధ శాఖల క్రింద రిసోర్స్ పర్సన్స్ తో శిక్షణ అందించామని తెలిపారు. 12 రోజుల్లో 300 మంది వాలంటీర్లకు 10 రోజుల పాటు తరగతి గదులలో, 2 రోజుల పాటు గ్రామానికి తీసుకుని వెళ్లి క్షేత్రస్థాయి ఎక్కడి నుంచి వరద వస్తుంది, ఏ ప్రాంతాలు ఎక్కువ ప్రభావం చెందుతాయి, వృద్ధులు, పిల్లలు ఎక్కడ ఉన్నారు వంటి పలు అంశాలతో శిక్షణ అందించామని, అదే విధంగా గ్రామ మ్యాప్ తయారు చేశామని అన్నారు. విపత్తు సమయంలో ప్రమాదం జరిగే ప్రాంతాల వివరాలు ఆపద మిత్రలు తెలియ జేస్తే అక్కడ విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని తెలిపారు. భారీ వర్షాలు వరదల సమయంలో విద్యుత్ తీగలు తెగి పడే ప్రమాదం ఉన్నందున రెస్క్యూ జరిగే ప్రాంతాలలో విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని అన్నారు. అనంతరం ఆపద మిత్రలు 12 రోజులపాటు తమకు అందించిన శిక్షణ వివరాలు, గత ఏడాది వచ్చిన వరదల సమయంలో ఎదుర్కొన్న పరిస్థితుల వివరాలను కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా ఆపద మిత్రలకు కలెక్టర్ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సన్యాసయ్య, సిపిఓ ఏ. శ్రీనివాస్, ట్రాన్స్కో ఎస్ఇ శ్రీనివాసా చారి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




# ఏసీబీ డిఎస్పి రమేష్‌కు నగదు రివార్డ్..

**క్రైమ్ ఖమ్మం మే 30 ప్రభాతవార్త :**



అవినీతిపరుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తూ తెలంగాణ ఉన్నతాధికారుల నుండి ప్రశంసలు అందుకున్నారు, ఆయనే ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎసిబి డిఎస్పి వై రమేష్ కు శుక్రవారం రాష్ట్ర ఏసీబీ డీజీ విజయ్ కుమార్ క్యాష్ రివార్డును స్వయంగా చేశారు, ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా అవినీతి కేసుల్లో అరెస్టులు చేసినందుకు ఈ అరుదైన అవార్డు దక్కింది , రాబోవు రోజుల్లో కూడా అవినీతిపరుల ఆట కట్టించాలని ఈ సందర్భంగా అధికారులు రమేష్ కు సూచించారు

# నకిలీ పత్తి విత్తనాల తయారీ కేంద్రాల్లో సంయుక్త దాడులు

**- మూడు కేసుల్లో 14 లక్షల విలువచేసే 560 కేజీల విత్తనాలు స్వాధీనం**

**- కర్ణాటక ఆంధ్ర ప్రదేశ్ ప్రాంతాల నుండి దిగుమతి**

**- తొమ్మిది మంది అరెస్ట్ రిమాండ్‌కు తరలింపు...**

**- జిల్లా పోలీస్ కమిషనర్ సునీల్ దత్ వెల్లడి...**

**క్రైమ్ ఖమ్మం మే 30 ప్రభాతవార్త :**



పోలీసు, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో 14 విలువచేసే 560 కేజీల నకిలీ విత్తనాలు స్వాధీనం చేసుకొన్నామని జిల్లా పోలీస్ కమిషనర్ సునీల్ దత్ వెల్లడించారు, ఈ మేరకు శుక్రవారం నకిలీ పత్తి విత్తనాల తయారీ కేంద్రాల్లో కట్టడికి టాస్క్ ఫోర్స్ బృందాలు పట్టుకున్న వివరాలను వెల్లడించారు, ఈ సందర్భంగా తొమ్మిది మంది అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు పేర్కొన్నారు కొంతకాలంగా కుటీర పరిశ్రమగా నకిలీ పత్తి విత్తనములు తయారు చేస్తున్న స్థావరాలు మీద పోలీసులు దృష్టి సారించారు, కమిషనర్ ఆదేశాల మేరకు తీగలాగితే డొంక కదిలింది, కొంతమంది దళారులు మొటాలుగా ఏర్పడి తక్కువ డబ్బుకు విత్తనాలు ఇస్తామని ఆశ చూపి రైతులని మోసగిస్తున్నారు, అలాంటి వారిపై గ్రామాల సైతం నిఘా పెట్టడంతో పెద్ద ఎత్తున నకిలీ విత్తనాల గుట్టురట్టు చేశారు, ఏనుకూరు పోలీసులు వ్యవసాయ అధికారులు ఉమ్మడి తనిఖీలో భాగంగా ఇదే గ్రామానికి చెందిన గాజుల నరసరావు (49) అనే వ్యక్తి కొంతమంది రైతులకు అనుమతి లేని పత్తి విత్తనాలను అమ్ముతున్నాడని అజ్ఞాత వ్యక్తులు సమాచారాన్ని అందించారు, అతని వద్ద 450 గ్రాముల పరువు గలిగిన అడ్వాన్స్ 555 పేర్లు మీద ఉమ్మడి పత్రి విత్తనాల ప్యాకెట్లు తనిఖీలు పోలీసులు దొరకడంతో సీజు చేయడం జరిగింది, ఈ బృందంలో కల్లూరు ఎస్సై డి హరిత ఒక టీం బృందంగా ఏర్పాటు చేసి విచారణ నిర్వహించారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మైలవరం మండ్నల చంద్రగూడెం గ్రామానికి చెందిన శాలివాహన అనే వ్యక్తి వద్ద నుండి 450 గ్రాముల ప్యాకెట్లను 400 రూపాయలకు అక్కడ కొనుగోలు చేశారు, ఆ ప్రాంతం నుండి తీసుకువచ్చిన అట్టి విత్తనాలను రూపు 1200 రూపాయలకు వికరిస్తున్నాడని విచారణలో వెలుగు చూసింది, చంద్రుడు ఇంటి వద్ద కుట్ర పరిశ్రమగా ఏర్పాటు చేసుకొని నకిలీ పత్తి విత్తనాలు తయారు చేస్తున్నట్లుగా ఈ బృందం గుర్తించింది, ఇతను కర్ణాటక నుంచి పత్తి విత్తనాలు వాటిని ట్యాగ్ చేయడానికి ప్రింటెడ్ అడ్వాన్స్ త్రిబుల్ ఫైవ్ నెంబర్ కలిగిన కవర్లో ఉన్న ప్యాకెట్స్ ను తీసుకువచ్చి రైతులకు అంటగడుతున్నాడు, ఈ విత్తనాల్లో రైజాబిల్ మిశ్రమాన్ని కలిపి ఆరబెట్టి ప్యాకెట్ లో నింపి సీల్ చేసి ఏనుకూరు గాజుల నరసింహారావు ద్వారా మరి కొంతమంది ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని రైతులకు అధిక దిగుబడి వస్తుందని నమ్మించాడు, ఇదే క్రమంలో ఈ విత్తనాలు పొలాల్లో నాటితే కలుపు మందు ఇబ్బంది ఉండదని నమ్మించి ఒక్కొక్క ప్యాకెట్ రూ1200 చొప్పున రైతులకు అమ్ముతున్నాడని పోలీసుల విచారణలో కనుగొన్నారు, అతని ఇంటి వద్ద నుండి ఒక గంట రైజోబెల్ మిశ్రమం కలిపి పెట్టి తయారు చేసిన పత్తి విత్తనాలు 450 గ్రాముల బరువు కలిగి ఉంది, దీని మీద అరుణోదయ లేబుల్ తో 272 పత్తి విత్తన ప్యాకెట్లను వాటిని సీల్ చేయడానికి వాడే రెండు మిషన్లు మరొక వేయింగ్ అరుణోదయ లేబుల్ తో ఉన్న మిషన్ సుమారు 400 కాళీ ప్యాకెట్లు రెండు లీటర్ల రైజోబిన్ మిశ్రమాన్ని సైతం సీజ్ చేశారు, మరో కేసులో ఏనుకూరు మండలం రేపల్లెవాడ గ్రామ శివారులో నకిలీ పత్తి విత్తనాలు అమ్ముతున్నారని సమాచారాన్ని పోలీసులు అందుకున్నారు, ఈ సందర్భంగా ఇమామ్ నగర్ గ్రామానికి చెందిన వెనిగండ్ల శ్రీహర్రావు అనే వ్యక్తి వ్యవసాయ భూమిలో తనిఖీలు నిర్వహించగా అక్కడ 210 కేజీ ప్యాకెట్ల ఉన్న నకిలీ పత్తి విత్తనాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు, తదుపరి శ్రీధర్ రావు ఇచ్చిన సమాచారం మేరకు అతని అనుచరుడైన ఏనుకూరులో ఉమ్మనేని కిషోర్ ఇంటి వద్ద తనిఖీ చేయగా 120 కిలోల నకిలీ పత్తి విత్తనాలు లభించాయి, వీటిని తయారు చేయడానికి ఉపయోగిస్తున్న రైజోబిల్ కెమికల్ వేయింగ్ మిషన్ స్వాధీనం చేసుకున్నారు, వెనిగండ్ల శ్రీహర్రావు గత కొంతకాలంగా ఆంధ్రప్రదేశ్లోని బాపట్ల జిల్లాలో ఉన్న తన బంధువైన లక్ష్మీనారాయణ ద్వారా కిలో రూ 800 చొప్పున నకిలీ ఎటువంటి అనుమతి లేని విత్తనాలు అక్కడి నుంచి తెప్పించి ఏనుకూరు మండలం రైతులకు అధిక దిగుబడి వస్తుందని నమ్మించి మోసగిస్తున్నాడు, బాపట్ల నుండి దిగుమతి చేసి రూ 2600 చొప్పున రైతులకు అమ్ముతున్నాడని అధిక లాభాలు గడిస్తున్నాడని పోలీసులు విచారణలో తేలింది, అలాగే ఏనుకురు ఎస్సై రఫీ అందిన సమాచారం మేరకు పోలేటి కోటేశ్వరరావు ఇంటి వద్ద తనిఖీలు నిర్వహించగా అతని వద్ద నకిలీ పత్తి విత్తనాలు20 ప్యాకెట్లు లభ్యమైనవి, ఈ కేసులో అతడిని విచారించగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తెనాలి జిల్లా నుండి తీసుకువచ్చి ఎలాంటి అనుమతులు లేకుండా అమ్ముతున్నాడని వెలుగులోకి వచ్చింది, ఆయా కేసుల్లో మొదట నిందితుడు వెని గండ్ల శ్రీహర్రావు,(ఇమామ్ నగర్) రెండవ నిందితుడు ఉమ్మ నేనీ నరేష్ (ఏనుకూరు) మూడవ నిందితుడు అన్నెం లక్ష్మీనారాయణ (భీమవరం ఇంకొల్లు మండలం ఆంధ్ర) నాలుగో నిందితుడు గుగులోతు గోపి (ఇమామ్ నగర్) ఐదవ నిందితుడు వరదబోయిన రమేష్ (రేపల్లెవాడ) ఆరవ నిందితుడు తంబళ్ల నవీన్ (రేపల్లె వాడ) ఏడవ నిందితుడు దొంతబోయిన రమేష్(రేపల్లెవాడ) లను గుర్తించారు, ఈ తనిఖీల్లో సీజ్ చేసిన మెటీరియల్ ప్యాకెట్ల వివరాలను కూడా కమిషనర్ తెలిపారు, . ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మార్కెట్లో నకిలీ విత్తనాల విక్రయం జరగకుండా టాస్క్ ఫోర్స్ బృందాలు నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని వివరించారు, ఈ కేసుల్లో మొత్తం తొమ్మిది మందిని అరెస్ట్ చేసి రిమైండర్ తరలించారు విచారణ ఇంకా కొనసాగుతుందని నకిలీ విత్తనాలు కట్టడానికి టాస్క్ ఫోర్స్ బృందాలు ఇంకా ముమ్మరం చేయాలని ఆదేశించారు, ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులకు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలని నాసిరకో నకిలీ విత్తనాలు అంటగట్టి రైతులను మోసగిస్తే ఊచలు లెక్క పెట్టాల్సి వస్తుందని హెచ్చరించారు, గ్రామాల్లో నకిలీ విత్తనాలు అమ్మినట్టు తెలిస్తే వెంటనే పోలీస్ వ్యవసాయ శాఖకు సమాచార ఇవ్వాలని సూచించారు,. ఈ బృందంలో కల్లూరు ఏసీపీ రఘు సత్తుపల్లి రూరల్ సీఐ ముత్తులింగం ఏనుకురు కల్లూరు ఇన్స్పెక్టర్లు రఫీ హరిత పాల్గొన్నారు

# భూనిర్వాసితులకు శాశ్వత ఉద్యోగ అవకాశం కల్పించాలి

**- స్పెషల్‌డిప్యూటీ కలెక్టరన సుమకు బీఆర్ఎస్ నాయకుల వినతి**

**మణుగూరు, ప్రభాతవార్త, మే30 :**

సింగరేణి సంస్థ మణుగూరు ఏరియాలో మణుగూరుఓసీ విస్తరణ వలన భూములు కోల్పోయే నిర్వాసితరైతుల కుటుంబాలకు శాశ్వత ఉద్యోగ అవకాశం కల్పించాలని, మెరుగైన ప్యాకేజీ ఇవ్వడంతో పాటు ఇంటిస్థలం ఇచ్చి ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరుతూ మణుగూరు మండల బీఆర్ఎస్‌పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం స్పెషల్‌డిప్యూటీ కలెక్టర్ టి.సుమకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కుర్రి నాగేశ్వరరావు, పట్టణ కన్వీనర్ కుంటా లక్ష్మణ్, మాజీ మండల అధ్యక్షులు ముత్యం బాబు, ఎడ్ల శ్రీనివాస్, వట్టం రాంబాబు, ఆవుల నర్సింహారావు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు వేర్పుల సురేష్, జావిద్, బర్ల సురేష్, పద్దం శ్రీను, ముత్యం రమేష్, కంపెల నాగేశ్వరరావు, పద్దం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలి

**- నాణ్యమైన విద్యను పొందాలి**

**- టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.రాజు**

**మణుగూరు, ప్రభాతవార్త, మే30 :**

పిల్లలను తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి నాణ్యమైన విద్యను పొందాలని, ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.రాజు అన్నారు. ఆయన శుక్రవారం మణుగూరు మండలంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లాకమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల నమోదుపెంపు ప్రచారజాతాలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో సుశిక్షితులైన ఉపాధ్యాయులు ఉన్నారని, సువిశాలమైన తరగతిగదులు, క్రీడాప్రాంగణాలు ఉన్నాయన్నారు. తల్లిందండ్రులందరూ తమ పిల్లలను తమ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి నాణ్యమైన విద్యను ఉచితంగా పొందాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడవలసిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, వర్క్‌బుక్కు, బట్టలు ఉచితంగా అందజేయడంతో పాటు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందజేయడం జరుగుతుందన్నారు. ప్రతిగ్రామంలో ప్రజలందరూ ఐకమత్యంగా కదిలి ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఐదురోజులపాటు జిల్లాలో విద్యార్థుల నమోదుకొరకు ప్రచారజాతా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జి.మురళీమోహన్, రాష్ట్రకమిటీ సభ్యులు ఎన్.కృష్ణ, జిల్లా కార్యదర్శి బి.రాము, ఎస్.విజయ్‌కుమార్, మణుగూరు మండల ప్రధాన కార్యదర్శి ఎస్కె.మీరాహుస్సేన్, ఉపాధ్యక్షులు తోటా విజయలక్ష్మి, స్వరూపారాణి, సునీత, పూనెం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# పినపాక ఎమ్మెల్యే పాయంను కలిసిన సీఐ నాగబాబు

**మణుగూరు, ప్రభాతవార్త, మే30 :**

పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును మణుగూరు సీఐగా బాధ్యతలు చేపట్టిన పాటి నాగబాబు శుక్రవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మణుగూరు సీఐగా బాధ్యతలు చేపట్టిన [illegible] మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును కలిసినట్లు ఆయన తెలిపారు.



# పిల్లలను ఊరి బడిలో చేర్పిద్దాం

**- ప్రైవేట్ ఫీజుల భారాన్ని తగ్గించుకుందాం**

**- టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజు**

**పినపాక ప్రభాతవార్త, మే 30:**

విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి నాణ్యమైన విద్యను పొందాలని,ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలని టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి రాజు పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల నమోదు పెంపుదల కొరకు టీఎస్ యుటిఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ప్రచార జాతా మండల పరిధిలోని తోగ్గూడెం,గోపాలరావుపేట,పినపాక, సీతంపేట, ఇ బయ్యారం తదితర గ్రామాలలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో సుశిక్షితులైన ఉపాధ్యాయులు ఉన్నారని, విశాలమైన తరగతి గదులు,ఆటస్థలం ఉన్నాయని తల్లిదండ్రులందరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి నాణ్యమైన విద్యను ఉచితంగా పొందాలని విజ్ఞప్తి చేశారు.ప్రభుత్వ బడులను కాపాడాల్సిన బాధ్యత తల్లిదండ్రుల పైన ఉన్నదని తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, వర్క్ బుక్కులు, ఏకరూప దుస్తులు ఉచితంగా అందించబడుతున్నాయని,నాణ్యమైన మధ్యాహ్న భోజనం, వారానికి మూడు సార్లు కోడిగుడ్లు, రాగిజావ అందిస్తున్నారని తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలను ఆదరించి పిల్లలను చేర్పించి,ఫీజుల భారం లేని ఉచిత విద్య పొందాలని, విద్యార్థుల సమగ్ర వికాసానికి ప్రభుత్వ పాఠశాలలు దోహదపడుతాయని తెలియజేశారు.గుడి, మసీదు,చర్చిల నిర్మాణం కోసం ఐకమత్యంగా కదిలే ప్రజలు ఊరి బడి కోసం సైతం ఏకమై బడిని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ఉందని తెలియజేశారు. గ్రామాలలో ప్రతి ఇంటికి వెళ్ళి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని టీఎస్ యుటిఎఫ్ శ్రేణులు ఈరోజు నుండి 5 రోజులపాటు జిల్లాలో ప్రచారం నిర్వహిస్తాయని తెలియజేశారు.ఆంగ్ల మాధ్యమంలో విద్యా బోధన,ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారని, అత్యున్నత విద్యార్హతలు కలిగిన టీచర్లు ఉంటారని తల్లిదండ్రులకు వివరిస్తామని తెలియజేశారు. తల్లిదండ్రుల ఆశను ప్రైవేటు విద్యా వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారని, చదువుల నాణ్యతలో ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలల మధ్య పెద్దగా వ్యత్యాసం లేదని పలు సర్వేలు వెల్లడిస్తున్నాయని, సంపాదనలో సగానికి పైగా పిల్లల చదువుల కోసమే ఖర్చు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని, ప్రభుత్వ బడి మూతపడితే సమాజానికి నష్టం అని,మన ఊరు మనబడి,అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలతో మౌళిక వసతుల కల్పన మెరుగైందని తెలియజేశారు. ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభించటానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని,ఏఐ ఆధారిత బోధన, డిజిటల్ తరగతి గదులు,లైబ్రరీ, లేబరేటరీలతో పాటు ఆటపాటలతో అహ్లాదకరమైన వాతావరణంలో, ప్రతి విద్యార్థి పట్ల వ్యక్తిగత శ్రద్ధతో, నిపుణులైన ఉపాధ్యాయులతో ఒత్తిడి లేని చదువు అందించబడుతుందని,పిల్లల మానసిక ఆరోగ్యానికి, వ్యక్తిత్వ వికాసానికి అనువుగా ప్రభుత్వ పాఠశాలలు రూపుదిద్దుకుంటున్నాయని,మన పిల్లలను మన ఊరి బడిలోనే చేర్పించి బడికి అవసరమైన వసతుల కల్పనకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తే తప్పనిసరిగా బడి నిలబడుతుందని తెలియజేశారు. పిల్లలకు నాణ్యమైన విద్య ఉచితంగా అందుతుంది. తల్లిదండ్రులకు ఫీజుల భారం తగ్గుతుంది కనుక తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి భవిష్యత్తుకు భరోసా ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రచార జాతాలో జిల్లా అధ్యక్షులు బి.మురళి మోహన్,రాష్ట్ర కమిటీ సభ్యులు ఎన్.కృష్ణ,జిల్లా కార్యదర్శిలు బి. రాము, ఎస్.విజయకుమార్,మణుగూరు మండల భాద్యులు మీరా హుస్సేన్,మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.






# జీఎం(సివిల్)కు ఘనసన్మానం

**మణుగూరు, ప్రభాతవార్త, మే30 :**



సింగరేణి సంస్థ మణుగూరు ఏరియాలో ఏజీఎం(సివిల్)గా పనిచేస్తూ పదోన్నతిపై జీఎం(సివిల్)గా కొత్తగూడెం కార్పోరేట్ కార్యాలయానికి వెళుతున్న డి.వెంకటేశ్వర్లును ఏరియా జీఎం కార్యాలయంలో ఏరియా అధికారుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏరియా జీఎం దుర్గం రామచందర్ మాట్లాడుతూ.. మణుగూరు ఏరియాలో డి.వెంకటేశ్వర్లు డీజీఎం(సివిల్)గా పనిచేసి ఆతర్వాత ఏజీఎం(సివిల్)గా పదోన్నతి పొందడమేకాకుండా జీఎం(సివిల్)గా పదోన్నతిపై కార్పోరేట్‌కు వెళుతున్నారని అన్నారు. మణుగూరు ఏరియా అభివృద్ధి కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పీకేఓసీ పీవో లక్ష్మిపతిగౌడ్, మణుగూరుఓసీ పీవో శ్రీనివాసచారి, ఎస్వోటూ జీఎం డి.శ్యాంసుందర్, డీవైసీఎంవో సీహెచ్.మేరీకుమారి, ఏజీఎం(ఐఈడీ) కె.వెంకట్రావు, డీజీఎం(కేసీహెచ్‌పీ) మదన్‌నాయక్, సెక్యూరిటీ ఆఫీసర్ శ్రీనివాస్, ఎంవీటీసీ మేనేజర్ నాగేశ్వరరావు, పి.రమేష్, ప్రవీణ్‌కుమార్, జె.శ్రీనివాసరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# పీసా గ్రామసభ

**మణుగూరు, ప్రభాతవార్త, మే30 :**




మణుగూరు మండలం విజయనగరం గ్రామంలో రైతువేధిక నందు మణుగూరుఓపెన్‌కాస్టు విస్తరణ కోసం భూసేకరణలో భాగంగా పీసా గ్రామసభను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ టి.సుమ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో పీకేఓసీ, మణుగూరుఓసీల పీవోలు టి.లక్ష్మిపతిగౌడ్, శ్రీనివాసచారి, ఎంపీడీవో శ్రీనివాసరావు, డిప్యూటీ తహశీల్దార్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

# పినపాక ఎమ్మెల్యే పాయంను కలిసిన జీఎం(సివిల్) వెంకటేశ్వర్లు

**మణుగూరు, ప్రభాతవార్త, మే30 :**



పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును శుక్రవారం సింగరేణి సంస్థ మణుగూరు ఏరియాలో ఏజీఎం(సివిల్)గా పనిచేస్తూ పదోన్నతిపై జీఎం(సివిల్)గా కొత్తగూడెం కార్పోరేట్ కార్యాలయానికి వెళుతున్న డి.వెంకటేశ్వర్లు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎం(సివిల్) డి.వెంకటేశ్వర్లుకు శుభాకాంక్షలు తెలిపారు.

# ఎక్సైజ్ శాఖ అధికారులను ప్రభుత్వం వెంటనే సస్పెండ్ చేయాలి

**ఇల్లందు అర్బన్, మే 30, ప్రభాతవార్త:**

ఇల్లందు మండలం పోలారం గ్రామములో సేవాలాల్ సేన మండల స్థాయి ముఖ్యనాయకుల సమావేశం శుక్రవారం జరిగింది ఈ సమావేశానికి ఉద్దేశించి మండల అధ్యక్షులు వాంకుడోత్ రమేష్ నాయక్ మాట్లాడుతూ ఇల్లందు మండలంలో ఎక్సైజ్ అధికారులు మద్యం సిండికేటుకు అనుమతి ఇచ్చారా లేకపోతే సిండికేట్ వ్యాపారులకు అమ్ముడు పోయారా అని ప్రశ్నించారు. మండలం లో సిండికేట్ మద్యం దందా నడుస్తున్నప్పటికీ మామూళ్లకు అలవాటు పడిన ఎక్సైజ్ అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసుకుని సిండికేట్ దందా నడిపిస్తున్నారని ఆరోపించారు. మండలంలో ఉన్న ప్రజల సొమ్ము సిండికేట్ వ్యాపారుల ద్వారా కోట్ల రూపాయలు చేతులు మారుతున్నాయని దీనిపై ఎన్ ఫోర్స్ మెంట్ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. 1/70 యాక్టు, పీసా చట్టాలు ఆములలో ఉన్న ఈ చట్టాలకు విరుద్ధంగా ప్రతి గ్రామపంచాయతీలలో ప్రతి మారుమూల ప్రాంతాలలో బెల్ట్ షాపులు అడ్డు అదుపు లేకుండా పుట్టగొడుగుల్లా వెలిశాయని నిరక్షరాసులైన గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని ఎమ్మార్పీ ధరల కంటే అధిక రేట్లకు మద్యాన్ని విక్రయిస్తూ ప్రజల్ని మోసగిస్తున్నారని అన్నారు. ఏజెన్సీ గ్రామాల ప్రజలు ప్రధానంగా యువకులు అధికంగా మద్యానికి బానిసలై గ్రామాలలో కుటుంబాలలో ఘర్షణలకు దిగుతున్నారన్నారు. సిండికేట్ వ్యవస్థపై చర్యలు తీసుకోవాలని గతంలో సేవాలాల్ సేన జిల్లా కమిటీ తరఫున ఇల్లందు ఎక్సైజ్ శాఖ సిఐ



గారికి వినతి పత్రం ద్వారా తెలపడం ఇల్లందు ఎక్సైజ్ కార్యాలయాన్ని సేవాలాల్ సేన ఆధ్వర్యంలో ముట్టడి చేసినప్పటికీ అధికారులు మాత్రం సిండికేట్ వ్యవస్థపై చర్యలు మాత్రం తీసుకోవడం లేదు ఇది దేనికి నిదర్శనం అనేది ఎక్సైజ్ శాఖ తెలపాలని అన్నారు. బాధ్యత గల అధికారి పదవిలో ఉన్నవారు ప్రజల కోసం పనిచేయకుండా మామూళ్లకు జోకుతున్న వారికి వెంటనే సస్పెండ్ చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు మద్యం సిండికేట్ దందాపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని అన్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్ శాఖ అధికారులు మొద్దు నిద్ర వీడి సిండికేట్ దందా నడుపుతున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఇల్లందు ఎక్సైజ్ కార్యాలయాన్ని సేవాలాల్ సేన ఆధ్వర్యంలో ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తేజావత్ సురేష్ భూక్య భాస్కర్ వాంకుడోత్ నాన్నక వాంకుడోత్ లాలు భూక్య సాయి లకావత్ బోడ కృష్ణ బానోత్ మోహన్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు

## మహా గర్జన పోస్టర్ ఆవిష్కరణ..

**ఇల్లందు టౌన్, మే 30, ప్రభాతవార్త:**

కొత్తగూడెంలో జూన్ 8న జరుగు మాలల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరుతూ ఆ సంఘం ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. మండలంలోని సుభాష్ నగర్ లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడారు. రాజ్యాంగ రక్షణ కోసం జరుగుతున్న ఈ మహాగర్జనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పండగ ప్రసాద్, తమిదల బిక్షం, జాన్ బాబు, రాములు, గడ్డి శీను, కాంతారావు తదితరులు ఉన్నారు.



## మానవత్వం చాటిన మిస్సెస్ ఇండియా..!!

**- ఒకే ఇంట్లో నలుగురు దివ్యాంగులు**

**- చలించిన మహమ్మద్ పర్వా**

**- రూ.10వేలు తక్షణ సాయం అందజేత**

**కూసుమంచి, మే 30 (ప్రభాతవార్త) :**



మండలంలోని మునిగేపల్లి గ్రామంలో మిస్సెస్ ఇండియా మహమ్మద్ పర్వా ఆధ్వర్యంలో పేదలకు ఆర్థిక సహాయం అందించారు. గ్రామానికి చెందిన పాతుర్తి పేరయ్య కుటుంబంలో 4గురు వికలాంగులు ఉన్నారు అని తెలుసుకున్న మిస్సెస్ ఇండియా మహమ్మద్ ఫర్వా శుక్రవారం వారి కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సహాయం చేయడం జరిగింది. అంతే కాకుండా ప్రతి నెల కూడా తన తరుపున ఆ కుటుంబానికి ఎంతో కొంత సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కుటుంబం గురించి తన దృష్టికి తీసుకొచ్చి వారికి తన ద్వారా సహాయం చేపించిన కోసూరి పద్మ, ముక్కా సుభాషిణి లను మిస్సెస్ ఇండియా ప్రశంసించారు. మునిగేపల్లి గ్రామంలో ఇలాంటి మంచి కార్యక్రమాలు చేసినందుకు మహమ్మద్ ఫర్వా కి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.



### శానిటరీ ప్యాడ్స్ పంపిణీ..

వరల్డ్ మెనిస్ట్రియల్ హైజీన్ డే సందర్భంగా కూసుమంచి మండలం మునిగేపల్లి గ్రామంలో ఫీడ్ ఇండియా ఫౌండేషన్ తరుపున ఫీడ్ ఇండియా ఫౌండేషన్ ఫౌండర్, మిస్సెస్ ఇండియా మహమ్మద్ ఫర్వా గ్రామంలోని 150 మంది మహిళలకు శానిటర్ ప్యాడ్స్ ను ఉచితంగా పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ నెలసరి సమయంలో మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేయడం జరిగింది. అదే విధంగా మహిళలకు ప్రధానంగా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ రావడానికి కారణాలు తెలియచేసి ఆ క్యాన్సర్ రాకుండా ఉండటానికి తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అందరికీ అర్థం అయ్యేలా వివరించారు. ఈ కార్యక్రమంలో కోసూరి పద్మ, ముక్కా సుభాషిణి, వార్డు మెంబర్ రామా అచ్చమ్మ, ఐకేపీ గ్రామ అధ్యక్షురాలు సిరిపురపు మరియమ్మ, గ్రామశాఖ అధ్యక్షులు షేక్ సైదులు, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

## మర్రిగూడెంలో గ్రామోత్సవం

**- మహోత్సవ వేడుకలతో ఆధ్యాత్మిక వాతావరణం**

**కామేపల్లి, మే 30 ప్రభాతవార్త:**

కామేపల్లి మండలం మర్రిగూ డెం గ్రామంలో శుక్రవారం భక్తు లు, గ్రామస్తులు సాంప్రదాయబ ద్ధంగా భక్తిశ్రద్ధలతో వైభవంగా గ్రామోత్స వాన్ని నిర్వహించా రు. జీవధ్వజస్తంభ ప్రతిష్ట మ హోత్స వ వేడుకలలో భాగంగా గ్రామోత్స వాన్ని నిర్వహించా రు. అనంతరం హోమాలు, పూ జలు నిర్వహించారు. శనివా రం ప్రతిష్ట, అన్నదాన కార్యక్ర మాలను నిర్వహించనున్నారు.



అందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేశారు.




## ఆపరేషన్ కగారును నిలిపివేయాలి: విమలక్క

**గుండాల మే 30 ప్రభాతవార్త:**




మండలంలో ఆపరేషన్ కగార్ ను నిలిపివేయాలని ఆదివాసులపై జరుగుతున్న అత్యాకాండలపైన సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని కేంద్ర ప్రభుత్వం సిజ్ ఫైర్ ప్రకటించి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని మండల కేంద్రంలో అఖిల భారత రైతు కూలి సంఘం, ఆల్ ఇండియా కేత్ మల్దూర్ కిసాన్ సభ, రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించిన తదనంతరం మండల తాసిల్దార్ కు మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో విమలక్క ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ...మద్య భారతంలోని అడవుల్లో గల విలువైన ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలైన అదాని, అంబానీలకు కట్టబెట్టడం కోసం ఆదివాసీలను అడవుల్లో నుంచి తరిమి వేయడానికి ఆపరేషన్ కగార్ పేరా మానవ హణనానికి పూనుకుంటుందని అన్నారు. 31. 5. 2026 వరకు సిపిఐ మావోయిస్టు లను తుది ముట్టిస్తామని కేంద్రమంత్రి అమిత్ షా రాజ్యాంగ విరుద్ధమైన వాక్యానాలు చేస్తున్నాడు. స్వచ్ఛందంగా కాల్పుల విరమణను ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం కాల్పుల విరమణను స్వాగతించకుండా వేలాది సైనిక బలగాలను అడవుల్లో పంపి మావోయిస్టు నాయకులతో పాటు అమాయక ఆదివాసులను డజన్ల సంఖ్యలో కాల్చి సంపుతూ ఎన్కౌంటర్లుగా చిత్రీకరిస్తున్నారని అన్నారు. పైగా రాజ్యాంగ విరుద్ధంగా ఎన్కౌంటర్లలో కాల్చి చంపిన తర్వాత కుటుంబ సభ్యులకు మృతదేహాలను అప్పగించకుండా ప్రభుత్వమే దహనం చేయడం అప్రజాస్వామికమని తెలియజేశారు. తేదీ 21. 5. 2025న నారాయణపూర్ జిల్లా మాడ్ గుట్టల వద్ద అప్రజాస్వామికంగా సిపిఐ మావోయిస్టు జాతీయ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు తో పాటు 26 మంది ఆదివాసులను ఎన్కౌంటర్ పెర క్రూరంగా కాల్చి చంపివేసిందని అన్నారు. కామ్రేడ్ నంబాల కేశవరావు మృతి పై మరియు ఆపరేషన్ కగార్ పేరు 2024 నుండి ఇప్పటివరకు జరిగిన బూటకపు ఎన్కౌంటర్లపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జర్జిచే న్యాయ విచారణ జరిపించాలని ప్రజాసంఘాల పక్షాన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ చైర్మన్ విమలక్క, సిపిఎంఎల్ ప్రసాదన్న, సిపిఎంఎల్ ఉక్ల నాయక్, రైతు కూలీ సంఘం నాయకులు నాగిరెడ్డి, రైతు కూలీ సంఘం నాయకులు వెల్తురు సదా నందం, తుడుం దెబ్బ నాయకులు కోడెం వెంకటేశ్వర్లు, టీపీఎఫ్ నాయకులు కందకట్ల సురేందర్, రైతు సంఘము నాయకులు సోమన్న, బి ఎస్.పి నాయకులు బొమ్మర రాంబాబు, ఆదివాసి సంఘం నాయకులు వి.చంద్రయ్య, మోకాళ్ళ సమ్మయ్య, రైతు కూలీ సంఘం నాయకులు మండల యుగంధర్, పల్స యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



## రెడ్డిగూడెంలో రైతుముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమం

అశ్వారావుపేట రూరల్, మే 30 ప్రభాతవార్త:



వ్యవసాయ కళాశాల అశ్వారావుపేట ఆధ్వర్యంలో మండలంలోని రెడ్డిగూడెంలో శుక్రవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ పి శ్రీలత, డాక్టర్ డి స్రవంతి రైతులకు అధిక యూరియా వాడకం వలన వచ్చే అనర్థాలను, అధిక సాంద్రత పత్తి సాగులో మెలకువలు, నీటి కుంట వలన ఉపయోగాలు, భూసార పరీక్ష విధానాన్ని గురించి వివరించారు. అదే విధంగా రసాయనిక మందుల వాడకం వల్ల కలిగే నష్టాలను, పంట మార్పిడి పద్ధతి ద్వారా తెగుళ్ల నిర్మూలన, వివిధ పంటల్లో సమగ్ర సస్యరక్షణ చర్యలను, విత్తనాలు పురుగు మందులు కొనుగోలు చేసినప్పుడు రసీదులను భద్రపరచుకోవాలని శాస్త్రవేత్త సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారి, ఉద్యాన విస్తరణ అధికారి, గ్రామ పంచాయతీ సెక్రెటరీ, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## నకిలీ విత్తనాలు అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవు

**- ఎస్సై పి.సంతోష్ వెల్లడి**

నేలకొండపల్లి, మే 30 ప్రభాతవార్త:



ఎరువుల దుకాణాల యందు నాసిరకం ఎరువులు కానీ, నకిలీ విత్తనాలు కానీ రైతులకు అమ్మినట్లయితే అట్టి వారి పై చట్టపరమైన చర్యలు చేపడతామని నేలకొండపల్లి ఎస్సై పి. సంతోష్ వెల్లడించారు. శుక్రవారం నేలకొండపల్లి మండలం లోని వివిద గ్రామాల లోని ఎరువులు, విత్తన దుకాణాలలో నేలకొండపల్లి ఎస్సై పి.సంతోష్, మండల ఏవో ఎం. రాధ తనిఖీలు చేసారు. ఈ సందర్భంగా స్థానిక రైతువేదిక నందు ఎరువుల దుకాణాలు, విత్తన డీలర్ ల తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సంతోష్, ఏవో రాధ మాట్లాడుతూ రైతులు తమకు కావాల్సిన ఎరువులను, విత్తనాలను ప్రభుత్వ ఆమోదం కలిగిన దుకాణాలలో మాత్రమే కొనుగోలు చేయాలని, అపరిచితులు గ్రామాల్లోకి వచ్చి తక్కువ రేటుకు మంచి విత్తనాలు, ఎరువులు అంటూ అమ్ముతామని నమ్మించినట్లయితే మోసపోవద్దని వారు చెప్పారు. ఎవరైనా విడిగా ఎరువులు, విత్తనాలు అమ్మినట్లయితే వారి వద్ద కొనుగోలు చేయవద్దని వారు చెప్పారు. అలాంటి వారు ఎవరన్నా అమ్మినట్లయితే పోలీస్ వారికి సమాచారం తెలియచేయాలని చెప్పారు. దుకాణాలలో తప్పనిసరిగా ఎరువులు, విత్తనాలకు సంబంధించిన రికార్డ్ లను నమోదు చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏవోలు, ఎరువులు, విత్తనాల డీలర్ లు పాల్గొన్నారు.

## తుమ్మలను కలిసిన ఎమ్మెల్యే జారె

దమ్మపేట, మే 30 ప్రభాతవార్త:



తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును శుక్రవారం అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారె ఆదినారాయణ కలవడం జరిగింది. మండలంలోని గండుగులపల్లి మంత్రి నివాసంలో తుమ్మలను కలిసిన జారె అశ్వారావుపేట నియోజకవర్గ పరిధిలో ఉన్న పలు సమస్యలను మంత్రి తుమ్మల దృష్టికి జారె తీసుకువెళ్ళారు. ఇతర మంత్రులతో మాట్లాడి అశ్వారావుపేట నియోజకవర్గ పరిధిలో గల సమస్యలను పరిష్కారిస్తానని మంత్రి తుమ్మల జారెకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కాసాని నాగప్రసాద్, అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ కళాశాలను సందర్శించిన మహిళ రైతులు

అశ్వారావుపేట అర్బన్, మే 30 ప్రభాతవార్త:




ములకలపల్లి గుడ్ షెఫర్డ్ ఆధ్వర్యంలో శుక్రవారం వ్యవసాయ కళాశాలను మహిళ రైతులు సందర్శించారు. ఈ సందర్భంగా మహిళ రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి ప్రొఫెసర్లు డాక్టర్ రాంప్రసాద్, డాక్టర్ పావని, డాక్టర్ నీలిమ, డాక్టర్ దీపక్‌లు మాట్లాడుతూ సేంద్రియ ఎరువుల తయారీ, కిచెన్ గార్డెన్ పై, వర్మికంపోస్టు, పుట్టగొడుగుల పెంపకం, ఉద్యాన పంటల సాగు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా భూసార పరీక్షలు నిర్వహించడం వలన కలిగే ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో గుడ్‌షెపర్డ్ ప్రతినిధులు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విత్తనాలు,ఎరువులు దుకాణం తనిఖీ

దమ్మపేట రూరల్, మే 30 ప్రభాతవార్త :



మండల కేంద్రంలోని సవిత్రు ఫెర్టిలైజర్స్ దుకాణాన్ని వ్యవసాయ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీలర్లు విత్తనాలు ప్రభుత్వంతో దృవీకరించబడిన సంస్థల నుండి మాత్రమే కొనుగోలు చేసి రైతులకు విక్రయించాలని సూచించారు. రైతులకు విత్తనాలు విక్రయించిన దుకాణంలో తప్పనిసరిగా రైతుకు బిల్లు ఇవ్వాలన్నారు. రైతులు ఈ బుల్లు ను పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపరచుకోవాలన్నారు. మండలంలో వరి సాగు అధికంగా ఉంటుంది కాబట్టి మొలక శాతం నిర్ధారించుకున్న తర్వాత మాత్రమే రైతులకు విత్తనాలు విక్రయించాలని దుకాణదారులకు తెలిపారు. వ్యవసాయ శాఖ ద్వారా అనుమతి పొందిన లైసెన్స్ కలిగిన డీలర్ల వద్ద మాత్రమే రైతులు విత్తనాలను కొనుగోలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, దమ్మపేట ఎస్ ఐ సాయి కిషోర్ రెడ్డి తనిఖీలో పాల్గొన్నారు.




## రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందించాలి

అశ్వారావుపేట టౌన్, మే 30 ప్రభాతవార్త:



రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందించాలని ఎఐయుఎస్ రాష్ట్ర అధ్యక్షులు కెచ్చెల రంగారెడ్డి, సిపిఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గోకినేపల్లి ప్రభాకర్‌లు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఓ ప్రకటనలో వారు మాట్లాడుతూ ఈ ఏడాది వానాకాలం సాగు సీజన్‌కు వర్షాలు సకాలంలో పడతాయని నిపుణులు చెబుతుండగా రైతులు ఆనందంగా సాగుకు సిద్ధమోతున్నారని అన్నారు. గత నష్టాలు, కన్నీళ్ళు దిగమింగుకొని పనులు మొదలు పెడుతున్న క్రమంలో ప్రభుత్వాలు రైతులకు సహకరించాలని అన్నారు. వ్యవసాయ రంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు తాకట్టు పెట్టే ప్రయత్నంలో రైతులను, వ్యవసాయ రంగాన్ని విస్మరిస్తున్నాయని అన్నారు. రైతుల గురించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నిగొప్పలు చెబుతున్నా వారికి అంత సహకారం లేకపోవడం, రైతు వ్యతిరేక విధానాలతోనే సాగు సంక్షోభం, రైతుకు నష్టాలు తలెత్తుతున్నాయని అన్నారు. కావున ప్రభుత్వాలు రైతులకు సకాలంలో రుణాలు, ఉచితంగా ఎరువులు, పనిముట్లు, విత్తనాలు సరఫరా చేయాలని లేని ఎడల రైతాంగం తరపున ఉద్యమాలు చేయనున్నట్లు తెలిపారు.

## నకిలీ విత్తనాలు పట్ల అప్రమత్తంగా ఉండాలి

**- ఎమ్మెల్యే జారె ఆదినారాయణ**

అశ్వారావుపేట రూరల్, మే 30 ప్రభాతవార్త:



రైతులు నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలి అని స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పేర్కొన్నారు. శుక్రవారం అశ్వారావుపేట ప్రాథమిక సహకార పరిమితి సంఘం ఆధ్వర్యంలో రైతులకు 50 శాతం సబ్సిడీతో జనుము, జీలుగు విత్తనాలు పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జారె చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు భూసారం పెంచి వారి పెట్టుబడి ఖర్చులు తగ్గి లాభదాయకమైన వ్యవసాయానికి చేయూతనివ్వాలని రాష్ట్ర ప్రభుత్వం 50 సబ్సిడీతో పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్ని రంగాల్లో తోడ్పాటును అందిస్తోందని నాయకులు అధికారులు కూడా రైతుల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. త్వరలోనే విశాల సహకార పరిమితి సంఘం ఆధ్వర్యంలో నాణ్యమైన వరి విత్తనాలు పంపిణీ చేస్తుందన్నారు. అవసరమున్న అర్హులైన రైతులు సమీప సహకార సంఘాన్ని సంప్రదించాలని కోరారు. నకిలీ విత్తనాలతో మోసపోకుండా జాగ్రత్త వహించాలని, అధికారులు కూడా నకిలీ విత్తనాల కట్టడికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో గల పేరాయిగూడెం గ్రామాన్ని సందర్శించి ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో నూతనంగా నిర్మించనున్న అదనపు భవనాల పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం నిర్దేశించిన నమూనాలోనే ఇల్లు నిర్మించుకోవాలి

**- లబ్ధిదారులు అత్యుత్సాహం చేస్తే ఇల్లు రద్దవుతోంది**

**- డిఇ, తహశీల్దార్, ఎంపిడిఓ విజ్ఞప్తి**

తల్లాడ, మే 30, ప్రభాతవార్త

ప్రభుత్వం నిర్దేశించిన నమూనాలోనే లబ్దిదారులు ఇల్లు నిర్మించుకోవాలని డిఇ బాలాజి, తహశీల్దార్ వి. సురేష్‌కుమార్, ఎంపిడిఓ ఏ. సురేష్‌బాబు విజ్ఞప్తి చేశారు. మండలంలో ఇందిరమ్మ ఇళ్ళ పథకం క్రింద మంజూరైన లబ్దిదారులు తల్లాడ పంచాయితీ కార్యాలయం వద్ద ప్రభుత్వం నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని లబ్దిదారులకు చూపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు ఇందిరమ్మ పేరుతో గృహాలు మంజూరు చేసిందని, మంజూరైన లబ్దిదారులందరూ గృహనిర్మాణ శాఖ అధికారులు నిర్దేశించిన లక్ష్యాలకనుగుణంగా లబ్దిదారులు ఇళ్ళు నిర్మించుకోవాలని, ఏ మాత్రం కొలతల్లో తేడాలొస్తే ఇల్లు రద్దవుతుందని గృహ నిర్మాణం పట్ల ప్రభుత్వం చాలా కఠినంగా ఉందని గుర్తు చేశారు. గృహాలు నిర్మించే గుత్తేదారులు కూడా అత్యాశకు పోవద్దని, ప్రభుత్వం లబ్దిదారులకు



ఉచితంగా అందించడం కోసం సిద్దంగా ఉందని గృహాలు మంజూరైన లబ్దిదారులకే ఉచితంగా అందించడం జరుగుతుందని, కొందరు అత్యాశకు పోయి ఇసుకతో అక్రమాలకు పాల్పడితే ఇల్లు రద్దవుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ఏఈ ఆత్మ, గిర్దావర్ ఖాజా మొయినుద్దీన్, తల్లాడ కార్యదర్శి ఎన్‌వివిఎయూ కృష్ణారావు, నాయకులు దుండేటి వీరారెడ్డి, గణేశుల రవి, బందారుపల్లి రామారావు పాల్గొన్నారు.

# ఫెర్టిలైజర్స్ దుకాణాలను తనిఖీ చేసిన టాస్క్ ఫోర్స్

**- నకిలీ విత్తనాలమ్మితే కఠిన చర్యలు తప్పవు**

**- మండల వ్యవసాయ అధికారి**



కారేపల్లి మే 30 ప్రభాతవార్త :

రైతులకు నకిలీ విత్తనాలు విక్రయం చేస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి బట్టు అశోక్ కుమార్ అన్నారు. మండల కేంద్రమైన కారేపల్లి లో శుక్రవారం నాలుగు ఫెర్టిలైజర్స్ దుకాణాలలో టాస్క్ ఫోర్స్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. టాస్ఫోర్స్ టీం లో మండల వ్యవసాయ అధికారి కారేపల్లి ఎస్సై ఎన్ రాజారాం పరిశీలించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ నిబంధనలకు అనుగుణంగానే డీలర్లు నడుచుకోవాలని లేకపోతే షాపులో లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. తనిఖీ చేసిన దుకాణాల్లో సక్రమంగానే విక్రయాలు జరుగుతున్నాయని తెలిపారు. వ్యవసాయ సీజన్ ఆరంభం అయినందున రైతులు నకిలీ విత్తనాలు కొని పంట నష్టం తెచ్చుకోవద్దని, నాణ్యమైన విత్తనాలు మాత్రమే ఉపయోగించి, వారి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని అన్నారు. మార్కెట్లో పలు రకాల విత్తనాల కంపెనీలు అందుబాటులో ఉన్నప్పటికీ ,లైసెన్స్ కలిగిన షాపులలో మాత్రమే విత్తనాలు కొనాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా రీసైకిల్డ్ సీడ్స్ వాడడం వల్ల, లేబుల్ లేనటువంటి సీడ్స్ వాడడం వల్ల పంట నష్టం వాటిల్లే అవకాశం ఉంది కావున నాణ్యమైనటువంటి, లైసెన్స్ కలిగిన, సర్టిఫైడ్ కంపెనీలు అందించేటువంటి విత్తనాలు మాత్రమే ఉపయోగించాలని అన్నారు. మీ పరిసరాల ప్రాంతాలలో ఎవరైనా కృత్రిమ కొరత సృష్టించినా , నిలువచేసినా, రసీదులు ఇవ్వకుండా అమ్మిన అలాంటి విత్తనాల షాపు యజమానులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అంతేకాకుండా షాప్ లేకుండా విత్తనాలు అమ్మినా ,రెసికిల్డ్ సీడ్స్ బ్లాక్ లో అమ్మినా, ఇతర రాష్ట్రాల నుంచి కానీ ,జిల్లాల నుంచి కానీ నకిలీ విత్తనాలను అందించినా అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

# అక్రమ మట్టి రవాణాను అరికట్టాలి

**- అటవీ గుట్ట భూములను కాపాడాలి**

**- ప్రశ్నించే గొంతులపై జరుగుతున్న దాడులను నియంత్రించాలి**

**- జాలే శ్రీను యాదవ్‌పై దాడి అమానుషం**

**- దాడికి పాల్పడిన జెసిబి యజమానిపై చర్యలు తీసుకోవాలి**

**- బిజెపి గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి భూక్య శ్రీను నాయక్ డిమాండ్**

కామేపల్లి, మే 30 ప్రభాతవార్త:

అక్రమ మట్టి రవాణాను అరికట్టి అటవీ గుట్ట భూములను కాపాడాలని బిజెపి గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి భూక్య శ్రీను నాయక్, పార్టీ రాష్ట్ర,జిల్లా నాయకు లు భాగం రంగారావు,పోలూరి రామచం ద్రయ్య,మండల అధ్యక్షులు జర్పల రా మారావు డిమాండ్ చేశారు. శుక్రవారం కామేపల్లిలో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని



ప్రసంగించారు. అక్రమ మట్టి రవాణా విషయమై ప్రశ్నించిన మద్దు లపల్లి గ్రామానికి చెందిన బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు జాలే శ్రీను యాదవ్ పై అదే గ్రామానికి చెందిన జెసిబి యజ మాని లక్ష్మీనారాయణ దూషించి దాడికి పాల్పడటం అమానుషమన్నారు.అతని పై చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ మేర కు పోలీస్ స్టేషన్ లో కూడా శ్రీను యాదవ్ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.అక్రమ మ ట్టి రవాణాను నియంత్రించాలని ప్రశ్నిస్తు న్న జాలే శ్రీను యాదవ్ పై దాడికి పాల్ప డటం హేయమైన చర్య అని అన్నారు. బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలపై దా డులకు పాల్పడితే ఎంత మాత్రం సహిం చమని అన్నారు.అధికార యంత్రాంగం అటవీ సంపదను,ప్రధానంగా గుట్టల భూములను కాపాడాలని డిమాండ్ చే శారు. పచ్చదనాన్ని పరిరక్షించి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు.

# పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

కారేపల్లి మే 30 ప్రభాతవార్త :



గ్రామాలలో వర్షాకాలం సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో పారిశుధ్యం వరద ప్రభావిత ప్రాంతాలు గుర్తించడంతోపాటు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీ ఓ రవీంద్ర ప్రసాద్ కోరారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం శుక్రవారం బాజీ మల్లయ్య గూడెం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్నటువంటి అధికారులు విపత్తు నివారణ కమిటీ సభ్యుల ప్రత్యేక సమావేశం పంచాయతీ కార్యదర్శి కొండపల్లి అనిల్ కుమార్ పర్యవేక్షణలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాబోవు వర్షాకాలంలో, తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇతర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ ఓ మాట్లాడుతూ గ్రామపంచాయతీలో ముందుగా ఖాళీ స్థలాలను గుర్తించడంతోపాటు కూలిపోయే ఇళ్లను పరిశీలించి తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రధానంగా పరిసరాల పరిశుభ్రత పై ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించాల్సి న అవసరం ఉందన్నారు. ఇళ్లలో నిల్వ ఉన్న నీరు తొలగించడం దోమల నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఇంటిలో ఇంకుడు గుంటలు ఉండేలా యజమానికి అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా పంచాయతీలలో ఏవైనా సమస్యలు తలెత్తితే ఎలా పరిష్కరించాలో సంబంధిత అధికారులతో చర్చించాల్సి ఉంటుందని తెలిపారు. మంచినీటి సరఫరాకు సంబంధించి ఏడు రకాల అంశాలను పరిశీలించాల్సి ఉంటుందన్నారు. అదేవిధంగా ప్రతి మంగళవారం శుక్రవారం గ్రామాలలో ఫ్రైడే ఫ్రైడే నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో, ,పల్లె దవాఖాన వైద్యాధికారి కళ్యాణి. ఆశా కార్యకర్త బానోత్ సుశీల ఐకెపి వివో ఏ టి రానమ్మ లరమల్టీ పర్పస్ సిబ్బంది సిహెచ్ చైతన్య,బోట్ నడిపే వ్యక్తి ఆర్ సంజీవరావుపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## కారేపల్లి, వైరా, కొణిజర్ల, ఏన్కూరు

# కానిస్టేబుల్ బాలాజీ కు సన్మానం

తల్లాడ, మే 30, ప్రభాతవార్త




తల్లాడ పోలీస్‌స్టేషన్ నుండి ఖమ్మం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కి బదిలీపై వెళుతున్న బాలాజీ కానిస్టేబుల్‌ను మాజీ ఎఎంసి వైస్ చైర్మన్ దూపాటి భద్రరాజు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎక్కిరాల సుదర్శన్, వి. రమేష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# మోదుగు ఆశీర్వాదంకు ఉద్యమకారుల నివాళులు

తల్లాడ, మే 30, ప్రభాతవార్త



అనారోగ్యంతో మృతిచెందిన మండల పరిధిలోని పాత పినపాక గ్రామానికి చెందిన తెలంగాణ తొలి ఉద్యమకారుడు నారపోగు ఆశీర్వాదంకు పలువురు ఉద్యమకారులు నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ కెవి. కృష్ణారావు, ఉమ్మడి ఖమ్మం జిల్లాల చైర్మన్ పసుపులేటి నాసరయ్య, ఉద్యమకారుల వైరా నియోజకవర్గ ఇంఛార్జి డాక్టర్ మాదినేని సత్యనారాయణ, వైరా టౌన్ వైస్ ప్రెసిడెంట్ పోశం శ్యామ్ కుమార్, శ్రావణ్, ఉద్యమకారుల సంఘం అధ్యక్షులు రావుల గోపి గౌడ్, ఉద్యమకారులు రవి, ప్రసాద్ తదితరులున్నారు.

# రామకృష్ణాపురంలో వికసించిన మే పుష్పం

**- తిలకించేందుకు ఆసక్తిని కనపరిచిన గ్రామస్తులు**

కామేపల్లి,మే 30 ప్రభాతవార్త:



కామేపల్లి మండలం రామకృష్ణాపురం గ్రామంలో గుడిపూడి సాంబశివరావు, అనంతలక్ష్మి దంపతుల నివాస గృహంలో శుక్రవారం మే పుష్పం వికసిం చింది. ఏడాదికి ఒకసారి అరు దుగా మే పుష్పం మే నెలలోనే వికసిస్తుంది. వారి ఇంటి ఆవర ణంలో పూల తోటలో మే పు ష్పం వికసించింది. దీంతో మే పుష్పం ను తిలకించేందుకు మహిళలు, గ్రామస్తులు, రైతు లు,యువజనలు ఆసక్తిని కన బరుస్తున్నారు.ఇంటి ఆవరణ లో పచ్చని ఆహ్లాదకర వాతావ రణం కొరకు పూల మొక్కలను సాంబశివరావు, అనంతలక్ష్మి దంపతులు పెంచి ఆదర్శంగా నిలవడం పట్ల గ్రామస్తులు వా రిని అభినందించారు.

# 2025 - 26లో జిల్లాలో లక్ష మందికి కంటి పరీక్షలు చేయించడమే లక్ష్యం

- లయనిజం అంటే సేవ
- లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ మదనమోహన్ రేపాల

కల్లూరు, మే 30, (ప్రభాతవార్త):







లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సర్వీస్ కార్యక్రమాలలో భాగంగా జిల్లాలో లక్ష మందికి కంటి చూపు పరీక్షలు చేయించడం, ఒక లక్ష మందికి షుగర్ స్క్రీనింగ్ పరీక్షలు చేపించడం, అవసరమైన మూడు లక్షల మందికి ఆహారాన్ని అందించడం, 202526 సంవత్సరంలో లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ మదనమోహన్ రేపాల అన్నారు. శుక్రవారం కల్లూరులో ప్రైవేట్ రెస్టారెంట్ నందు జిల్లా 320ఈ రీజియన్ 6 చైర్ పర్సన్ (డిప్యూటీ గవర్నర్) చలువాది నగేష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన పిఎస్టి, జిఏటి స్కూలింగ్ వర్క్ షాప్ లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జిల్లాలో నూతనంగా ఏర్పాటైన పి ఎస్ టి, జిఏటి సభ్యులకు వారి యొక్క అధికారాలు, బాధ్యతలు, విధులను గురించి వివరించడం జరిగిందని సంవత్సరంలో జిల్లా అన్ని రంగాలలో ఒక మల్టిపుల్ ఇంటర్నేషనల్ లో ముందుండే విధంగా పట్టుదలకు సేవా కార్యక్రమాలు చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఆయన వివరించారు. ఎక్కువ క్లబ్ ల స్థాపన, మెంబర్షిప్ పెంచడం, సర్వీస్ పాయింట్ జిల్లాలో సేకరించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన ఈ సందర్భంగా తెలిపారు. లయనిజం అంటేనే సేవా అని సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరు చురుకుగా పాల్గొనే విధంగా కృషి చేయాలన్నారు. జిల్లా ఎలెక్ట్ గవర్నర్ మదన్మోహన్ రేపాల వివాహ వార్షికోత్సవ వేడుక ఘనంగా ఈ సందర్భంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ గవర్నర్లు, కేబినెట్, ఆఫీసర్స్, జోన్ ఛైర్పర్సన్ , జిల్లాలో నూతనంగా ఎన్నికైన పి ఎస్ టి, జిఏటి సభ్యులు దమ్మపేట లయన్స్ క్లబ్, సత్తుపల్లి లయన్స్ క్లబ్, విఎమ్ బంజర లయన్స్ క్లబ్ వైరా, తల్లాడ, బోనకల్, ఖమ్మం, నల్గొండ, అశ్వారావుపేట, సూర్యాపేట లయన్స్ క్లబ్ లు మొదలగు క్లబ్ ఆఫీసర్స్, కల్లూరు లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ కొప్పరపు నరసింహారావు, ఇందోజు రమేష్, కిన్నెర ఆనందరావు, దారా శ్రీనివాస్, దారా సురేష్, రాయల మురళీధర్ రావు, రాయల సత్యనారాయణ, దోసపాటి బ్రదర్, నాగుబండి శ్రీనివాసరావు, గుర్రం శ్రీనివాసరావు, జి. అప్పల నాయుడు, చుండూరు శ్రీనివాసరావు, పెనుగొండ ఉపేందర్ తదితర లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.




## ఇందిరమ్మ పాలనలోనే పేదలకు సంక్షేమ పథకాలు...

- బీసీ కమ్యూనిటీ హాల్ శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే

సత్తుపల్లి మే 30 (ప్రభాతవార్త :



పేదలకు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అందించడంలో ఇందిరమ్మ పాలనలోనే సాధ్యమని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద అన్నారు. సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కొమ్మేపల్లి ఆర్ అండ్ ప్యాకేజీ నివాస గృహాల్లో సింగరేణి సంస్థ సౌజన్యంతో 70 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించే కమ్యూనిటీ హాల్ కు ఎమ్మెల్యే శుక్రవారం భూమి పూజ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సింగరేణిలో భూములు కోల్పోయి నా నిర్వాసితులకు సింగరేణి సంస్థ సహాయ సహకారాలతో మూడేళ్ల క్రితం ఇల్లు నిర్మించుకొని ఉంటున్నటువంటి గ్రామస్తులకు గతంలో పాలించిన పాలకులు ఎవరో పట్టించుకోకపోయేటప్పటికి వీళ్ళఅలానా పాలన చూసేవారు లేక అన్ని రకాల ఇబ్బందులు పడుతున్న కొమ్మేపల్లి వాసులకు ఎమ్మెల్యే అండగా ఉండి ఇటీవల కాలంలో దేవాలయం, క్రిస్టియన్ లకు చర్చ, బీసీలకు కమ్యూనిటీ ఆలు మంజూరు చేయటం జరిగిందని ఆమె అన్నారు. కొమ్మేపల్లి కాలనీవాసులు డ్రైనేజీల్లో శుభ్రం చేయక, స్మశాన వాటిక లేక చేసిన సిసి రోడ్లు పగిలిపోయి తదితర వాటి గురించి పడుతున్న ఇబ్బందులను ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ రాఘమై దృష్టికి గ్రామస్తులుతీసుకురావడం జరిగింది. పక్కనే ఉన్న సింగరేణి జనరల్ మేనేజర్ సాలెం రాజును గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులు పరిష్కరించాలని ఎమ్మెల్యే డాక్టర్ మట్ట రాగమయి దయానంద ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్, సింగరేణి జీఎం ఎం సాలెం రాజు జె.వి.ఆర్ కిష్టారం ప్రాజెక్ట్ అధికారులు ఎన్విఆర్ ప్రహ్లాద్, ఎం.వి నరసింహారావు, ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, డిసిసిబి డైరెక్టర్ చల్లగుల్ల కృష్ణయ్య, సివిల్ ఎస్ ఈ ఏ రవికుమార్ కాంగ్రెస్ ప్రముఖులు చల్లగుల్ల నరసింహారావు పట్టణ అధ్యక్షులు గాదె చెన్నారావు పింగళి శామ్యూల్ ఇమ్మినేని ప్రసాదు నరుకుల్ల అప్పారావు, నరుకుల్లా రవి, కొమ్మేపల్లి గ్రామస్తులు షేక్ షాపి షేక్ సుభాని షేక్ ఇస్మాయిల్ ఎస్.కె యాసిన్ ఎస్ కే బాజీ అధికారులు అనధికారులు హాజరైన వారిలో ఉన్నారు.

# గంజాయిపై ఉక్కు పాదం మోపిన ముదిగొండ పోలీస్‌లు

- గంజాయి చాక్లెట్ స్వాధీన పరుచుకున్న పోలీసులు
- పోలీసుల పెట్రోలింగ్లో దొరికిన గంజాయి నిందితులు
- రూ.15 వేలు విలువచేసే 280 చాక్లెట్లను పోలీసులు స్వాధీనం
- సీఐ మురళి

ప్రభాతవార్త ముదిగొండ:



గంజాయి చాక్లెట్లను గ్రానైట్ పరిశ్రమ ప్రాంతంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఓ దుకాణంలో విక్రయిస్తూ పెట్రోలింగ్ నిర్వహించే పోలీసులకు దొరికిన వైనం మండల కేంద్రమైన ముదిగొండ గ్రానైట్ పరిశ్రమ ప్రాంతంలో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఉమేష్ కుమార్,రింకు కుమార్ అనే వారు ముదిగొండ ఆర్కే గ్రానైట్ పరిశ్రమలో వర్కర్లుగా పనిచేస్తున్నారు.మీరు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో మిశ్ర అనే పట్టణంలో బస్టాండ్ పక్కనే గల వికాస్ అనే కిరాణా షాపులో 13 గంజాయి ప్యాకెట్లు కొనుగోలు చేసి అక్కడి నుంచి తీసుకొచ్చి ముదిగొండ చెందిన పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న గుమ్మడిదడ సత్యనారాయణ అనే కిరాణా షాపులో విక్రయించారు.ట్రైని ఎస్సై గుమ్మడి హరిత తన సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తూ సత్యనారాయణ కిరాణా షాప్ దగ్గరికి వెళ్లగా పోలీసులు చూసి గంజాయి నిందితులు పారిపోతుండగా ట్రైని ఎస్సై హరిత తన సిబ్బందితో చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకొని వారి వద్ద ఒక్కొక్క ప్యాకెట్ ఉన్న 280 చాక్లెట్లతోపాటు,ముద్దాయిల వద్ద ఉన్న మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ వడ్డేపల్లి మురళి తెలిపారు.డ్రగ్స్ ను విక్రయించిన,సేవించిన చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన ఎవరిని ఉపేక్షించే లేదని,పిడి యాక్టును అమలు చేసి చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటామని సిఐ మురళి హెచ్చరించారు.

## ఆపదమిత్ర శిక్షణ పొందిన కామేపల్లి ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు

- సర్టిఫికెట్లు అందజేసిన కలెక్టర్,డిఆర్డిఏ పిడి



కామేపల్లి, మే 30 (ప్రభాతవార్త):



కామేపల్లి మండల పరిధిలోని కొమ్మినేపల్లి, కామేపల్లి, నెమ లిపురి గ్రామపంచాయతీలకు చెందిన ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెం ట్లు మాన్సింగ్, అజ్మీర రమేష్, సపావట్ పరిష్య ఆపదమిత్ర శిక్షణ పొందారు.జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 12 రోజులు పాటు వారు ఆపదమిత్ర శిక్షణ పొందారు.శిక్షణ పొంది న వారికి జిల్లా కలెక్టర్, డిఆర్డిఏ పీడీ లు శుక్రవారం ట్రైనింగ్ సర్టిఫికెట్లను అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ బాధ్యతగా పనిచేస్తామని, ఆపదమిత్ర వృత్తికి వన్నె తెచ్చి ఆదర్శంగా నిలుస్తామని స్పష్టం చేశారు.తమ కృషికి ప్రతి ఒక్క రు సహకరించాలని వారు కోరారు.

## డీఎస్సీ 2008 ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు మంజూరు చేయాలి

కామేపల్లి, మే 30 (ప్రభాతవార్త):



హైదరాబాద్ సెక్రటేరియట్ లో గిరిజన సంక్షేమ శాఖ జాయిం ట్ సెక్రటరీకి డీఎస్సీ 2008 ఉ పాధ్యాయుల జీతాలు వెంటనే మంజూరు కోసం జిల్లా ట్రెజరీ శాఖలకు ఆదేశాలు ఇవ్వాలని టీఎస్ టిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షు లు బానోత్ వీరు నాయక్,రా ష్ట్ర ప్రధాన కార్యదర్శి రాము లు నాయక్ శుక్రవారం కలిసి విన్నవించారు.దీంతో అందరికీ జీతాలు మంజూరు అయ్యా యని దీంతో ఎవరు అధైర్య పడవద్దని స్పష్టం చేసినట్లు ఈ సందర్భంగా వారు తెలిపా రు.ఈ కార్యక్రమంలో నాయకు లు కిషన్ రాథోడ్,బాబూలాల్, గోపాల్ తదితరులు పాల్గొన్నా రు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే దంపతులు

సత్తుపల్లి మే 30 (ప్రభాతవార్త :



సత్తుపల్లి విశ్వశాంతి విద్యాలయం కరస్పాండెంట్ పసుపులేటి నాగేశ్వరరావు, ఉమా మహేశ్వరి దంపతుల కూతురు పసుపులేటి కావ్య వివాహము ఇటీవల జరిగింది. ఎమ్మెల్యే డాక్టర్ మట్ట రాగమయి దయానంద్ రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ లు శుక్రవారం స్థానిక రాజీవ్ రోడ్డులో నివాసముంటున్న నాగేశ్వరరావు స్వగృహానికి వెళ్లి నూతన వధూవరులు కావ్య, మహేష్ దంపతులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, సృజన, లైవ్ స్వచ్ఛంద సంస్థ ల నిర్వాహకులు గార్లపాటి రామకృష్ణ, బొల్లేపల్లి మధుసూదన రాజు, నీలాద్రీశ్వర ఆలయ ట్రస్ట్ డైరెక్టర్ రామిశెట్టి శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు రామిశెట్టి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి..

### - మత్స్యకార మహిళల నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు

**కూసుమంచి, మే 30 (ప్రభాతవార్త) :**



మత్స్య పరిశోధన స్థానం, పాలేరు, పీవీ నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయము హైదరాబాదు వారి ఆధ్వర్యంలో, మత్స్య శాఖ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాదు వారి ఆర్థిక సహకారంతో తెలంగాణ మత్స్యకార మహిళలకు జరుగుతున్న విలువ ఆధారిత మత్స్య ఉత్పత్తులు, చేప, రొయ్యల పచ్చడి తయారీ విధానమ్ము అను అంశంపై 3 రోజుల నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం శుక్రవారం 2వ రోజు విజయవంతంగా ముగిసింది. కార్యక్రమంలో ఖమ్మం, నిజామాబాద్, జగిత్యాల, సూర్యాపేట, హైదరాబాద్, వికారాబాద్, ఖమ్మం జిల్లాల (6 జిల్లాలు) నుంచి 30 మంది మత్స్య కార మహిళలు హాజరైనారు. ఈ రోజు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తమిళనాడు రాష్ట్రానికి చెందిన నేషనల్ ఆగ్రో ఫౌండేషన్ జాయింట్ డైరెక్టర్ పీ. ప్రకాష్ హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..చైనా, అమెరికా మొదలగు ఇతర దేశాలతో పోల్చుకుంటే మన దేశంలో చేపలతో తయారయ్యే విలువ ఆధారిత ఉత్పత్తులు చాలా తక్కువగా ఉత్పత్తి జరుగుతుందని, రాబోయే



కాలంలో చేపల విలువ ఆధారిత ఉత్పత్తులకు మరింత డిమాండ్ ఉంటుందని తెలిపారు. కావున తెలంగాణ రాష్ట్రంలో ఉన్న మన మత్స్యకార మహిళలు ఈ విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేయడంలో మరింత నైపుణ్యాన్ని అందిపుచ్చుకొని తమతమ జీవితాల్లో గొప్ప స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రత్యేక అతిథిగా విచ్చేసిన టి. సునీల్ కుమార్ స్టేట్ కోఆర్డినేటర్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, నేషనల్ ఆగ్రో ఫౌండేషన్, చెన్నై తమిళనాడు, మాట్లాడుతూ..ఇలాంటి ట్రైనింగ్ ప్రోగ్రామ్స్ చాలా అరుదుగా ఉంటాయని తెలుపుతూ మీలాంటి మత్స్యకార మహిళలు తూచా తప్పకుండా ఈ ప్రోగ్రామ్స్ ను సద్వినియోగపరుచుకొని, కొంతమంది ఒక గ్రూప్ గా ఏర్పడి చేపల పచ్చళ్ళు, రొయ్యల పచ్చళ్ళు ఇతర విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేసి వేరే రాష్ట్రాలకు, వేరే దేశాలకు ఒక బ్రాండ్ గా అమ్మేలా తయారు కావాలని ఆకాంక్షించారు. సీహెచ్. పూర్ణ చందర్ ఫిషరీస్ ఫీల్డ్ ఆఫీసర్, డిపార్ట్మెంట్ ఆఫీసర్స్, జనగామ జిల్లా, తెలంగాణ రాష్ట్రం, డాక్టర్ ఎం. శ్యామ్ ప్రసాద్, సీనియర్ శాస్త్రవేత్త హెడ్ మాట్లాడుతూ...విలువ ఆధారిత మత్స్య ఉత్పత్తులు, చేప, రొయ్యల పచ్చడి తయారీ విధానము అను అంశంపై జరుగుతున్న ఇలాంటి శిక్షణ కార్యక్రమాలను మన తెలంగాణ రాష్ట్ర మత్స్యకార మహిళలకు అందించటానికి మా శాస్త్రవేత్తలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా నైపుణ్యం గల శాస్త్రవేత్తలను, మంచి నైపుణ్యం ఉన్న ప్రొఫెషనల్ వ్యక్తులను పిలిపించి ఒక ప్రణాళిక బద్ధంగా షెడ్యూల్ను తయారుచేసి మీకు ఈ శిక్షణను అందించడం జరుగుతోంది కావున మీరందరూ తూచా తప్పకుండా ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు. మరో అతిథి ఎన్.లావణ్య మాట్లాడుతూ..చేపలు రొయ్యల పచ్చళ్ళ తయారీలో ఉపయోగించే వివిధ రకాల ముడి పదార్థాలను గురించి వివరిస్తూ క్షేత్రస్థాయిలో మత్స్యకార మహిళల చేత కరివేపాకు చేపల కారపు పొడి, పల్లీల చేపల కారపు పొడి, చేపల పకోడీ, చేపల సూపు మొదలగు విలువ ఆధారిత ఉత్పత్తులను వారి స్వ హస్తాలతో తయారు చేయించి చూపారు.




## రూ.37వేలు అదనంగా పెరిగిన కౌలు వేలం ఆదాయం

**నేలకొండపల్లి, మే 30 ప్రభాతవార్త:**



నేలకొండపల్లి గ్రామం లోని శ్రీఉత్తరేశ్వరస్వామి దేవాలయం నందు శ్రీస్వామి వారి దేవాలయం భూముల కౌలు బహిరంగ వేలంపాటను శుక్రవారం నిర్వహించగా కౌలు ఆదాయం అదనంగా దాదాపు రూ.37వేలుకు పెరిగిందని దేవాదాయశాఖ, ఆదేవస్థానం కార్యనిర్వాహణాధికారి కే.శ్రీకాంత్ తెలిపారు. దేవాలయం భూములు సర్వే నెంబర్ 60,69 విస్తీర్ణం 3ఎకరాల 29 కుంటలు భూమిని బహిరంగ కౌలు వేలంపాట నిర్వహించారు. దీంతో హెచ్చుపాటగా రూ.67వేలు అదనంగా వచ్చిందని ఆయన చెప్పారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది కౌలు వేలంపాట అదనంగా రూ.37వేలకు పెరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ పర్యవేక్షకులు వెంకటేశ్వరరావు, ఆలయ అర్చకులు శివయ్య, గ్రామ పెద్దలు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

## పేద పిల్లల కోసం నిర్మించనున్న నూతన గదులకు శంఖుస్థాపన

**నేలకొండపల్లి, మే 30 ప్రభాతవార్త:**



నేలకొండపల్లి లోని జామా మసీదు కమిటి ఆధ్వర్యంలో పేద పిల్లలు చదువుకునేందుకు నిర్మించనున్న నూతన గదులకు శుక్రవారం శంఖుస్థాపన చేసారు. దాత ఎండి వహీద్ పూజలు చేసారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నెల్లూరి భద్రయ్య, మామిడి వెంకన్న, మజీదు కమిటీ అధ్యక్షుడు మహబూబ్అలీ, ప్రతినిధులు షేక్.సుభాన్మియా, ఎండి షాకీర్, షేక్.సత్తార్, షేక్.రసూల్, రఫీ, హుస్సేన్, జానిమియా, షేక్.షరీఫుద్దీన్, అహ్మద్, యాకూబ్, బాబు, ముస్తఫా, షేక్.రహీం తదితరులు పాల్గొన్నారు.

## మద్ది ఉపేందర్ రెడ్డి మృతికి సంతాపం.!

**తిరుమలాయపాలెం, మే 30 (ప్రభాతవార్త) :**



తిరుమలయపాలెం మండలం రాజారం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు మద్ది ఉపేందర్ రెడ్డి, గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసి, ఆయన పార్థీవదేహానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసిన బి.ఆర్.ఎస్ పార్టీ మండల నాయకులు కొప్పుల ఉపేందర్ రెడ్డి మరియు గ్రామ శాఖ అధ్యక్షులు రంగాపురం బాలకృష్ణ గౌడ్. ఈ కార్యక్రమంలో,సామ వెంకట రెడ్డి, బాణాల బసవ రెడ్డి, ఏర్పుల మల్లయ్య, రంగాపురం రవి, మందుల ఎల్లయ్య, ఏనుగ సురేందర్ రెడ్డి, సామ సురేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల రెండవ దశ 'దోస్త్' ప్రక్రియ ప్రారంభం

### -ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ ఆలేటి పరంజ్యోతి వెల్లడి

**నేలకొండపల్లి, మే 30 ప్రభాతవార్త:**



2025-26 విద్యా సంవత్సరంకు గాను బిఏ, బిఎస్సీ, బికామ్ వంటి డిగ్రీ కోర్సుల్లో చేరేందుకు డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) నోటిఫికేషన్ రెండవ దశ విడుదల అయ్యిందని నేలకొండపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలప్రిన్సిపాల్ డాక్టర్ ఆలేటి పరంజ్యోతి వెల్లడించారు. శుక్రవారం నేలకొండపల్లి నందు స్థానిక విలేకరులతో డాక్టర్ ఆలేటి పరంజ్యోతి మాట్లాడుతూ పాలేరు నియోజకవర్గం లోనే ఏకైక ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో ఈ ప్రాంత విద్యార్థుల కోసం పది ఎకరాల స్థలంలో అన్ని వసతులతో కూడిన విశాలమైన భవన సముదాయం, ల్యాబ్స్, అత్యంత అనుభవం కలిగిన అధ్యాపక బృందం, కళాశాల ఆవరణలో ఉచిత బాలుర, బాలికల హాస్టల్ వసతి సదుపాయంలను ప్రభుత్వం కల్పించిందని ఆమె చెప్పారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, మేధావులు అందరూ తమ సహకారాన్ని అందించాలని ఆమె కోరారు. స్థానిక ప్రభుత్వ కళాశాల దోస్త్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ దోస్త్ రెండవ దశ ప్రక్రియ జూన్ 8వ తేదీ వరకు రూ.400లు చెల్లించి 'దోస్త్'లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని ఆమె చెప్పారు. రెండవ దశ దోస్త్ సీట్ల కేటాయింపు జూన్ 9వ తేదీన ప్రకటిస్తామని ఆయన చెప్పారు. దోస్త్ ప్రక్రియ నమోదు కొరకు విద్యార్థి ఆధార్ లింక్ అయిన మొబైల్ నెంబర్, ఆధార్‌కార్డు జీరాక్స్, పదవ తరగతి మెమో, ఇంటర్ మెమో, ఆరు నుండి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, మీసేవా ద్వారా కుల ధృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రం (2024-ఏప్రిల్1వ తేదీ తర్వాత) తీసుకున్నది మాత్రమే చెల్లుబాటు అవుతుందని ఆయన చెప్పారు. కళాశాలలో దోస్త్ ఆన్‌లైన్ సేవలు ఉచితంగా చేయబడతాయని ఆయన చెప్పారు. మరిన్ని వివరాలకు కోసం ఈ క్రింది సెల్ నెంబర్ 9885079090, లేదా 9550272092 లేదా ప్రభుత్వ డిగ్రీ కళాశాల కార్యాలయంలో సంప్రదించాలని ఆకళాశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ ఆలేటి పరంజ్యోతి తెలిపారు.

## గౌతమీ జిల్లా సమాఖ్య అధ్యక్షురాలుగా కుక్కల సంధ్య ఎన్నిక

**నేలకొండపల్లి, మే 30 ప్రభాతవార్త:**



గౌతమీ జిల్లా సమాఖ్య అధ్యక్షురాలుగా నేలకొండపల్లి మండల మదర్ థెరిస్సా సమాఖ్య అధ్యక్షురాలు కుక్కల సంధ్య శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికైనారు. ఈ మేరకు నూతనంగా జిల్లా సమాఖ్య అధ్యక్షురాలుగా ఎన్నికైన కుక్కల సంధ్యకు పలువురు ఏపిఎంలు, సిసిలతో పాటు ఏపిఎంఆర్ శ్రీనివాసరావు, సిసి పెద్దపాక వెంకటేశ్వరరావు, సురేఖ, మంగమ్మ, పి.నాగమణి, వై.నాగమణి, వెంకటరావమ్మ, మోహన్, ఎంఎస్ అకౌంటెంట్ జయమ్మ, లక్ష్మీ తదితరులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

# పులిగుండాల ఎకో టూరిజంకు రూ.500 కోట్లు...

-పులిగుండాల ప్రాజెక్టును సందర్శించిన మంత్రి,ఎమ్మెల్యే, కలెక్టరు, సి సి ఎఫ్

-అభివృద్ధి పనులకు 2 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం

-పోడు పేరుతో అడవులు నరికితే అధికారులను సర్వీస్ నుంచి రిమూవ్ చేయండి...

-సి సి ఎఫ్ ను ఆదేశించిన మంత్రి తుమ్మల....



**సత్తుపల్లి మే 30 ప్రభాత వార్త :**
సత్తుపల్లి ఫారెస్ట్ డివిజన్ పరిధిలోని పెనుబల్లి కల్లూరు మండలాల మధ్య దట్టమైన అడవుల్లో ఉన్న పులిగుండాల ప్రాజెక్టును ఎకో టూరిజం కింద దేశంలోనే రోల్ మోడల్ గా పర్యాటకులు ఆకర్షించే విధంగా తయారు చేయాలని జిల్లా కలెక్టర్ ముజుముల్ ఖాన్ భద్రాద్రి ఫారెస్ట్ జోన్ సిసిఎఫ్ బీమా నాయక్ లను రాష్ట్ర వ్యవసాయ సహకార జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. నియోజకవర్గ పరిధిలోని పెనుపెల్లి కల్లూరు మండలాల సరిహద్దుల్లోని 30 వేల ఎకరాల విస్తీర్ణంలో దట్టమైన అడవుల్లో విస్తరించి ఉన్న పులిగుండాల ప్రాజెక్టును ప్రధాన రహదారి నుండి పది కిలోమీటర్ల పొడవునా అడవిలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్ట రాగమయి దయానంద్ ఖమ్మం కలెక్టర్ ముజుముల్ ఖాన్ భద్రాద్రి ఫారెస్ట్ జోన్ సిసిఎఫ్ బీమా నాయక్ ఖమ్మం డిఎఫ్ఓ సిద్ధార్థ విక్రమ్ సింగ్ లతో కలిసి రాష్ట్ర వ్యవసాయ సహకార మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు శుక్రవారం పులిగుండాల ప్రాజెక్టును సందర్శించారు. అనంతరం ప్రాజెక్టు సమీపంలో ఫారెస్ట్ అధికారులు ఏర్పాటు చేసిన స్థావరం వద్ద మంత్రి తుమ్మల నాగేశ్వరావు విలేకరులతో మాట్లాడుతూ పులిగుండాల ఎకో టూరిజం ఏర్పాటు చేయటానికి ప్రభుత్వం 500 కోట్ల రూపాయలు మంజూరు చేసిందని, ప్రస్తుతంపనులు కోసం రెండు కోట్ల రూపాయలు రిలీజ్ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా పులిగుండాల ప్రాజెక్టు ప్రదేశంలో 30 వేల ఎకరాల దట్టమైన అడవి ప్రాంతం ఉండటం మూలంగా యిక్కడకు దేశంలోనే ఇతర రాష్ట్రాల నుంచి పర్యాటకులు వచ్చే విధంగా ఎకో టూరిజన్ని తీర్చిదిద్దాలని మంత్రి తుమ్మల కలెక్టరు అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. పులిగుండాల ప్రాజెక్టుకు సుదీర్ఘ చరిత్ర ఉందని కాకతీయ కాలంనాటి కోట, వీరభద్ర స్వామి దేవాలయం, పల్లెల బావి, పాలపిట్ట వాచ్ టవర్,ఇలా ఎన్నో చరిత్ర గల ఆనవాళ్ళతోపాటు ఇక్కడ నుంచి వరంగల్ వరకు ఆనాడు సొరంగం ఏర్పాటు ఉన్నదని పూర్వీకులు చెబుతుంటారని మంత్రి తుమ్మలన్నారు. చరిత్ర గల ఇలాంటి పకృతి అందాలను ఆస్వాదించాలి తప్ప, ధ్వంసం, చేస్తే చేతులారా మన పిల్లల్ని మనం హత్యచేసినంత పాపమని మంత్రి తుమ్మల అన్నారు. ఈ దట్టమైన అడవిలో 120 రకాల పక్షులు ఉన్నాయని, పకృతిని పిల్లలకి దారా దత్తం చేద్దామని ఈ సందర్భంగా మంత్రి తుమ్మల అన్నారు.



**అడవిని నరికితే అధికారులను రిమూవ్ చేయండి...**

పకృతి సంపదను నాశనం చేయాలని ఎవరైనా పోడు పేరుతో నరికినట్లయితే సంబంధిత అటవీ శాఖ అధికారులను సర్వీసు నుంచి రిమూవ్ చేయాలని భద్రాద్రి ఫారెస్ట్ జోన్ సిసిఎఫ్ భీమా నాయక్ ను మంత్రి తుమ్మల నాగేశ్వరావు ఆదేశించారు. అటవీ సంపదను నరికితే దేశ ద్రోహులు కన్నా ఎక్కువ నేరం చేసిన వారు అవుతారని, ఈ సంపదను రక్షించుకోకపోతే ఢిల్లీలో ఆక్సిజన్ లేక కొనుక్కునే పరిస్థితి అక్కడ ప్రజలకు ఉందని అలాంటి పరిస్థితి మనకు రాకుండా జాగ్రత్త పడాలని మంత్రి తుమ్మల గుర్తు చేశారు. దేశంలో ఎక్కడా లేనటువంటి టూరిజం ప్రదేశం తెలంగాణ రాష్ట్రంలో ఎక్కువ విస్తీర్ణంలో ఉన్నదని, టూరిజం ఉంటేనే దేశాలు అభివృద్ధి చెందుతాయని ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరావు సూచించారు. పులి గుండాల ప్రాజెక్టుతో పాటు దట్టమైన అడవిలో అన్న నీలాద్రిశ్వర ఆలయం కూడా టూరిజం కింద అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానందు మంత్రి తుమ్మలకు సూచించారు. పులిగుండాల ప్రాజెక్టు గురించి మ్యాప్ లో ఉన్న చిత్రాలను ఖమ్మం డిఎఫ్ఓ సిద్ధార్థ విక్రం సింగ్ ప్రజలకు చూపిస్తూ వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు జావిద్, జిల్లా కలెక్టర్ ముజ్మల్ ఖాన్ భద్రాద్రి ఫారెస్ట్ జోన్ సిసిఎఫ్ భీమ నాయక్ ఖమ్మం డీఎఫ్ఓ సిద్ధార్థ విక్రం సింగ్ సత్తుపల్లి ఎఫ్ డి ఓ వి మంజుల సత్తుపల్లి తల్లాడ రేంజర్లు స్నేహలత, ఉమా, కల్లూరు ఆర్డీవో ఎల్ రాజేంద్ర గౌడ్ సత్తుపల్లి కల్లూరు ఏఎంసీ చైర్మన్లు దోమ ఆనంద్ బాబు భాగం నేరజా చౌదరి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు చల్లగుల్ల నరసింహారావు డిసిసిబి డైరెక్టర్ చల్లగుండ్ల కృష్ణయ్య ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు వందనపు సత్యనారాయణ దొడ్డ శ్రీనివాసరావు ఇమ్మినేని ప్రసాదు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నారావు పింగళి శామ్యూల్ అధికారులు అనాధికారులు పాల్గొన్న వారిలో ఉన్నారు.

# సమిష్టి కృషితో ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుకుందాం

- తాగునీరు, విద్యుత్, రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నాం
- రూ.3.58 కోట్లతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు

**కొత్తగూడెం, మే 30 – ప్రభాతవార్త:**
అధికారులు, ప్రజలు, ప్రజాప్రతినిధుల సహకారం, సమిష్టి కృషితో నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుకుందామని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. నియోజకవర్గ పరిధిలోని చుంచుపల్లి మండలం విద్యానగర్, వెంకటేశ్వర కాలనీ, రామాంజనేయ కాలనీ, ఎన్ కె నగర్, నంద తండా గ్రామపంచాయతీల పరిధిలో రూ.3.58కోట్ల ఈజీఎస్, సబ్ ప్లాన్ నిధులతో చేపట్టనున్న రోడ్లు డ్రైనేజి పనులకు శంకుస్థాపన, పూర్తయిన పనులకు ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిని శంకుస్థాపన, ప్రారంభోత్సవ సభల్లో కూనంనేని మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజావసరాలను గుర్తించి నిధుల మంజూరుకు కృషి జరుగుతోందని ప్రాధాన్యత క్రమంలో పనులను పూర్తిచేస్తున్నామని తెలిపారు. ప్రజలకు కావాల్సిన మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టిసారించామని, కనీస అవసరాలైన త్రాగునీరు, విద్యుత్, రోడ్లు, డ్రైనేజీలు వంటి వాటికి ప్రాధాన్యత కల్పిస్తున్నామని, ప్రజా సంక్షేమ పథకాలను అర్హులైన పేదలకు చేరవేస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి అధికారులతోపాటు, ప్రజలు దృష్టి సారించాలని, నాణ్యతతో పనులు జరిగేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉంటుందన్నారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిడివో శుభాషిణి, ఎమ్మార్వో కృష్ణ, వివిధ శాఖల అధికారులు, సత్యనారాయణ, నాగేందర్, రాయల వెంకటేశ్వర్లు, రవి, నర్సింహారావు, గుప్తా, వసంత, శ్రీనివాసరెడ్డి, రమేష్ సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, మండల కార్యదర్శి వాసిరెడ్డి మురళి, నాయకులు పొలమూరి శ్రీను, జక్రయ్య, భాగం మహేశ్వరరావు, భాగం మాధవరావు, రాంజీ, పౌల్, శ్రీనివాసరెడ్డి, బిక్కసాని నాగేశ్వర్రావు, నాని, అజయ్, బషీర్, యాకూబి, రతన్, వేదాద్రి, యాంఢ్ర మహేష్, నగేష్, , జమలయ్య, కృష్ణయ్య, రాజేష్, వీరు, కొండా ప్రసాద్, సూరమ్మ, కిట్టు, పిడుగు తదితరులు పాల్గొన్నారు.



# సత్ఫలితాలను ఇస్తున్న 'ఆపరేషన్ చేయూత'...

- చికిత్స కంటే నివారణే మేలు...
- నిషేదిత మావోయిస్టు పార్టీకి చెందిన (17) మంది దళసభ్యులు లొంగుబాటు
- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

**కొత్తగూడెం క్రైం, మే 30 – ప్రభాతవార్త:**
భద్రాద్రి కొత్తగూడెంజిల్లా పోలీసులు మరియు 81 అండ్ 141 సీఆర్పీఎఫ్ బెటాలియన్ అధికారులు ఆదివాసీ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం నిర్వహిస్తున్న "ఆపరేషన్ చేయూత" కార్యక్రమం ద్వారా లొంగిపోయిన సభ్యులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖ కల్పిస్తున్న సదుపాయల గురించి తెలుసుకుని, నక్సలిజాన్ని విడనాడి ఇకపై తాము కూడా కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంతమైన జీవితం గడపాలని నిర్ణయించుకొని వివిధ క్యాడర్లలో పనిచేస్తున్న (17) మంది నిషేదిత మావోయిస్టుపార్టీ సభ్యులు,





ఆరుగురు మహిళా సభ్యులు, ఏసీఎంలు ( 2 ) పార్టీ మెంబర్లు 4, మిలీషియా సభ్యులు 11 మంది ఎస్పీ ఎదుట జీవన స్రవంతిలో కలవడంజరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పూర్తి వివరాలను వెల్లడించారు... ఈ సంవత్సరం జనవరి 2025 నుండి ఇప్పటి వరకు వీరితో కలిపి 282 మంది మావోయిస్టు దళసభ్యులు వివిధ హోదాలలో ఈవీసీఎం 01, ఏసీఎంలు 13, పీఎంలు 32, మిలీషియా సభ్యులు 105, ఆర్పీసీ మెంబర్లు 33, డీఏకేఎంలు/ కేఏఎంఎస్‌లు – 47, సీఎంఎన్ మెంబర్లు 30, జీఆర్డీ మెంబర్లు 21 జనజీవన స్రవంతిలో కలిసి తగిన పునరావాస సౌకర్యాలను పొందడం జరిగినది.

ప్రస్తుతం సిపిఐ (మావోయిస్టు) సాయుధదళాల సంచారం తెలంగాణ చత్తీస్గడి రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలలో ఉన్నది. ఈ సరిహద్దు గ్రామాల ప్రజలు ఎట్టి పరిస్థితులలో మావోయిస్టు దళాలకు సహకరించకూడదు మావోయిస్టుల సమాచారము తెల్పినట్లయితే వెంటనే దగ్గరలోగల పోలీస్ స్టేషన్లలో గాని లేదా జిల్లా ఉన్న తాధికారులకుగాని తెలియజేయాలి. ఇలా ప్రజలు అందించిన సమాచారం ద్వారానే ఇటీవల ములుగు జిల్లాలో 20 మంది సాయుధ దళ సభ్యులను అరెస్టు చేయడం జరిగింది. అలాగే 12 ఆయుధాలను కూడా జప్తు జరిగింది.

**– చికిత్స కంటే నివారణి మేలు:**

జన జీవన స్రవంతిలో కలిసిన అజ్ఞాత సాయుధ దళ మావోయిస్టులకు తెలంగాణ ప్రభుత్వముతరపున పోలీస్ శాఖ వెను వెంటనే తగిన రివార్డును ఇవ్వడం జరుగుతుంది. ఛత్తీస్ ఘడ్ ప్రభుత్వం మరియు పోలీస్ శాఖ సహకారంతో అవసరమైన దీర్ఘకాలిక పునరావాస చర్యలు కూడా తీసుకొనబడును. మావోయిస్టు అజ్ఞాత సాయుధ దళాలు తెలంగాణ ప్రాంతంలో సంచరించినట్లయితే ఏ ఒక్క దళసభ్యుడు కూడా పోలీసు శాఖ తీసుకునే చట్టపరమైన చర్యల నుండి తప్పించుకోలేడు. దానికి ఉదాహరణ గత సంవత్సరం 2024లో ఇటీవలే వివిధ ప్రాంతాలలో కర్రిగుట్టలతో పాటు జరిగిన ఎదురుకాల్పులలో మావోయిస్టులు మొత్తం (31) మంది తమ విలువైన ప్రాణాలను కోల్పోవడాన్ని మనం మరువకూడదు. తెలంగాణ ఎన్నటికీ వీరికి ఆశ్రయం కాజాలదు. ఇక్కడ ప్రజలు చాలా చైతన్యవంతులు వారు కాలం చెల్లిన, ఆచరణాత్మకం కాని సిద్ధాంతాలను పరిగణలోకి తీసుకునే కాలం ఎప్పుడో చెల్లిపోయింది. మావోయిస్టులకు ఇప్పుడు చావోరేవో కంటే నివారణి మేలని గ్రహించాలి. అనుభవ పూర్వక సూచన ఏమిటంటే, అజ్ఞాత దళసభ్యులు, వారికి సహకరించే మిలీషియా, ఆర్పిసి సభ్యులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి జన జీవన స్రవంతిలో కలిసి మీ కుటుంబ సభ్యులతో ప్రశాంతమైన జీవనం గడుపుటకు, మీ అభివృద్ధికి కావలసిన పునరావాస సౌకర్యాలు కల్పించుటకు తెలంగాణ పోలీసు శాఖ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు కృషిచేస్తారు.

**– లొంగిపోయిన వారి వివరాలు...**

చత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లాకు చెందిన మడవి హంగా, బీజాపూర్ జిల్లాకు చెందిన సున్నం లచ్చు, సవలం లలిత, సుప్మా జిల్లాకు చెందిన మడవి శ్యుల, మడవి బండి, నుప్ప లక్ష్మీ, కోవాసి అడుమ, మడకమ్ సొందు, వంజముంగ, కల్మదుడువా, మడివి లక్మ, మడకం సహదేవ్, ముచ్చకి దాదే , కోవాసి నందే, మడకం హడుమా, నుప్పో మూయా తదితరులు ఉన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజుతో పాటు కొత్తగూడెం అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ జి.నరేందర్,భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, 141 బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ ప్రీతా, 81 బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ రవిశర్మ, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్,చర్ల సీఐ రాజు వర్మ, ఆర్ఐ ఆపరేషన్స్ రవి తదితరులు పాల్గొన్నారు.



# ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి పునర్జన్మను ప్రసాదించేది రక్తదానం

**-డా.అక్కినేని లోకేష్**

**-మదర్ తెరిసా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం**



**భద్రాచలంటౌన్, శుక్రవారం 30,ప్రభాతవార్త :** తల సేమియా, సికిల్‌సెల్‌అనీమియాతో బాధపడుతున్న చిన్నారుల కోసం భద్రాచలం పట్టణంలోనీ స్థానిక రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ నందు మదర్ తెరిసా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం చేశారు. శిబిరానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీ సురక్ష హాస్పిటల్ డైరెక్టర్ క్రిటికల్ కేర్ వైద్య నిపుణులు డా.అక్కినేని లోకేష్ మాట్లాడుతూ.. ఏజెన్సీలో మదర్ తెరిసా చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న రక్తదాన శిబిరాలు, వివిధ సేవలను కొనియాడారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి పునర్జన్మను ప్రసాదించడం ఒక్క రక్తదానంతోనే సాధ్యమని అన్నారు. రక్తదాన శిబిరంలో రక్తదానం చేసిన రక్తదాతలను అభినందించి అనంతరం రక్తదాతలకు ప్రశంస పత్రాన్ని షీల్డ్ లను అందజేశారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు రావాలని కోరారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకులు చైర్మన్ కొప్పుల మురళి మాట్లాడుతూ మన ఏజెన్సీ ప్రాంతంలో చాలామంది తల సేమియా, సికిల్‌సెల్‌అనీమియా వ్యాధితో తో బాధపడుతున్న చిన్నారులకు సరైన సమయంలో రక్తం దొరకక ఇబ్బంది పడుతుండటంతో చిన్నారుల కోసం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. రక్తదాన శిబిరంలో పదిమంది రక్తదానం చేశారని తెలిపారు. తుల సేమియా , సికిల్ సెల్ అనీమియా తో బాధపడుతున్న చిరునరులు 15 రోజులకు ఒకసారి నెలకు ఒకసారి రక్తం ఎక్కించుకోవాల్సిన పరిస్థితి ఉందని ఉన్నారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి చిన్నారులను ఆదుకోవాలని కోరారు. అడగగానే స్పందించి రక్తదానం చేసిన రక్తదాతలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ భాద్యులు ఈసీఎంసీ మెంబర్ సూర్యనారాయణ, టెక్నీషియన్స్ ఆదినారాయణ, పార్ధు, ప్రమోద్, ట్రస్టు నిర్వాహకులు పానెం. లక్ష్మీనారాయణ , చోళ ఇన్సూరెన్స్ మేనేజర్ బాలరాజు , సాయి కుమార్, చందు, నవీన్ ,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలు అమ్మి రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవు

**మండల వ్యవసాయ అధికారి ఉమామహేశ్వర్ రెడ్డి**



**రఘునాధపాలెం మే 30 ప్రభాత వార్త** మండల పరిధిలోని రఘునాధపాలెం మంచుకొండ గ్రామాలలోని విత్తనాల షాపుల యందు మండల టాస్క్ ఫోర్స్ రఘునాధపాలెం పోలీసులు మండల వ్యవసాయ అధికారి కర్నాటి ఉమామహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో విత్తనాల షాపులను శుక్రవారం విస్తృతంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ అధికారులు మాట్లాడుతూ... నకిలీ విత్తనాలతో రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు ప్రభుత్వం ద్వారా లైసెన్స్ కలిగిన విత్తన షాపుల యందు మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని విత్తనాలు కొనుగోలు చేసిన తర్వాత విత్తన రసీదు తప్పనిసరిగా తీసుకొని పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపరుచుకోవాలని సూచించారు. రైతులు స్థానిక పరిస్థితుల అనుకూలమైనటువంటి మంచి దిగుబడినిచ్చే మంచి కంపెనీల విత్తనాలను ఎంచుకోవాలని తెలియజేశారు.గ్రామాలో తిరుగుతూ అధిక దిగుబడి ఆశ చూపిస్తూ బిల్లులు లేకుండా విత్తనాల కొనుగోలు చేసేవారి నుంచి అప్రమత్తంగా ఉండాలని అటువంటి వారి దగ్గర నుంచి విత్తనాలను కొనుగోలు చేయకూడదని హెచ్చరించారు. నిషేధిత గడ్డి మందు తట్టుకొని పెరిగేటటువంటి పత్తి వంగడాలను ప్రభుత్వం అనుమతి లేదని అటువంటివి విత్తనాలు కొనుగోలు జరిగిన వెంటనే పీడీ యాక్ట్ కింద నేరంగా పరిగణిస్తారని వారు తెలియజేశారు. విత్తన వ్యాపారులందరూ నాణ్యమైన విత్తనాలను రైతులకు అందజేయాలని అనుమతి లేని విత్తనాలను విక్రయించినచో చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

# రాజ్యాంగ రక్షణ కొరకు మాలల మహా జాతర కరపత్ర ఆవిష్కరణ



**సారపాక, మే 31 ,ప్రభాతవార్త:** మాల మహానాడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు పూల.రవీందర్ ఆదేశాల మేరకు బూర్గంపాడు మండలం సారపాక గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద మాలల మహా జాతర కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమంలో పినపాక నియోజకవర్గ అధ్యక్షుడు తుమ్మల.కిరణ్, పినపాక నియోజకవర్గ ఇన్చార్జి పిల్లి.రవివర్మ, ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులు భూపల్లి.నరసింహారావు మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల కొత్తగూడెం క్లబ్బులో జూన్ 8 ఆదివారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగు జిల్లా వ్యాప్త మాలల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి పినపాక నియోజకవర్గంలో అన్ని మండలాల్లో మాల కుటుంబాలన్నీ రాజకీయాలకు అతీతంగా ప్రతి మాల కుటుంబం పాల్గొనాలని ఒక ఆహ్లాదకర వాతావరణంలో సంతోషంగా ఆరోజు అక్కడ జరిగే సాంస్కృతిక కార్యక్రమాల తో, ఆటపాటలతో, పిల్లలు, పెద్దలు అందరూ కలిసి సంతోషంగా గడపాలని,రాజ్యాంగాన్ని రక్షించుకొనుటకు, మాలల హక్కులను కాపాడుకొనుటకు భవిష్యత్తులో ముందుకు ఏ విధంగా పయనిద్దామని, భవిష్యత్తు కార్యాచరణ కూడా అందరూ కలిసి నిర్దేశించుకోవాలని, దాని కొరకు మాలలు అందరూ ఐక్యం కావాల్సిన అవసరం ఉందని, ఈ జిల్లా వ్యాప్త ఆత్మీయ సమ్మేళనం మనందరికీ ఒక వేదికగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మాలల మహా జాతర జరగాలని, ఈరోజు ఆవిష్కరించిన కరపత్రం ప్రతి ఇంటి తలుపు తట్టాలని బూర్గంపాడు మండలం లో ఉన్న మాల కుటుంబాలలో ప్రతి ఒక్కరూ జూన్ 8న జరగబోయే ఆత్మీయ సమ్మేళనంలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొనకంచి.శ్రీను, కొట్టే.అనిల్,పాలకుర్తి.ప్రభాకర్,మేక.శేషమ్మ,ఇలంగి.లాలయ్యా, దాసరి.మోహన్,చెలికాని.ప్రవీణ్,జినుగు. దాసు,చెలికాని.లక్ష్మణ్, లేడా.సాంబ,చెలికాని.శశి,తుమ్మల.బాలు తదితరులు పాల్గొన్నారు.

# వద్దన్నా వినడంలేదు... జరిమానాల గురయ్యారు

**నగరట్రాఫిక్ ఏసీపి ,శ్రీనివాసులు**

**క్రైమ్ ఖమ్మం మే 30 ప్రభాత వార్త ;** ఖమ్మం నగరంలో కొంతకాలం మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని తల్లిదండ్రులకు అవగాహన కల్పించిన ప్రయోజనం లేకుండా పోతుంది, వద్దన్నా వినకుండా రోడ్లమీదకు వాహనాలు నడుపుతూ 12 మంది మైనర్ డ్రైవర్లు జ రిమానాలకు గురయ్యారు, నగరట్రాఫిక్ ఏసిపి బాణాల శ్రీనివాసులు శుక్రవారం పత్రికలకు విడుదల చేశారు, వాహనాలు నడిపిన ఒక్కొక్కరికి 200 రూపాయలు చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు వెలువడిందని తెలిపారు, ఇటీవల కాలంలో నగరంలో వాహనాలు తనిఖీలు నిర్వహించిన క్రమంలో 12 మంది మైనర్లు పట్టు బడ్డ వారిని కోర్టులో ఆధారపరిచారు, మొదటి అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ బి రజిని తీర్పు వెల్లడించారు, రాబోవు రోజుల్లో కూడా మైనర్ డ్రైవింగ్ తనిఖీలు ప్రత్యే డ్రైవ్ నిర్వహించి వారికి అవగాహన కల్పించి వాహనలు నడపవద్దని పట్టుబడితే శిక్షలు తప్పవని హెచ్చరించారు.

# మనోహరంగా రామయ్య కళ్యాణం

**భద్రాచలంకల్చరల్, ప్రభాతవార్త :**



భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి కళ్యాణం మనోహరంగా సాగింది. ఉదయమే పవిత్ర గోదావరి నదీ తీరం నుండి తీర్థపు బిందెలో మంగళవాయిద్యాలు, వేదమంత్రాలు నడుమ నదీ జలాలను తీసుకుని శ్రీస్వామి వారి మూలవరులకు, ఉత్సవమూర్తులకు అభిషేక కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పల్లకీలో భక్తుల జయ జయ ధ్వానాల నడుమ శ్రీస్వామి వారి ఉత్సవమూర్తులను బేడా మండపానికి తీసుకుని వచ్చి ఆశీనులను చేశారు. అర్చకులు అమరవాది మధుసూదనాచార్యులు, పొడిచేటి రామభద్రాచార్యులు... ముందుగా శ్రీస్వామి వారి సహస్ర నామార్చన, తదుపరి క్షేత్ర మహాత్యాన్ని భక్తులకు వివరించారు. కళ్యాణతంతులో భాగంగా శ్రీస్వామి వారికి విశ్వక్సేనపూజ, పుణ్యాహవాచన, శ్రీస్వామి వారి, అమ్మవార్ల ప్రవరలు, యోత్రధారణ, కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, మహాసంకల్పం, మంగళాష్టకాలు, చూర్ణిక, సుముహూర్తం, మాంగళ్యపూజ, మాంగళ్యధారణ, అక్షతారోపణ, వేదాశీర్వచనం, మంగళాశాసనంతో కళ్యాణతంతు ముగిసింది. కళ్యాణం జరుగుతున్నంత సేపు కళ్యాణంలో పాల్గొన్న దంపతులు కన్నులారా



శ్రీసీతారామచంద్రస్వామి వార్లను చూస్తూ తరించిపోయారు. వేదపండితుల మంత్రోచ్ఛరణలకు తన్మయత్వంతో పులకరించిపోయారు. అనంతరం కళ్యాణంలో పాల్గొన్న దంపతులకు దేవస్థాన సిబ్బంది కళ్యాణలడ్డూ, శ్రీస్వామి వారి వస్త్రాలు, అక్షతలు పంపిణీ చేశారు.

# పర్ణశాలలో ఘనంగా రామయ్య కళ్యాణం

**దుమ్ముగూడెం, ప్రభాతవార్త :**



భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థాన అనుబంధ దేవాల యమైన దుమ్ముగూడెం మండలంలోని పర్ణశాల దేవాలయంలో శుక్రవారం పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని సీతారాముల కళ్యాణం ఘనంగా జరిగింది. అర్చకస్వాములు ఉదయమే తీర్థ బిందెలో తీసుకొని వచ్చి పర్ణశాల సీతాలక్ష్మణ సమేత రామచంద్ర మహాప్రభువుల వారికి పంచామృతములతో విశేష అభిషేకము తిరుమంజనం నిర్వహించారు. అనంతరం స్వామివారికి పునర్వసు నక్షత్ర కళ్యాణ మహోత్సవాన్ని అర్చక స్వాములు సాంప్రదాయ బద్ధంగా అంగరంగ వైభవంగా నిర్వహించారు. కళ్యాణతంతులో భాగంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనము, మాంగల్య ధారణ, అనంతరం కళ్యాణ తలంబ్రాలు ఘట్టములను వైభవంగా జరిపారు. భక్తులు ఇట్టి కార్యక్రమమును వీక్షించి స్వామివారి కల్యాణ అక్షతలు శిరసన ధరింపజేసుకున్నారు.అనంతరం దేవస్థానం తరుపున ఏర్పాటుచేసిన ప్రత్యేక ప్రసాదాన్ని స్వీకరించి స్వామివారికి అమ్మవారికి కట్నం, కానుకలు సమర్పించి తరించారు. కార్యక్రమం ఆలయ ఇన్చార్జి అనిల్ కుమార్ వారి పర్యవేక్షణలో జరగగా, ఆలయ ముఖ్య అర్చకులు మదన మోహనాచార్యులు, భార్గవాచార్యులు, వెంకటాచార్యులు పాల్గొన్నారు.

